www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



12 అనంతపురం

సోమవారం 28 ఆగస్టు 2017

జై గణేశా.. జై జై గణేశా..!



గుంతకల్లులో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు

వినాయక చవితిని పురస్కరించుకుని శుక్రవారం కొలువుదీర్చిన వినాయకులను ఆదివారం గంగ ఒడికి చేర్చారు. భక్తులు వాడవాడలా మండపాలను ఏర్పాటుచేసి గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. జిల్లాలోని పలు చోట్ల ఆదివారం నిమజ్జనం ఘనంగా నిర్వహించారు.

స్పెషల్ డ్రైవ్‌తో
ప్రయోజనమెంత?

జరిమానాలు, అవగాహనతో ఆగని రోడ్డు ప్రమాదాలు

- తలకు బలమైన గాయాలతోనే మృత్యువాత
- ద్విచక్ర వాహన చోదకులే అత్యధికం
- హెల్మెట్లే ప్రాణాలకు రక్ష
- వాటిని తప్పనిసరి చేస్తేనే ఫలితం
- ఆ దిశగా చర్యలకు శ్రీకారం చుట్టేరా..?





ఆంధ్రజ్యోతి, అనంతపురం

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్ వల్ల ప్రయోజనమెంత? ప్రస్తుతం జిల్లాలో ఇదే సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. జిల్లా ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్ తీసుకుంటున్న చర్యలు రోడ్డు ప్రమాదాల నియంత్రణకు దోహదపడుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతున్నప్పటికీ.. పూర్తి స్థాయిలో ఫలితమివ్వడం లేదనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా హెల్మెట్ లేకపోవడం వల్లనే రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు చనిపోతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ అంశాన్ని ప్రత్యేకంగా చూడాల్సిన అవసరముందని మేధావివర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ద్విచక్ర వాహనాన్ని మరో వా హనం ఢీ కొన్నప్పుడు దాన్ని నడిపే వ్యక్తి కిందపడి.. తలకు బలమైన గాయం తగలడం వల్లనే ఎక్కువ సందర్భాల్లో చనిపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడి ఉన్నట్లయితే ఆ తరహా రోడ్డు ప్రమాదాల వల్ల చనిపోయేవారు చాలా తక్కువ మంది ఉంటారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. శరీరంలో ఎక్కడ గాయాలైనా మనిషి ప్రాణాలకు అంతగా ముప్పుండదు. తలకు గాయమైతే మాత్రం బతకడం దాదాపు అసాధ్యమనే చెప్పవచ్చు. ఈ నెలారంభం నుంచి ఇప్పటివరకు 30కిపైగా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 21 మందికిపైగా చనిపోయారు. ఇందులో

మిగతా 5లో





తుంగభద్ర డ్యామ్‌లో నీటిని పరిశీలిస్తున్న మంత్రి కాలవ శ్రీనివాసులు

30న నీటి విడుదల!

- అధికారుల సుముఖత
- తుంగభద్ర డ్యామ్, కర్ణాటకలో కాలువను పరిశీలించిన మంత్రి కాలవ
- తాగునీటి అవసరాలకు నీరు విడుదల చేస్తాం : బోర్డు ఎస్ఈ
- రోజూ 1500 క్యూసెక్కులు అవసరం : శేషగిరిరావు, ఎస్ఈ , హెచ్చెల్సీ

12లో

బదిలీ వేటుకు రంగం సిద్ధం?

హిందూపురంలో

వరుస ఘటనలు

- పోలీసు అధికారుల తీరుపై ఉన్నతాధికారుల సీరియస్
- శాంతిభద్రతల పరిరక్షణలో ఘోర వైఫల్యం
- స్థానికులతో సత్సంబంధాలున్నట్లు ఆరోపణలు
- బాధ్యులను గుర్తించి.. ప్రక్షాళనకు చర్యలు
- గణేశ్ నిమజ్జనం తరువాత స్థానచలనం!

2లో



ఆ రెండు శాఖల్లో

ఇన్‌చార్జిల పాలనకు తెర?

- డీఈఓ, ఎస్ఎస్ఏ పీఓ నియామకాలకు అవకాశం
- ప్రమోషన్ల సీనియారిటీ జాబితా సిద్ధం
- వారంలో ముహూర్తం... ఆ వర్గాల్లో టెన్షన్

5

వినాయక నిమజ్జనంలో

అపశ్రుతులు

ఇద్దరు యువకుల దుర్మరణం... శెట్టూరులో ఒకరు..

తాడిమర్రి మండలం మద్దెల చెరువులో మరొకరు

8



మాట్లాడుతున్న శ్రీధర్

క్రీమీలేయర్ ఆదాయ పరిమితి

రూ.15 లక్షలకు పెంచాలి

బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డిమాండ్

ఆంధ్రజ్యోతి, అనంతపురం: క్రీమీలేయర్ ఆదాయపరిమితి రూ. 15 లక్షలకు పెంచాలని బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డిమాండు చేసింది. ఈ మే రకు ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల స మావేశంలో జిల్లా అధ్యక్షుడు పుట్టా శ్రీధర్ మాట్లాడారు. కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో ఓబీసీ రిజర్వేషన్లను కేటగిరీలుగా విభజించి, వెనుకబడిన బీసీ వర్గాలకు రిజర్వేషన్ల ఫలాలు అందించేదిశగా అడుగులు వేయడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. అయితే క్రీమీలేయర్ ఆదాయ పరిమితి రూ. 8 లక్షలకే పరిమితం చే యడం సబబుకాదన్నారు. మండల స్థాయిల్లో క్రీమీలేయర్‌పై అవగాహన కల్పించేందుకు స్థానిక రెవెన్యూ అధికారులకు ఆదేశాలివ్వాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఆ సం ఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగభూషణం, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ బాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీలో నలుగురికి ఉద్యోగోన్నతి

అనంతపురం జిల్లాపరిషత్తు: జిల్లాపరిషత్తు పరిధిలో పనిచేస్తున్న నలుగురికి ఉద్యోగోన్నతులు లభించాయి. జిల్లావ్యాప్తంగా నలుగురు రికార్డ్ అసిస్టెంట్లకు జూనియన్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆదివారం జడ్పీ చైర్మన్ చమన్ సాబ్ వారికి ఉద్యోగోన్నతి ఉత్తర్వుల కాపీలు అందజేశారు. విధులు సక్రమంగా నిర్వర్తించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీ-బాలుడికి గాయాలు

ఆంధ్రజ్యోతి, అనంతపురం: నగర శివారులోని భైరవ నగర్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదేళ్ల బాలుడు తప్జాన్‌కు తీవ్ర రక్తగాయాలయ్యాయి. స్థానికంగా నివాసముంటున్న మహబూబ్‌బాషా తన కుమారుడు తప్జాన్‌తో కలసి నడిచి వెళ్తుండగా వెనుకవైపు నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం సదరు బాలుడిని ఢీ కొంది. దీంతో సదరు బాలుడు తీవ్ర రక్తగాయాలకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి ఆందోళన కరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీ వేటుకు రంగం సిద్ధం?

పలు ఘటనలపై సీరియస్...
పురం పోలీసుశాఖలో
ప్రక్షాళనకు శ్రీకారం
నిమజ్జనం తరువాత బదిలీలు

హిందూపురం టౌన్: వాణిజ్యకేంద్రంగా పేరుగాంచిన హిందూపురంలో కొం తకాలంగా చోటుచేసుకుంటున్న సంఘటనలను పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణిస్తున్నారు. వాటికి బాధ్యులైన వారిపై బదిలీ వేటు వేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు విశ్వసనీయసమాచారం. ముఖ్యంగా ఇక్కడ ఎ మ్మెల్యేగా నందమూరి బాలకృష్ణ ఉండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా చూడాలని, అందుకు ఏరకమైన చర్యలు తీసుకున్నా రాజకీయ ఒత్తిళ్లు ఉండవని స్థానిక పోలీసు అధికారులకు ఉన్నతా ధికారులు పలుమార్లు సూచించారు. అయినా.. ఇటీవల హిందూపురంలో వరుస సంఘటనలు చోటు చేసుకుంటూండడంతో పోలీసులు కలవరానికి గురవుతున్నారు. ఈ సంఘటనలు చిలికి చిలికి గాలివానగా మారుతుండడంతో ప్రతి విషయంలోనూ ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాల్సి వస్తోం ది. ఈ క్రమంలో ఎలాగైనా స్థానిక పోలీసుల చేతుల్లోకి శాంతిభద్రతలు తీసుకురావాలని ఉన్నతాధికారులు శాయశక్తులా కృషి చేస్తున్నారు. అయితే కొన్ని సంఘటనలపై స్థానిక పోలీసు అధికారులు వెంటనే స్పందించకపోవడంతో వారిని డీఐజీ సీరియస్‌గా హెచ్చరించినట్లు తెలిసింది. అలాగే పట్టణంలో శాంతిభద్రతలు ఎలాగైనా పరిరక్షించాలని పెనుకొండ డీఎస్పీ కరీముల్లాషరీఫ్ స్వయంగా హిందూపురంలో మకాం వేశారు. అయినా ఇటీవల కొన్ని సంఘటనలు చేయిదాటిపోతున్నాయి. ముఖ్యంగా కొంతమంది స్థానికులతో ఇక్కడ పనిచేస్తున్న సీఐలకు సత్సంబంధాలున్నందునే శాంతి భద్రతలు అదుపుచేయడంలో విఫలమవుతున్నారనే వాదన వినిపిస్తోంది. దీంతో ఇక్కడ పనిచేస్తున్న మూడు సర్కిళ్ల సీఐలపై వేటు వేయడానికి రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. సీఐలతోపాటు మరికొంతమంది ఎస్‌ఐలను కూడా సెప్టెంబర్ రెండో వారంలో సాగనంపడానికి ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఓ సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ మాత్రం ఇక్కడే కొనసాగడానికి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ సీఐని ఇక్కడే ఉంచాలని అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. ఈ విషయం ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిసింది. వీరు బదిలీఅయిన వెంటనే మంచి పట్టున్న సీఐలు, ఎస్‌ఐలను హిందూపురానికి తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ప్రస్తుత సీఐలు, కొంతమంది ఎస్‌ఐలను వినాయక నిమజ్జనం తరువాత బదిలీచేసేందుకు రంగం సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది.

త్వరలో అనంతలో 'విజ్ఞాన' కేంద్రం ఏర్పాటు

ప్రజాచైతన్యమే లక్ష్యంగా నిర్వహణ
విద్యార్థులు, యువత, మహిళలకు ప్రోత్సాహం
విజ్ఞాన కేంద్రాల నిర్వహణ
రాష్ట్ర కన్వీనర్ మురళీకృష్ణ



మాట్లాడుతున్న మురళీకృష్ణ

అనంతపురం టౌన్: రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో సామాజిక, సాంస్కృతిక, మేధోపరమైన చైతన్యం కల్పించే దృఢ సంకల్పంతో విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర విజ్ఞాన కేంద్రాల నిర్వహణ కన్వీనర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక గణేనాయక్‌భవన్‌లో ఆదివారం జిల్లాలో విజ్ఞానకేంద్రం ఏ ర్పాటుపై మెడికల్ రెప్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు రాజామోహన్ అధ్యక్షతన ప్రజాసంఘాలు, మేధావులు, సాహితీవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ..సామాజిక మార్పు కోరే భావజాలాన్ని పటిష్ట పరిచేందుకు ఈ విజ్ఞాన కేంద్రాలు దోహదపడతాయన్నారు. ప్రస్తుత సమాజంలో ఆర్థికపరమైన, అనుకూలమైన సంస్కృతిని పాలకులు తమకు అనుకూలంగా మార్చుకుని ప్రజలపై రుద్దుతున్నారన్నారు. అభివృద్ధి నిరోధక, ఛాందసవాద, అశాస్త్రీయ భావజాలాన్ని ప్రజలపై రుద్దుతున్నారన్నారు. విద్యార్థులు, యువత, మహిళలపై అనేక దుష్ప్రభావాలు కలుగజేస్తున్నారన్నారు. ఇలాంటివాటికి అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా విజ్ఞానకేంద్రాల ఏర్పాటు ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్య, సోషలిస్టు భావజాలంతో అనేక కూటములు మార్పు కోరుకుంటున్నాయన్నారు. ఇలాంటివారికి విజ్ఞాన కేంద్రాలు కార్యక్షేత్రాలుగా ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. జిల్లాలో త్వరలోనే విజ్ఞానకేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా సామాజికమార్పు కోరే భావజాలంతో ఈ విజ్ఞాన కేంద్రం అందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. ప్రాచీన కలలు, సంప్రదాయాలు, మానవత్వం ప్రతిబింబించే కార్యక్రమాలు, మానసిక వి కాసం, శారీరక దృఢత్వం, స్ఫూర్తి, సామాజిక అంశాలపై చర్చాగోష్టులు, సహవేశాలు, సదస్సులు విజ్ఞాన కేంద్రం నిర్వహణలో భాగమన్నారు. రాజమోహన్ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువతను చైతన్యపరచడం ఎంతో అవసరమన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారికి ఈ కేంద్రాలు తోడ్పాటుగా ఉంటాయన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మా ట్లాడుతూ... అనంతపురం లాంటి కరువుజిల్లాలో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలనుకోవడం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. సామాజిక చైత న్యం పెంపొందించేదిశలో ఈ అంశాన్ని అన్ని వర్గాల వారు స్వాగతించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో ఎంబీ భవన్ నిర్వహణ కమిటీ సభ్యు లు అజయ్ కుమార్, యూటీఎఫ్ నాయకులు ప్రజ్ఞా సురేష్, లెక్చరర్ డాక్టర్ ప్రగతి, ఐద్వా నాయకులు లక్ష్మీదేవి, సావిత్రి, మెడికల్‌రెప్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, చంద్ర, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు కృష్ణమూర్తి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నల్లప్ప, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యచంద్ర, ప్రజాసంఘాల నాయకులు పెద్దన్న, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

కసాపురం ఆలయ సమాచారం ఖాద్రి

కసాపురం

కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు అభిషేకాలు, అలంకారాలు, పూజా కార్యక్రమాలు. 5 గంటలకు సర్వదర్శనం. మధ్యాహ్నం 12 గంటలకు మహానివేదన, మహా మంగళ హారతి. మధ్యాహ్నం ఆలయం మూసివేత. 2 గంటలకు ఆలయంలో పూజల పునఃప్రారంభం. సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు జరుగుతాయి. రాత్రి 8 గంటలకు మహామంగళ హారతి.



ఖాద్రి

శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 28 న సోమవారం ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు శ్రీవారి దర్శనం ఉంటుంది. 7.30 గంటల నుండి 10 గంటల వరకు అభిషేకాలు ఉంటాయి. 10.30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీవారి దర్శనం ఉంటుంది. సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు శ్రీవారి దర్శనం ఉంటుంది.





ప్రాకృతిక వ్యవసాయాన్ని పరిశీలించిన ప్రత్యేక కార్యదర్శి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ప్రత్యేక కార్యదర్శి

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లి పంచాయతీలో జరుగుతున్న ప్రాకృతిక వ్యవసాయాన్ని రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి విజయ్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. జేడీఏ శ్రీరామ్మూర్తితో కలిసి ఆయన గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రకృతి సిద్ధంగా లభ్యమయ్యే వాటిని వినియోగించి వ్యవసాయం చేసే పద్ధతుల గురించి రైతులనడిగి తెలుసుకున్నారు. అనంతరం విజయ్‌కుమార్ మాట్లాడుతూ రసాయనిక ఎరువులు వినియోగించి పండించే పంటలకన్నా ప్రకృతిసిద్ధంగా లభించేవాటితో ఎరువులు తయారు చేసుకోవడం గురించి ప్రతి రైతూ తెలుసుకోవాలని సూచించారు. మంచి ది గుబడులు రావడమేకాక పంటల్లో పౌష్టిక విలువలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు లక్ష్మానాయక్, ఏడీఏ కృష్ణమీనన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూ దూరవిద్య బీఈడీకి మోక్షం

ఎస్కేయూ: వర్సిటీ ఉపాధ్యాయ దూరవిద్య విభాగంలో ఉపాధ్యాయ విద్యార్థులకు బోధించడానికి జాతీయ ఉపాధ్యాయ మండలి(ఎన్‌సీఈటీ,ఢిల్లీ) అనుమతులు మంజూరు చేసినట్లు దూరవిద్య మాజీ సంచాలకుడు ఆచార్య వెంకటనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. బోధకులు లేరనే కారణంతో 2015వ సంవత్సరం నుంచి జాతీయ ఉపాధ్యాయ మండలి వారు అనుమతి నిరాకరించారు. దీంతో అప్పటి దూరవిద్య సంచాలకుడు వెంకటనాయుడు ఢిల్లీకి వెళ్లి ఎస్కేయూలో ఉపాధ్యాయులను నియమించడానికి కోర్టులో ఎదురవుతున్న సమస్యలను ఎన్‌సీఈటీ అధికారులకు వివరించారు. దీంతో 2017-18 సంవత్సరానికి అనుమతులు ఇచ్చారు. ఎన్‌సీఈటీ 2014 నిబంధనల ప్రకారం యూనివర్సిటీకి కేటాయించిన 500 సీట్లను.. ఎస్కేయూ పరిధిలో అనుమతి పొందిన కాలేజీలకు 50 సీట్లు చొప్పున కేటాయించాలని, 2014 నిబంధనలు విధిగా పాటించాలని, లేనిపక్షంలో తిరిగి అనుమతి రద్దు చేస్తామని ఎన్‌సీఈటీ హెచ్చరించిందని ఆయన పేర్కొన్నారు. అనుమతులు వచ్చినందున దూరవిద్య విభాగానికి రూ. కోటి ఆదాయం సమకూరుతుందన్నారు.

గుంతకల్లు మీదుగా

విజయవాడ రైలు మళ్లింపునకు కృషి

ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ దివాకర్ రెడ్డి

గుంతకల్లు: స్థానిక ప్రజల కోరిక మేరకు ధర్మవరం-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌ను గుంతకల్లు మీదుగా మళ్లించడానికి కృషిచేస్తానని అనంతపురం ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం గుంతకల్లుకు వచ్చిన ఎంపీ స్థానిక ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడు ఇంటికి వెళ్లి ఆయన ఆతిథ్యం స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ రైలుతో పాటు ఇతర రైళ్లను కల్లూరు-ఖాదర్‌పేట్ రూటులో గుంతకల్లుకు వచ్చేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఆదోని-డోన్ రైలు మార్గాలను కలపడానికి ఉన్న బైపాస్ రైల్వే లైన్ ప్రతిపాదనకు అమోదం లభించి, నిధులు విడుదలయ్యేలా ప్రయత్నిస్తానన్నారు. 'ఆంధ్రజ్యోతి' అడిగిన ఓ ప్రశ్నకు ఎమ్మెల్యే జితేంద్రగౌడు సమాధానమిస్తూ గుంతకల్లు మండలం గొల్లలదొడ్డి వద్ద ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్యస్థాయి పరిశ్రమల పార్కు స్థాపనకు సంబంధించి భూసేకరణ కార్యక్రమం ఓ కొలిక్కి వచ్చిందన్నారు. అసైన్డ్ భూమితోపాటు, ప్రైవేటు భూమి కొనుగోలుకు రైతులను ఒప్పించామన్నారు. వీలయినంత త్వరలో ప్రభుత్వం అక్కడ పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం పట్టణంలో తాగునీటి పరిస్థితి, అమృత్‌పానీ పథకం అమలు విషయమై మున్సిపల్ ఛైర్‌పర్సన్ అపర్ణ, కమిషనర్ సత్యనారాయణ, ఎంఈ ఈశ్వరయ్యతో ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి చర్చించారు. పురపాలక సంఘంలో పనులు సక్రమంగా జరగడంలేదంటూ ఛైర్‌పర్సన్ అపర్ణ ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కృపాకర్, లక్ష్మీనారాయణ, అన్వర్‌బాషా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు ధర్మతేజ్ గౌడు, సంజీవ్‌కుమార్ గౌడు, పీజీఎస్ బాబు, కోడెల చంద్రశేఖర్, జీ కోటిరెడ్డి, టీ మస్తానప్ప, లక్ష్మయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్ నాయకులతో భేటీ

రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకుల విన్నపం మేరకు ఎంపీ దివాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడు ఆ సంఘం కార్యాలయానికి వెళ్లారు. యూనియన్ డివిజన్ కార్యదర్శి విజయకుమార్, ఏడీఎస్ బాలాజీ సింగ్, నాయకుడు శ్రీనివాస శర్మ ఎంపీకి రైల్వే సమస్యలపై విన్నవించారు. కసాపురం రోడ్డులోని రైలు వంతెనను వెడల్పుచేయాలని, బైపాస్ లైన్ నిర్మాణం చేపట్టాలని, గుత్తి మీదుగా వెళ్లే రైళ్లను గుంతకల్లు మీదుగా మళ్లించి రైల్వే డివిజన్‌కు తగిన న్యాయం చేయాలని కోరారు.

చిన్నచూపు చూస్తే సహించం

ఉద్యోగ భద్రత కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమం

ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకాశి



మాట్లాడుతున్న బాలకాశి

అనంతపురం అర్బన్: కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులమని చిన్న చూపు చూస్తే సహించబోమని సర్వశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకాశి హెచ్చరించారు. స్థానిక హెచ్ఎల్‌సీ కాలనీ సమీపంలో గల వీకే భవన్‌లో ఆదివారం ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగుల సమావేశం జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోరాటాలు చేసినప్పుడే హక్కులు సాధించగలుగుతామన్నారు. ఉద్యమాలు చేయడం వల్లనే టీడీపీ ప్రభుత్వం జీతాలు పెంచిందన్నారు. ఇదే స్ఫూర్తితోనే ఉద్యోగభద్రత కోసం కలిసికట్టుగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. అలాగే ప్రభుత్వ ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బందికి ఏ విధంగా సౌకర్యాలు కల్పిస్తున్నారో.. అలాగే మనకూ కల్పించాల్సిందేనన్నారు. మహిళాఉద్యోగులకు ఆరు నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. కేజీబీవీలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. అలాగే ప్రతినెలా వేతనాలందేలా చూడాలని డిమాండు చేశారు. అనంతరం నూతన జేఏసీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు విజయ్, ప్రధాన కార్యదర్శి బాబ్‌జాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సౌభాగ్యలక్ష్మి, కోశాధికారి ఈశ్వర్, నాయకులు రమాదేవి, లలిత, అరుణ, ప్రభాకర్, మల్లేశ్వరి పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం కలెక్టరేట్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం వర్షం కురిసింది. మడకశిర, అమరాపురంలో ఓ మోస్తరుగా కురవగా, అనంతపురం, కదిరి, తనకల్లులో చిరుజల్లులు పడ్డాయి. ఓ మోస్తరు వర్షం కురిసిన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. మరికొన్ని ప్రాంతాల్లో పదును వర్షం కోసం ఎదురు చూస్తున్నారు.

కంబదూరు సీడీపీఓగా శాంతిలక్ష్మి

మరో ఇద్దరికి బదిలీలు

అనంతపురం వైద్యం: కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓగా శాంతిలక్ష్మి నియమితులయ్యారు. ఇంతకుముందు అక్కడ పనిచేస్తున్న శ్రీదేవి ఆ శాఖ మంత్రి పరిటాల సునీత సహాయకురాలుగా డెప్యుటేషన్‌పై వెళ్లిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కంబదూరు సీడీపీఓగా కర్నూలు జిల్లా పత్తికొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓగా పనిచేస్తున్న శాంతిలక్ష్మిని డెప్యుటేషన్‌పై నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ ఈనెల 25న ఉత్తర్వులు జారీ చేశారు. పెనుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టులో పనిచేస్తున్న సీడీపీఓ ప్రభావతిని కదిరి ప్రాజెక్టు ఏసీడీపీఓగా, హిందూపురం ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఏసీడీపీఓగా పనిచేస్తున్న లీలావిజయకుమారిని చెన్నెకొత్తపల్లి ప్రాజెక్టు ఏసీడీపీఓగా బదిలీ చేస్తు ఉత్తర్వులు జారీచేశారు. అయితే వీరందరూ ఒకటి రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నట్లు తెలిసింది.

24న గౌడ, ఈడిగ వివాహ పరిచయ వేదిక

అనంతపురం ప్రెస్‌క్లబ్: గౌడ, ఈడిగ కులాల్లో పెళ్లి సంబంధాల కోసం అన్వేషించే వారి కోసం జిల్లా గౌడ, ఈడిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 24న వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఆ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయ న మాట్లాడుతూ నంద్యాలకు చెందిన వాయిస్ స్వచ్ఛం ద సంస్థ వారి సహకారంతో ఈ వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వివాహ వేదికలో పాల్గొనే వారు తమ కుటుంబంలోని వధూవరుల వివరాలను సెప్టెంబర్ 20వ తేదీలోపు ఫొటోలతో www.goudakalyanavedica@gmail.comý లేదా సెల్ 9440684577, 9502854700లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మూరు లక్ష్మీనారాయణ, నాయనపల్లిరాజుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, వెంకటేష్, హరిప్రతాప్‌గౌడ్, సభ్యులు రమణాగౌడ్, శ్రీశైలం భాస్కర్‌గౌడ్, ఆకుతోటపల్లి విజయ్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.





నేటి నుంచి ఉచిత ధ్యాన, వైద్య, యోగా శిక్షణ

కళ్యాణదుర్గం రూరల్: ఈనెల 29నుండి శ్రీ సత్యసాయి ధ్యానమండలి వారిచే ఉచిత ధ్యాన, వైద్య, యోగా శిక్షణ తరగుతులు నిర్వహిస్తున్నట్లు యోగా గురూజీ సంపత్ తెలిపారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ రెండవ విడతగా శ్రీ సాయి సుబ్రమణ్యేశ్వర స్వామి కళ్యాణమంటపంలో ఈనెల 29నుండి 5వ తేదీ వరకు ఉచిత ధ్యాన, వైద్య, యోగా శిక్షణా తరగతులు ఉదయం 5గంటలకు, సాయంత్రం 6గంటలకు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా సోమవారం సాయంత్రం 6గంటలకు పిల్లల పెంపకం పెద్దల బాధ్యత అనే అంశంపై సెమినార్ ఉంటుందన్నారు.




కళ్యాణదుర్గం ఊరు చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న యువకులు శెట్టూరులో వినాయక విగ్రహాల ఊరేగింపు

కోలాహలంగా గణేశుడి నిమజ్జనోత్సవం

కళ్యాణదుర్గం టౌన్: అడుగడుగునా కోలాహలం.. డప్పు వాద్యాలు.. రంగులు చల్లుకుంటూ యువత కేరింత... వెరసి ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. పట్టణంలో గణేష్ నిమజ్జనాన్ని ఆదివారం భక్తులు కోలాహలంగా నిర్వహించారు. వినాయక చవితి రోజున పట్టణంలో పలు చోట్ల ప్రతిష్టించిన వినాయక విగ్రహాలను కనుల పండువుగా నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా పలు చోట్ల ఆయా వినాయక కమిటీ వారు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాక్టర్లు, లారీలు, ఆటోలపై విగ్రహాలను ఊరేగిస్తూ విగ్రహాల ముందు యువకులు, విద్యార్థులు నృత్యం చేస్తూ గణేష్ మహారాజ్‌కు జై.. అంటూ నినాదాలు చేశారు. విగ్రహాల ఊరేగింపులో నృత్యం చేస్తూ అత్యంత కోలాహలంగా గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తులు నిర్వహించారు. విగ్రహాలను పట్టణ పురవీధుల గుండా ఊరేగిస్తూ టీసర్కిల్, సాయిబాబా ఆలయం, బళ్లారిరోడ్డు, గాంధీసర్కిల్, వాల్మీకి సర్కిల్ తదితర ప్రాంతాల మీదుగా ఊరేగించి గ్రామశివార్లలోని ఊరు చెరువులో నిమజ్జనం చేశారు. గణేష్ నిమజ్జన సందర్భంగా పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ వెంకటరమణ, సీఐ శివప్రసాద్, ఎస్ఐలు శంకర్‌రెడ్డి, నబీరసూల్‌ల ఆధ్వర్యంలో సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కుందుర్పి: మండలంలోని అన్ని గ్రామాలలో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. గత మూడు రోజుల నుంచి వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడవ రోజు ఆదివారం కుందుర్పి, జంబుగుంపల, అపిలేపల్లి, మలయనూరు, ఎనుములదొడ్డి, బసాపురం, కరిగానపల్లి, తూమకుంట, బెస్తరపల్లి, వెంకటంపల్లి తదితర గ్రామాల్లో వినాయకుని విగ్రహాలను ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లలో ప్రధాన రహదారుల గుండా మేళతాళాలు, ఆట పాటలతో ఊరేగింపు నిర్వహించారు. వినాయకుని చెరువులు, కుంటల్లో నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. అనంతరం భక్తాదులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

బ్రహ్మసముద్రం: మండలంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను ఆదివారం నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో విగ్రహాల నిమజ్జనం వైభవంగా జరిగింది. బాణాసంచా పేలుస్తూ, డప్పులు వాయిస్తూ, యువత కేరింతలు కొడుతూ ఊరేగింపు నిర్వహించారు. ఎలాంటి ఘర్షణలు జరగకుండా పోలీసులు ముందస్తుగా చర్యలు తీసుకున్నారు.

శెట్టూరు: మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వినాయక విగ్రహాలను ట్రాక్టర్‌లు, ఎద్దుల బండ్లపై ఉంచి యువకుల కేరింతలు, నృత్యాలతో ఉత్సాహభరితంగా ఊరేగించారు. శెట్టూరు పోలీసులు ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు.





నిమజ్జనానికి ఊరేగింపుగా తరలివెళుతున్న వినాయక విగ్రహాలు

మున్సిపాలిటీ సాక్షిగా...
రోడ్లపై మురుగునీరు

కళ్యాణదుర్గం రూరల్: ఔను.. మున్సిపాలిటీ సాక్షిగా రోడ్లపై మురుగునీటి ప్రవాహం పట్టణంలో ఎక్కడపడితే అక్కడ ప్రవహిస్తోంది. సరిగ్గా మున్సిపల్ కార్యాలయం సమీపంలో... నిత్యం అధికారులు, ప్రజాప్రతినిదులు తిరిగే ప్రాంతంలో కూడా వ్యర్థపునీరు ప్రవహించడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

పట్టణంలోని ప్రధాన కూడలి టీసర్కిల్‌లో డ్రైనేజీ నీరు రోడ్లపై ఏరులై పారుతుండడంతో ప్రజలు దుర్గంధం భరించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్ల విస్తరణ అనంతరంసీసీరోడ్లు ఏర్పాటుచేస్తూ డ్రైనేజీల్లో నీరు రోడ్లపైకి వదులుతుండడంతో టీసర్కిల్ నుండి పాత బస్టాండు వరకు ముక్కు మూసుకుని నడవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక వాహనాలు వచ్చాయంటే పాదచారులపై వ్యర్థపు నీరు పడాల్సిందే. వ్యాపారస్తులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాదచారల అవస్థలు ఎనలేనివి. ఓవైపు దుర్గంధం మరోవైపు అడుగు వేయాలంటే భయం.. మరి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకనే ప్రధాన రోడ్లపైకి ఇలా మురికినీరు వదిలితే ఎలా అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు అయినా తమ సమస్యను పట్టించుకోవాలని నిత్యం ఉన్నతస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి.




మున్సిపల్ కార్యాలయానికి సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తోన్న మురుగునీరు

లోకల్ గైడ్
localguide

ఎమ్మెల్యే డైరీ

కళ్యాణదుర్గం టౌన్: శాసనసభ్యులు, ఉన్నం హనుమంతరాయ చౌదరి సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు.

కళ్యాణదుర్గం మార్కెట్‌లో కూరగాయల ధరలు



టమోట 40, పచ్చిమిర్చి 50, వంకాయలు 60, లావుమిర్చి 50, ఎర్రగడ్డలు 40, ఆలుగడ్డలు 20, బెండ 30, బీరకాయలు 30, బీన్స్ 40, కాకర 40, చౌడే కాయలు 30, క్యాబేజి 30, బీట్‌రూట్ 40, క్యారెట్ 60

కళ్యాణదుర్గంలో మాంసం ధరలు

మటన్ : 340, చికెన్ : 180, నాటుకోడి : 260
చేపలు : 120, కోడి గుడ్లు(డజన్) : 48

కళ్యాణదుర్గం సినిమాలు

సౌభాగ్య : జయజానకి నాయక , **వెంకటేశ్వర** :ఆనందోబ్రహ్మ, **నూర్‌ముబారక్** : వీఐపి 2

తిమ్మాపురంలో వైద్య శిబిరం



ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న వైద్య సిబ్బంది

కంబదూరు (తిమ్మాపురం): మండల పరిధిలోని తిమ్మాపురంలో ప్రాథమిక ఆరోగ్య వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆదివారం వైద్య సిబ్బంది ఒక బృందంగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి జ్వరాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు రోగులకు వివరించారు. అదేవిధంగా ఇంటి పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కాచిన నీటినే తాగాలని రోగులకు వైద్య సిబ్బంది సూచించారు. అనంతరం 20మందికి వైద్య చికిత్సలు అందజేసి మందులను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం రోడ్లు.. ప్రజలకు శాపం..!

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని సౌభాగ్య థియేటర్ వెనుక కాలనీకి వెళ్లే మార్గంలో సిమెంటు రోడ్డు ఉన్నా నాసిరకం పనులతో కొట్టుకుపోయిందని, నడవడానికి కూడా వీలులేని విధంగా రోడ్లు అధ్వానంగా మారాయని కాలనీవాసులు వాపోతున్నారు. రోడ్లపైనే చెత్తచెదారం పేరుకుపోవడం, వర్షం వచ్చిందంటే డ్రైనేజీల్లోని నీరు రోడ్లపై ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందన్నారు. ఎన్నిమార్లు అధికారులకు, కౌన్సిలర్‌కు విన్నవించినా ప్రయోజనం లేదని, ఇప్పటికైనా సిమెంటు రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.




సౌభాగ్య థియేటర్ సమీపంలో ధ్వంసమైన సీసీ రోడ్డు

ఆ రెండు శాఖల్లో ఇన్‌చార్జిల

పాలనకు తెర?

అనంతపురం అర్బన్: జిల్లా విద్యాశాఖ, సర్వశిక్షఅభియాన్(ఎస్‌ఎస్‌ఏ)లో ఇన్‌చార్జిల పాలనకు త్వరలోనే తెరపడనుంది. ఇక్కడ రెగ్యులర్ డీఈఓగా పనిచేస్తున్న అంజయ్య గత ఏడాది అక్టోబర్‌లో పదవీ విరమణ చేసిన విషయం విదితమే. అప్పటి నుంచి డీఈఓగా ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. ప్రస్తుతం గుత్తి డిప్యూటీ డీఈఓ పగడాల లక్ష్మీనారాయణ ఇన్‌చార్జి డీఈఓగా వ్యవహరిస్తున్నారు. సుమారు పది నెలలుగా ఆ శాఖకు ఇన్‌చార్జిల పాలనే దిక్కయింది. లక్ష్మీనారాయణ డీఈఓ పదవితో పాటు మొన్నటివరకూ 4 డివిజన్ల డిప్యూటీ డీఈఓ బాధ్యతలు కూడా నిర్వహిస్తూ వచ్చారు. తాజాగా రెగ్యులర్ డిప్యూటీ డీఈఓలను నియమించడంతో ఆయనకు కొంత ఉపశమనం కలిగింది. ఇక ఎస్‌ఎస్‌ఏలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రెండు నెలలకుపైగా అది ఇన్‌చార్జి పాలనలోనే కొనసాగుతోంది. ఇక్కడ పనిచేస్తున్న రెగ్యులర్ పీఓ దశరథరామయ్య మాతృశాఖకు వెళ్లిపోయారు. అప్పటి నుంచి డైట్ లెక్చరర్ సుబ్రహ్మణ్యం ఇన్‌చార్జి పీఓగా కొనసాగుతున్నారు. అత్యంత కీలకమైన పై రెండు శాఖలకూ రెగ్యులర్ అధికారులు లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది. అయినా ప్రభుత్వం రెగ్యులర్ అధికారుల నియామకంపై మీనమేషాలు లెక్కిస్తోంది. రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ (ఆర్‌ఎంఎస్‌ఏ) ద్వారా విద్యాశాఖకు అనేక పథకాల పేరుతో భారీగా నిధులు వస్తున్నాయి. అలాగే ఎస్‌ఎస్‌ఏకు కూడా ప్రాథమిక విద్య కోసం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారు. అలాగే కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ (కేజీబీవీ)లు, భవిత సెంటర్లకు కూడా అధిక ప్రాధాన్యమిస్తున్నారు. రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో కింది స్థాయిలోనూ సిబ్బంది సక్రమంగా పనిచేయలేకపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే పర్యవేక్షణ చేయాల్సిన డీఈఓకు కూడా పాలన వ్యవహారాలకే సమయం సరిపోవడం లేదనే వాదనలున్నాయి. దీనికితోడు పెద్దఎత్తున బదిలీలు, పరీక్షలు, పదోన్నతులు రావడంతో వాటి నిర్వహణకే డీఈఓ సమయం కేటాయించాల్సి వస్తోందనే విమర్శలున్నాయి. దీంతో విద్యాశాఖ, ఎస్‌ఎస్‌ఏ క్షేత్రస్థాయిలో గాడి తప్పాయనే వాదనలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆ రెండు శాఖలకు రెగ్యులర్ అధికారులను నియమించేందుకు ప్రభుత్వం ఓ అడుగు ముందుకు వేసింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 11 జిల్లాల డీఈఓలతో పాటు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టరేట్, ఎస్‌ఎస్‌ఏ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను పదోన్నతుల ద్వారా నియమించేందుకు రాష్ట్ర విద్యాశాఖాధికారులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే నిబంధనల మేరకు డిప్యూటీ డీఈఓలు, విద్యాశాఖ ఏడీలు, డైట్ లెక్చరర్లతో సీనియారిటీ జాబితా సిద్ధం చేశారు. తొలుత 15 మంది జాబితాకు డీపీసీ ఆమోదం పొందినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. అయితే ఈసారి ఎస్‌ఎస్‌ఏ పీఓ పోస్టులను సైతం విద్యాశాఖ అధికారులకే కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే ప్రమోషన్లలోనే పీఓ పోస్టులు కూడా భర్తీ చేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఇందుకోసం మళ్లీ 13 మంది సీనియర్లతో కూడిన సీనియారిటీ జాబితా తయారు చేసినట్లు ఆ శాఖాధికారులు చెబుతున్నారు. ఇదే జరిగితే ఒకేసారి డీఈఓ, ఎస్‌ఎస్‌ఏ పీఓ పోస్టులు పదోన్నతుల ద్వారా భర్తీ కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 38 మందికి పదోన్నతులు కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ, ఎస్‌ఎస్‌ఏలకు అధిపతులుగా ఎవరు వస్తారనే విషయమై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటి వరకూ తొలి సీనియారిటీ జాబితా ఆధారంగా శ్రీకాకుళం జిల్లాలో డిప్యూటీ డీఈఓగా పనిచేస్తున్న నాగవేణి, కడప ఆర్జేడీ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న ఆచారి, చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి డీఈఓగా కొనసాగుతున్న శామ్యూల్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తూ వచ్చాయి. అదేస్థాయిలో కోస్తా జిల్లాల్లో ఏడీగా పనిచేస్తున్న పాండురంగారావు పేరు కూడా వినిపిస్తూ వచ్చింది. అయితే ఇప్పుడు డీఈఓ, పీఓ పోస్టులను ఒకేసారి పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఎవరు ఎక్కడికి వెళతారో అర్థం కావడం లేదు. దీంతో ఎవరు నియమితులవుతారోనని ఇటు విద్యాశాఖ, అటు ఉపాధ్యాయవర్గాల్లో ఉత్కంఠ మొదలైంది. వారంలోపు పదోన్నతుల ప్రక్రియ పూర్తి కానున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

స్పెషల్ డ్రైవ్‌తో ప్రయోజనమెంత?

(మొదటిపేజీ తరువాయి)

ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తూ తలకు బలమైన గాయాలతో చనిపోయిన వారు 12 మంది ఉన్నారు. దీన్ని బట్టి చూస్తే ద్విచక్ర వాహనాల ద్వారానే ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటున్నాయని స్పష్టమవుతోంది. దీనికితోడు హెల్మెట్ వాడకపోవడం వల్ల తలకు గాయమై ఎక్కువగా చనిపోతున్నారు. ఈ విషయాన్ని జిల్లా పోలీస్ యంత్రాంగం గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయం మేధావి వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

స్పెషల్ డ్రైవ్ పేరుతో పోలీస్ చర్యలివీ..

జిల్లాలో పోలీస్ యంత్రాంగం స్పెషల్ డ్రైవ్ చేపట్టినా.. రోడ్డు ప్రమాదాలు మాత్రం తగ్గడం లేదు. రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా వివిధ రూపాల్లో పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నిబంధనల ఉల్లంఘనదారులపై జరిమానాల రూపంలో కొరడా ఝుళిపిస్తున్నారు. ఇదే క్రమంలో హెల్మెట్ ధరించాలని వాహనచోదకులకు సలహాలిస్తున్నారు. సీట్‌బెల్ట్ ధరించాలని చెబుతూ వస్తున్నారు. స్పెషల్ డ్రైవ్ పేరుతో చేపట్టిన ఈ చర్యలతో ఏ మేరకు ప్రయోజనం చేకూరుతోందనే విషయాలను వారానికోసారి విశ్లేషిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలకు గల కారణాలను గుర్తిస్తున్నారు. ప్రధానంగా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా వాహనాల్లో దూసుకుపోవడం, త్రిబుల్ రైడింగ్, పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం.. రోడ్డుప్రమాదాలకు ప్రధాన కారణాలుగా పోలీసులు స్పష్టమైన అభిప్రాయానికి వచ్చారు. ఈ మేరకు వాటి నిరోధక చర్యలకు ఉపక్రమిస్తూ మూడు వారాలుగా పోలీస్ అధికారులు, సిబ్బంది అదే పనిలో నిమగ్నమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుమారు 20 వేల వాహనాలకు పైగా తనిఖీ చేశారు. దాదాపు 3 వేల వరకు నెంబరు లేని ద్విచక్రవాహనాలను గుర్తించారు. 4,714 మందిపై ట్రాఫిక్ ఉల్లంఘనల కేసులు నమోదు చేశారు. ఇదేక్రమంలో రోడ్డు ప్రమాదాలు ఏఏ ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతున్నాయో వాటిని బ్లాక్ స్పాట్లుగా పేర్కొంటూ.. 81 బ్లాక్‌స్పాట్లు గుర్తించారు. వాటిని కేటగిరీలుగా విభజించారు. పది మంది కంటే ఎక్కువ మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోయి ఉంటే ఏ కేటగిరీగా పేర్కొన్నారు. అయితే జిల్లాలో ఆ తరహా ప్రమాదాలు జరగలేదు. అనంతపురం, పెనుకొండ, తాడిపత్రి, గుంతకల్లు పోలీస్ సబ్‌డివిజన్ల పరిధిలో బీ కేటగిరీ కింద (10మంది లోపు చనిపోతే) 11 బ్లాక్‌స్పాట్లు గుర్తించారు. సీ కేటగిరీ కింద మిగిలినవాటిని స్పాట్లుగా పరిగణిస్తున్నారు. కాగా, బ్లాక్‌స్పాట్లుగా గుర్తించిన ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరికలు, సూచనలు ఏర్పాటుచేస్తున్నారు. మరికొందరు ట్రాఫిక్ నిబంధనలు తెలిపే ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇంకొందరు గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాలను గుర్తు చేస్తూ వాహనదారుల్లో అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీ లు ఏ ర్పాటు చేస్తున్నారు. ఇలా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ఎ వరికి వారు తమకు తోచిన విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

ఈ నెలలో జరిగిన కొన్ని సంఘటనలు పరిశీలిస్తే...

- రాయదుర్గం మండలం బొమ్మక్కపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గోనబావి దేవేందర్‌రెడ్డి, అంకంపల్లి ఓబుళరెడ్డి మృతి చెందారు. ద్విచక్రవాహనంపై వెళుతుండగా వీరిని గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. దీంతో తలలకు బలమైన గాయాలు కావడంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు.
- పరిగి మండలం శాసనకోట జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈమె తలకు బలమైన గాయం కావడంతో చనిపోయారు.
- బెళుగుప్ప మండలం బ్రాహ్మణపల్లి తాండా వద్ద ద్విచక్రవాహనంపై నుంచి కిందపడడంతో తలకు గాయమై రాజీబాయి అనే మహిళ మృతి చెందింది.
- తాడిపత్రి రూరల్ మండలం వంగనూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ధనుంజయ్‌కుమార్ చనిపోయాడు. ద్విచక్రవాహనంపై వెళుతున్న అతడిని మరో వాహనం ఢీ కొనడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు.
- అనంతపురం నగర శివారులోని 44వ జాతీయ రహదారిపై రవి పెట్రోల్ బంకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కనగానపల్లి సొసైటీ సీఈఓ ఆనంద్ మృతి చెందాడు. అనంతపురం నుంచి ద్విచక్రవాహనంపై వెళుతుండగా మరో ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో ఆయన తలకు గాయమై చనిపోయాడు.
- తలుపుల మండలం ఉబ్బరవాండ్లపల్లి వద్ద రెండు బైక్‌లు ఢీ కొన్న సంఘటనలో ఎగువబైగారిపల్లికి చెందిన ఓబుల సుబ్బారెడ్డి రోడ్డుపై పడడంతో తలకు గాయమై చనిపోయాడు.
- హిందూపురం రూరల్ మండలం చోళూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసింహమూర్తి అనే వ్యక్తి చనిపోయాడు. ద్విచక్రవాహనంపై వెళుతుండగా నీటి ట్యాంకర్ ఢీ కొంది. దీంతో అతను ఎగిరి రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

హెల్మెట్ వాడకంపై దృష్టి సారించేరా..?

పట్టణ ప్రాంతాల్లో హెల్మెట్ వాడకపోయినా.. జాతీయ, రాష్ట్ర, జిల్లా రహదారులపై ద్విచక్రవాహనాల్లో ప్రయాణించే సందర్భాల్లో హెల్మెట్ వాడే విధంగా పోలీసులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిమూలంగా రోడ్డు ప్రమాద మృతుల సంఖ్యను గణనీయంగా తగ్గించే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితుల్లో హెల్మెట్ వాడకంపై జిల్లా పోలీస్ యంత్రాంగం దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఎదురుచూపు..!



పాత రీచుల్లోనే మళ్లీ తవ్వకాలకు సన్నద్ధం... ఈసీ అనుమతే తరువాయి

కొత్తగా 6 పట్టాభూముల్లో రీచ్‌ల గుర్తింపు... తవ్వకాలకు అడ్డుపడుతున్న గ్రామస్థులు

అనంతపురం జిల్లాపరిషత్తు: జిల్లాలో కొత్త రీచ్‌లు లేకపోవడంతో పాత రీ చ్‌లనే మరోసారి ఇసుక తవ్వకాల కోసం తెరమీదికి తీసుకువచ్చారు. పర్యావరణ అనుమతుల(ఈసీ) కోసం గతంలో తవ్వకాలు జరిపిన వాటినే మళ్లీ జాబితాలో చేర్చారు. గతంలో జిల్లావ్యాప్తంగా 15 రీచుల్లో తవ్వకాలకు అనుమతించారు. అనంతపురం పరిధిలో 12, తాడిపత్రి పరిధిలో మూడు రీ చులుండేవి. అయితే అందులో నాలుగు గ్రామాల పరిధిలో ఇసుక తవ్వకాలను ఆయా గ్రామస్థులు అడ్డుకోవడంతో తాత్కాలికంగా నిలిపివేశారు. మొత్తమ్మీద ఇసుక మాఫియా రెచ్చిపోవడంతో తవ్వకాలు అధికమయ్యాయి. దీంతో జిల్లావ్యాప్తంగా ఏడాదిన్నర కాలంలో రెండు లక్షల క్యూబిక్‌మీటర్లకు పైగా ఇసుక తవ్వకాలు జరిపారు. రాష్ట్ర ప్రభు త్వం ఏడాది క్రితం ఇసుకను ఉచితం చేస్తున్నట్లు ప్రకటించడంతో దోపిడీ మరింత అధికమైంది. ఇసుకను టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలించి డంప్‌లు ఏర్పాటుచేసి రాత్రి సమయాల్లో దూర ప్రాంతాలకు తరలిస్తూ వచ్చారు. దీంతో వేలాది క్యూబిక్‌మీటర్ల ఇసుక మాయమైపోతూ వచ్చింది. ఫలితంగా కొత్త ఇసుక రీచ్‌ల ఏర్పాటుతప్పనిసరి అయింది. అయితే ఎంతగా వెతికినా గనుల శాఖాధికారులకు ఇసుక అధికంగా ఉన్న కొత్త రీచ్‌లు కనిపించలేదు. దీనికితోడు పలు గ్రామాల్లో ఆయా గ్రామస్థులు ఇసుక తవ్వకాలకు అనుమతించకపోవడంతో సమస్య మరింత జటిలంగా మారింది. ఉన్న రీచ్‌లలోనే ఇసుక తవ్వకాలు చేపట్టడంతో భూగర్భజలాల సమస్య మరింత తీవ్రతరమయింది.

ఈసీ అనుమతి కోసం 14 రీచ్‌ల ఎదురుచూపు

భూగర్భజలాలు అడుగంటిపోవడంతో అందరి దృష్టి ఇసుక తవ్వకాలపై పడింది. దీనికితోడు పర్యావరణ అనుమతులు ముగిసిన ఇసుక రీచ్‌లలో తవ్వకాలు చేపట్టడం మరింత ప్రమాదకరంగా మారింది. అనంతపురం పరిధిలోని 12రీచ్‌లలో ఈఏడాది ఏప్రిల్ 6వ తేదీ నాటికి 6రీచ్‌లు, మే 15నాటికి 5రీచ్‌ల గడువు పూర్తయింది. దీంతో కొత్త రీచ్‌ల కోసం అన్వేషించాలని కలెక్టర్ ఆదేశించడంతో గనుల శాఖ అధికారులు ఆ విషయంపై దృష్టి సారించారు. కానీ కొత్త రీచ్‌ల ఆచూకీ కనిపించలేదు. దీంతో తిరిగి పాత వాటినే ఆ జాబితాలో చేర్చక తప్పలేదు. వాటిలో ఎంత క్యూబిక్‌మీటర్ల ఇసుక ఉందనే విషయం నిర్ధారించారు. కాగా, అనంతపురం పరిధిలో గతంలో ఉన్న మైరాంపురం, రామగిరి మండలం పేరూరు రీచ్‌లను తొలగించారు. తిమ్మసముద్రం-2ను ఏర్పాటు చేశారు. తాడిపత్రి పరిధిలో.. శింగనమల మండలం నిదనవాడ రీచ్-1లో 8600, రీచ్-2లో 18,050, తరిమెలలో 4878క్యూ.మీ ఇసుకను గుర్తించారు. వీటిని పర్యావరణ అనుమతుల కోసం పంపారు. అనంతపురం పరిధిలో 3,83,447 క్యూబిక్‌మీటర్లు, తాడిపత్రి పరిధిలో 31,828 క్యూమీటర్ల ఇసుక ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు.

అనుమతి లభించేనా...?

గనుల శాఖ అధికారులు 14రీచ్‌ల వివరాలను కలెక్టర్‌కు పంపారు. వాటికి ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్(ఈసీ) రావాల్సి ఉంది. జిల్లా కలెక్టర్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కాగా, వాటిలో అన్ని రీచ్‌లకూ ఈసీ అనుమతి లభిస్తుందా? లేదా? అనేది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. ఏ రీచ్‌లో ఎంత క్యూబిక్ మీటర్ల ఇసుక ఉంది? ఎంత వరకు తవ్వకాలు జరిపితే ప్రమాదం ఉండదు? తదితర వి షయాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. మరి వాటిని నిశితం గా పరిశీలించి నిర్ణయం తీసుకుంటా రా? లేదా? అనేది తేలాల్సి ఉంది.

కొత్తగా ఆరు పట్టాభూములు, 57 ప్రాంతాల గుర్తింపు

గనులు, భూగర్బ శాఖ అధికారులు కొత్తగా భారీ ఇసుక రీచ్‌లను గుర్తించకపోయినా ఆరు పట్టాభూముల్లో ఇసుక ఉన్నట్లు గుర్తించారు. యల్లనూరు మండలం మల్లాగుండ్లలో రా జేంద్రనాయుడు పేరుతో సర్వేనెంబర్ 112లో ఉన్న పట్టాభూమిలో 21,073 క్యూ.మీ, తాడిపత్రి మండలం బోడయ్యపల్లిలో నాగేశ్వర్‌రెడ్డి పేరుతో స ర్వే నెంబర్ 352-ఏలో 9వేల క్యూ.మీ, తాడిపత్రి మండలం ఆలూరులో మ హేంద్ర పేరుతో సర్వేనెంబర్ 1312, 1313, 862-ఏలో 53,203 క్యూ.మీ, శిం గనమల మండలం సలకంచెరువులో జనార్దన్‌నాయుడు పేరుతో సర్వే నెంబర్ 168-1,2లో 3473క్యూ.మీ, అదే మండలం తరిమెలలో తనూజ పేరుతో సర్వేనెంబర్ 890-1, 8901-1,2లో 23,230క్యూ.మీ, యల్లనూరు మండలం కోడుముర్తిలో ఓబులేసు పేరుతో సర్వేనెంబర్ 66, 68/ఏ, 66/5లో 21287క్యూ.మీ. ఇసుక ఉన్నట్లు గుర్తించారు. వీటితోపాటు జిల్లావ్యాప్తంగా 57ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలకు అనుకూలంగా ఉందని గనుల శాఖ అధికారులు గుర్తించారు. అయితే ఆ ఇసుకను స్థానిక అవసరాలకు మాత్రమే త వ్వుకునేందుకు అనుమతించనున్నట్లు తెలిసింది.



వర్సిటీల్లో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు

☛ పారిశ్రామికవేత్తలు, ప్రముఖుల సూచనల మేరకు రూపకల్పన ☛ ఉద్యోగావకాశాల పెంపునకు కృషి ☛ ఈ ఏడాది నుంచే ప్రారంభం

ఎస్కేయూ

రాష్ట్రంలోని అన్ని వర్శిటీల్లో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు ప్రవేశపెట్టనున్నారు. వీటి ఏర్పాటుకు విధి విధానాలపై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నత విద్యామండలి ఏర్పాటు చేసిన విద్యావేత్తలు ఆర్. రాధా కృష్ణ, సీవీ రాఘవులు, వై. హరగోపాల్‌రెడ్డి, పీ నరసింహారావు కమిటీ ఈ సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులపై అనేక సూచనలు చేసింది. వీటి ఆధారంగా కోర్సులు ప్రవేశపెట్టనున్నారు. ఈ కోర్సుల్లో పారిశ్రామికవేత్తలు, ప్రముఖుల సూచనలు కూడా పాటించనున్నారు. వీటి ద్వారా ఉద్యోగావకాశాల పెంపునకు కృషి చేయాలని నిర్ణయించారు. ఈ ఏడాది నుంచే కోర్సులు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది.



వర్శిటీ విజన్ డాక్యుమెంట్ రూపకల్పన

ప్రతి వర్శిటీ పదేళ్లకు వర్తించేలా ముందుగా విజన్ డాక్యుమెంట్ రూపొందించుకోవాలి. ఇదివరకే ఈ మేరకు అన్ని వర్శిటీలకు ఉన్నత విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. విజన్ డాక్యుమెంట్ రూపకల్పన తర్వాతే సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులు ఏర్పాటు చేయాలి. ఇందుకోసం విశ్వవిద్యాలయాలు భవిష్యత్తులో కొత్త కోర్సుల ఏర్పాటు, విద్యార్థుల చేరికలు, విద్యాప్రమాణాలు, కొత్త కమ్యూనికేషన్ టెక్నాలజీ, ఈ లర్నింగ్ తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించాలి. సమగ్రమైన నివేదిక రూపొందించుకుని సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులు ప్రారంభించాలి.



ఉద్యోగావకాశాల కల్పనకు అనువైన సిలబస్

పరిశ్రమలు, ఉద్యోగావకాశాలు కల్పించే సంస్థలతో సంప్రదింపులతో ఉద్యోగావకాశాలకు వీలైన కరికులమ్‌ను ఏర్పాటు చేయాలి. ఈ కరికులమ్ డైనమిగా ఉండాలి. పరిశ్రమలతో సంప్రదింపులు జరుపుతూ ప్రతి రెండేళ్లకు ఒకసారి సిలబస్‌ను రివైజ్ చేయాలి. అలాగే టీచింగ్ మాడ్యూల్స్‌లో పారిశ్రామిక ప్రముఖులను భాగస్వాములను చేయాలి. కనీసం 20 శాతం కోర్సులు పారిశ్రామిక ముఖ్యుల భాగస్వామ్యంతో నడిపేలా చూడాలి.



మెరుగైన సౌకర్యాలు, ఫ్యాకల్టీ

యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనలు అనుసరించి అర్హత గల ఫ్యాకల్టీ, లైబ్రరీ, లేబోరేటరీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫైనాన్షియల్ వయోబులిటీ వంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. ఈ అంశాలను అన్నింటిని ఉన్నత విద్యామండలి పరిశీలించనుంది. ప్రతి సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుకు ఆచార్యుడు, సహాచార్యుడు, నలుగురు సహాయ ఆచార్యులు ఉండాలి. సెలెక్షన్ కమిటీ ద్వారా ఎంపిక చేయాలి. దీర్ఘకాలిక స్థిర త్వం, డిమాండ్ ఉన్న కోర్సులను పరిగణలోకి తీసుకుని, ప్రస్తు పరిస్థితులు, విద్యార్థుల చేరిక లు, ఉద్యోగావకాశాల ఆధారంగా సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులకు శ్రీకారం చుట్టాలి.



పేద, మధ్య తరగతి విద్యార్థులకు భారం

పేద, మధ్య తరగతి విద్యార్థులకు చదువును దూరం చేసే ప్రక్రియలో భాగంగా సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులు ప్రవేశపెడుతున్నారు. ఈ కోర్సుల వల్ల విద్యార్థులు చదువుకు దూరమయ్యే అవకాశం ఉంది. కోర్సుకు ఫీజుల చెల్లింపు విద్యార్థులకు భారం కానుంది. ప్రైవేట్ వర్శిటీలను ప్రోత్సహించడానికే ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటోంది. యూనివర్శిటీలకు ఇది భారంగా మారే అవకాశం ఉంది. **- ఆచార్య ఏవీ రమణ, ఎస్కేయూ**



ఉపాధి అవకాశాలు విస్తృతమవుతాయి

విద్యార్థుల ఉపాధి అవకాశాలు విస్తృతమవుతాయి. విద్యార్థుల సంఖ్యను, డిమాండ్‌ను బట్టి సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులు ప్రవేశపెడతారు. ఇందువల్ల విద్యార్థులకు లాభం చేకూరుతుంది. ఇటువంటి కోర్సుల వల్ల త్వరితగతిన ఉపాధి లభిస్తుంది. ప్రస్తుతం టూరిజం రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయి. టూరిజంలో డిప్లమా కోర్సులు పెడితే ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. **- ఆచార్య లక్ష్మయ్య, ఫిజిక్స్**

వర్శిటీల మధ్య అంతరాలు తగ్గించేందుకే..

ప్రభుత్వ, ప్రైవేట్ వర్శిటీల మధ్య అంతరాలు తగ్గించేందుకు ప్రభుత్వం సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులు ప్రవేశపెడుతోంది. ఒక విధంగా విద్యార్థులకు భారంగా అనిపించినా నాణ్యమైన విద్యను అం దించడానికి తోడ్పడుతోంది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్ రూపకల్పన ఉంటుంది. కాబట్టి విద్యార్థులకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయి.



- ఆచార్య బాలనరసయ్య, జేఎన్‌టీయూ

దైవకార్యం.. నిమజ్జనానికి సహకరించండి

● శింగనమల ప్రజలకు ఆర్డీఓ విజ్ఞప్తి... రైతులు, మత్స్యకారులకు న్యాయం చేయండి : విప్, ఎమ్మెల్సీ

శింగనమల : అనంతపురం నగరంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను శింగనమల చెరువులో నిమజ్జనం చేయడానికి నియోజకవర్గ ప్రజలు సహకరించాలని ఆర్డీఓ మలోల విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ సమక్షంలో ఆయకట్టు రైతులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విప్ యామినీబాల, ఎమ్మెల్సీ శమంతకమణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ 29న జరిగే వినాయక నిమజ్జనానికి శింగనమల చెరువును అధికారులు ఎంపిక చేశారని, రైతులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. వినాయక నిమజ్జనం దైవకార్యమని, చెరువులో నిమజ్జనం జరిగితే రాబోయే రోజుల్లో తప్పకుండా వర్షాలు వచ్చి మంచి జరుగుతుందని చెప్పారు. హెచ్చెల్సీ కాలువ ద్వారా నీరు రాకపోవడం వల్లనే ఇక్కడ తప్పనిసరి పరిస్థితుల్లో నిమజ్జనం చేస్తున్నట్లు చెప్పారు. సమయం తక్కువగా ఉండడంతో ప్రజలకు చెప్పడం కుదరలేదన్నారు. కలుషిత నీటి స్థానంలో హెచ్చెల్సీ ద్వారా ఇవ్వడానికి కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని తెలిపారు.

ఏకపక్షంగా నిర్ణయం తగదు : విప్, ఎమ్మెల్సీ

ప్రభుత్వ విప్ యామినీబాల, ఎమ్మెల్సీ శమంతకమణి మాట్లాడుతూ శింగనమల చెరువులో నిమజ్జనం చేయడం పట్ల అధికారులు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. స్థానిక చెరువులో నీరుంటే దాదాపు 40 గ్రామాల్లో తాగు నీటి సమస్య ఉండదన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శమంతకమణి, వేదికపై విప్ యామినీబాల

గతంలో హెచ్చెల్సీ ద్వారా నీటిని వదలాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. అప్పుడు గుర్తురాని చెరువు నిమజ్జనం కోసం గుర్తుకు వచ్చిందా అని నిలదీశారు. నిమజ్జనంపై ప్రజాప్రతినిధులు, ఆయకట్టు రైతులకు ఎలాంటి సమాచారం ఇవలేదన్నారు. నిమజ్జనం ద్వారా చెరువు నీటితో జరిగే అనర్థాలపై ప్రజలకు అధికారులు హామీ ఇచ్చి నిమజ్జనం చేసుకోవాలన్నారు.

శింగనమల చెరువు ఇప్పుడు గుర్తుకొచ్చిందా?

రైతులు, ప్రజలు మాట్లాడుతూ.... స్థానికులకు ఎలాంటి సమాచారం లేకుండానే చెరువులో నిమజ్జనం ఏర్పాట్లు చేయడాన్ని వారు తప్పపట్టారు. నగరానికి చెందిన దాదాపు 1200 వినాయక విగ్రహాలు చెరువులో నిమజ్జనం చేయడం ద్వారా వ్యర్థ పదార్థాలు, రసాయనాలతో నీరు కలుషితమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం మూగజీవాలకు తాగునీరు అందని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. జనం రోగాలబారిన పడే అవకాశం ఉంటుందన్నారు. చెరువులో రూ.లక్షల వ్య యంతో చేప పిల్లలు పెంచుతున్నారని, ఇవి చనిపోతాయని అవేదన వ్యక్తం చేశారు. శింగనమల చెరువుకు పలుసార్లు హెచ్చెల్సీ నీరు విడుదల చేయాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోని అధికారులకు... ఇప్పుడు శింగనమల చెరువు గుర్తుకొచ్చిందా అని నిలదీశారు. స్పష్టమైన హామీ ఇస్తేనే నిమజ్జనం జరగనిస్తామని భీష్మించారు. దీంతో అధికారులు వారికి సర్దిచెప్పారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు శింగనమల చెరువు వద్ద నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీ మల్లికార్జున వర్మ, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ నాగేంద్ర, జడ్పీటీసీ శాలిని, ఇరిగేషన్ డీఈ, సీఐ రాజేంద్ర యాదవ్, అనంతపురం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, రైతులు, మత్స్యకారులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

క్రీడా పండుగ సంబరాలు ప్రారంభం

అనంతపురం స్పోర్ట్స్ : ఈ నెల 29న నిర్వహించనున్న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్డీటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగే క్రీడా పండుగ సంబరాలు స్థానికంగా ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అనంత క్రీడా గ్రామంలో తొలిరోజు యోగాతో మొదలుపెట్టారు. ముందుగా హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యోగా వల్ల ఉపయోగాలు, ప్రాముఖ్యతను కృష్ణవేణి వివరించారు. అనంతరం ఉత్సాహంగా క్రికెట్ పోటీలు కొనసాగాయి. 17 జట్లను నాకౌట్ పద్ధతిలో 6 ఓవర్ల పాటు ఒక మ్యాచును నిర్వహించారు. ఫైనల్స్ పోటీల్లో సచిన్ టెండూల్కర్ జట్టు, మేరీకోం జట్టు తలపడ్డాయి. సచిన్ జట్టు విజయం సాధించింది. అనంతరం టేబుల్ టెన్నిస్ క్రీడను జిల్లాకు పరిచయం చేసిన డాక్టర్ బీ అక్బర్‌సాహెబ్, అథ్లెటిక్స్ కోచ్ ముద్దుకృష్ణ, హాకీ జాతీయస్థాయి క్రీడాకారుడు మునీర్‌బాషాలను ఘనంగా సత్కరించారు. సోమవారం అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ పోటీలు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో ఆర్డీటీ సీబీఆర్ సంచాలకులు దశరథరాముడు, క్రీడా సంచాలకుడు నిర్మల్‌కుమార్, స్పోర్ట్స్ సెంటర్ మేనేజర్ సురేంద్రబాబు, కోచ్‌లు లక్ష్మినారాయణ, దాదాఖలందర్ పాల్గొన్నారు.




నింకంపల్లి రోడ్డులో మూడు పులులపై స్వారీ చేస్తూ...



ఆంజనేయుడి గదపై కొలువు దీరిన దృశ్యం

పురంలో గణనాథుల సందడి



బోయపేటలో చెట్టు కొమ్మపై సేదతీరుతూ..



కోటలో అంబారీ ఏనుగునెక్కి...



నెమలిపై రాజస్థానీ రాయల్స్ గణనాథుడు

వినాయక చవితి వేడుకలు హిందూపురంలో అట్టహాసంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని పలు వీధుల్లో కొలువైన గణనాథులు విశేషంగా ఆకట్టుకుంటూ కనువిందు చేస్తున్నాయి. నిర్వాహకులు విగ్రహాలను వివిధ ఆకృతులతో పోటాపోటీగా ముస్తాబు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మంటపాలు విద్యుద్దీపకాంతులతో దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. ప్రత్యేక పూజలు, భక్తిపాటలు, భజనలు, సాంస్కృతిక ప్రదర్శనలతో సందడిగా మారింది. చూడ ముచ్చటైన బొజ్జ గణపయ్యలను తిలకించేందుకు ఆదివారం జనం ఎగబడ్డారు.

హిందూపురం అర్బన్

బాపూజీ నగర్‌లో 18 అడుగుల భారీ ఆది జాంబవంత రూపంలో...





ఎంఎఫ్ రోడ్డు వినాయక ఆలయంలో కొబ్బరిపుడి, వెండి నగల అలంకరణ



మూషికానికీ ఓ సెల్ఫీ...



గరళ కంఠుడికి పాలాభిషేకం చేస్తున్న తనయుడు



మూషికాల సమూహంతో..



ఏనుగు తొండం నీడన...



కంసలపేట విశ్వకర్మ భారీ గణపతి







నిమజ్జనానికి వాహనాల్లో తరలుతున్న వినాయక విగ్రహాలు





శింగనమల చెరువులో కోలాహలం

ఉండ్రాళ్లయ్యా... వెళ్లిరావయ్యా!

అనంతపురంలోని పలు వీధుల్లో కొలువైన వినాయక విగ్రహాల్లో కొన్నింటిని మూడో రోజు ఆదివారం నిమజ్జనం చేశారు. విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో కొలువుదీర్చి నగర ప్రధాన వీధుల్లో అట్టహాసంగా ఊరేగించారు. అనంతరం శింగనమల చెరువులో నిమజ్జనం చేశారు. హోరెత్తిన గణనాథుడి నామస్మరణతో చెరువు ప్రాంతం సంబరమైంది. (అనంతపురం)



బాధ్యులెవరు?

- అధికారులా...నిర్వాహకులదా...?
- గణేష్ మంటపాల్లో మృత్యుఘంటికలు
- కొరవడిన పర్యవేక్షణ
- విద్యుదాఘాతంతో ముగ్గురు విద్యార్థుల మృతి

ఆంధ్రజ్యోతి, అనంతపురం : వినాయక చవితి వేడుకలు మూడు కుటుంబాల్లో విషాదఘంటికలు మోగించాయి. కన్నపేగు బంధాన్ని తెంచేశాయి. ఆ హృదయాలు తల్లడిల్లిపోయాయి. ఇందుకు బాధ్యులెవరు...? గణేష్ మంటపాల నిర్వాహకులదా... లేదా అధికారులదా..? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. గణేష్ మంటపాలపై కొరవడిన పర్యవేక్షణకు తోడు నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోకపోవడం ఇందుకు కారణమన్న అభిప్రాయం బాధిత వర్గాల నుంచే కాకుండా ప్రజల నుంచి అదే సమాధానం వ్యక్తమవుతోంది. తప్పిదం ఎవరిదైనా... ముగ్గురు పిల్లల ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. వారి కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చాయి. ఆ బిడ్డలపై పెట్టుకున్న తల్లిదండ్రుల ఆశలు అడియాశలయ్యాయి.

ఆనందం క్షణాల్లో ఆవిరి...

వినాయక చవితి పండుగ అంటేనే పెద్దలకంటే పిల్లల్లోనే ఎక్కువ ఆనందం. భక్తిభావం అటుంచితే... వేడుకల్లో సంతోషంగా పాలుపంచుకోవాలన్నదే పిల్లల అభిమతం. వినాయక పండుగకు వారం రోజుల ముందు నుంచే పిల్లల్లో సందడి మొదలవుతుంది. పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి అధికం. వినాయకుడు కొలువుదీరిన రోజు నుంచి మంటపమే తమ ఆవాసంగా చేసుకుని సంతోషంతో గడుపుతుంటారు. ఆ ఆనందమే మూడు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. గడిచిన రెండురోజుల్లో ముగ్గురు పిల్లలు మృత్యు ఒడికి చేరారు. విద్యుత్‌తీగలే వారి పాలిట మృత్యుపాశాలయ్యాయి. అనంతపురం రూరల్ మండలం కందుకూరులో గణేష్ మంటపం వద్ద డ్యాన్స్ చేస్తూ తన్మయత్వంలో విద్యుత్ తీగల కోసం ఏర్పాటుచేసిన అర్త్ వైర్‌ను తొక్కి నిఖిల్(13) మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు తనువు చాలించడంతో ఆ ఇంటి దీపం ఆరిపోయింది. కుమారుడిపై పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. ఈ ఘటన మరువక ముందే తాజాగా ఆదివారం శెట్టూరు మండలం లక్ష్మంపల్లిలో సీరియల్ లైట్లు తొలగించే క్రమంలో మహమ్మద్ బాషా(16) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతుడి తండ్రి సర్దార్ బాషా శుభకార్యాలకు సీరియల్ సెట్లు వేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆ సీరియల్ సెట్లే బాలుడి మృతికి కారణం కావడంతో తల్లిదండ్రుల బాధ వర్ణణాతీతం. తాడిమర్రి మండలం మద్దెలచెరువు గ్రామంలో మంటపానికి అమర్చిన విద్యుద్దీపాలు తొలగిస్తూ షాక్‌కు గురై డిగ్రీ విద్యార్థి మృతి చెందాడు. పొట్టకూటి కోసం వలస వచ్చిన ఆ కుటుంబానికి ఈ సంఘటనతో కన్నీరే మిగిలాయి.

ఆదేశాలతోనే సరి... పర్యవేక్షణ ఏదీ?

వినాయక చవితి వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకూ తావుండకూడదని జాగ్రత్తలు తీసుకోవాలంటూ అటు స్థానిక అధికారులకు, ఇటు మంటపాల నిర్వాహకులకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే క్షేత్ర స్థాయిలో ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు పర్చడంలో సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు బాధిత వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. మరోవైపు మంటపాల ఏర్పాటులో నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవడం లేదన్నది తాజా ఘటనలే నిదర్శనం. దీన్ని బట్టి చూస్తే పర్యవేక్షణ కొరవడిందనడంలో ఎలాంటి సందేహం లేదు. మంటపాల వద్ద విద్యుత్‌ప్రమాదాలు జరక్కుండా స్థానిక విద్యుత్ శాఖ అధికారుల పర్యవేక్షణ ఉండాలి. దీనికితోడు మంటపానికి ఎక్కడి నుంచి విద్యుత్ సరఫరా అవుతోందో గమనించాలి. ఏదైనా ప్రమాదానికి దారితీసే పరిస్థితులున్నాయా లేదా అన్నది పరిశీలించాలి. అయితే సంబంధిత శాఖాధికారులు ఆ వైపుగా దృష్టి సారించలేదన్నది తేటతెల్లమవుతోంది. కందుకూరులో జరిగిన సంఘటనను పరిశీలిస్తే...డ్యాన్స్ వేసే వేదిక వద్ద అర్త్ వైర్‌ను ఉంచడం, తద్వారా ప్రమాదం జరగడం, లక్ష్మంపల్లి, మద్దెలచెరువులో మంటపానికి ఇళ్లలోంచి విద్యుత్‌ను వాడుకోవడం, అందుకు జాగ్రత్తలు తీసుకోకపోవడం... వీటన్నింటినీ సంబంధిత అధికారులు పర్యవేక్షించకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీరియల్ సెట్లు తీసేందుకు ముందుగా విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లైతే మహమ్మద్ బాషా బతికి ఉండేవాడని స్థానికులు వాపోవడం గమనార్హం.

ఇకనైనా పాఠాలు నేర్చేరా?

వినాయక చవితి మంటపాలల్లో మృత్యు ఘంటికలు మోగుతున్న నేపథ్యంలో అధికారులు ఇకనైనా పాఠాలు నేర్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరో ఘటనకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలో ప్రధాన పట్టణాల్లో నిమజ్జనానికి సమయం దగ్గరపడుతోంది. ఈ పరిస్థితుల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

లక్ష్మంపల్లి వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతి చెందిన మహమ్మద్ బాషా(16

కళ్యాణదుర్గం : శెట్టూరు మండలం లక్ష్మంపల్లిలో ఆదివారం సాయంత్రం వినాయక నిమజ్జనం విషాదం నింపింది. ఊరేగింపునకు ముందే మంటపంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల కనెక్షన్లు తొలగిస్తుండగా విద్యుదాఘాతంతో యువకుడు మహమ్మద్‌బాషా(16)మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి. వినాయక చ వితి సందర్భంగా గ్రామంలో కొలువైన గణనాథుడి మం టపానికి ఇదే గ్రామానికి చెందిన సర్దార్ బాషా విద్యుద్దీ పాలు ఏర్పాటు చేశాడు. అయితే మూడో రోజు నిమజ్జనా నికి సాయంత్రం నాలుగు గంటల్లోగా విగ్రహాలు తరలిం చాలని నిర్వాహకులకు పోలీసులు సూచించారు. దీంతో విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లడానికి నిర్వాహకులు స మాయత్తమయ్యారు. మంటపానికి అమర్చిన విద్యుద్దీపా ల కనెక్షన్లు తొలగించడానికి సర్దార్ బాషా అందుబాటులో లేడు. దీంతో కుమారుడు మహమ్మద్ బాషా కనెక్షన్లు తొలగిస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. బాలుడు మంటపం నుంచి కిందకు పడిపోయాడు. అక్కడే ఉన్న గ్రామస్థులు, బంధువులు కుందుర్పిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మహమ్మద్ బాషా మృతి చెందాడు. సంఘటనతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. వినాయక మంటపం వద్ద కేరింతలు కొట్టిన వాడు గంటలోపే విగతజీవుడై ఇంటికి రావడంతో కన్నీరుమున్నీరయ్యారు. గణేష్ నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సీఐ శివప్రసాద్ గ్రామానికి చేరుకుని సంఘటనపై వివరాలు ఆరాతీశారు. ఇదిలా ఉండగా, సర్దార్‌బాషాకు ఇద్దరు కుమారులు. మొదటి వాడైన మహమ్మద్ బాషా పదో తరగతి వరకు చదువుకుని ఇంటివద్దనే ఉంటూ తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేవాడని గ్రామస్థులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వినాయక మంటపం విద్యుద్దీపాలు తొలగిస్తూ...

తాడిమర్రి: మండలంలోని మద్దెలచెరువు గ్రామంలో ఆదివారం సాయంత్రం వినాయక నిమజ్జనం తర్వాత విషాదం అలుముకుంది. వినాయక మంటపానికి ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు తొలగిస్తూ విద్యుత్ షాక్‌తో విద్యార్థి జానకొండ నరేశ్(22) మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలివి. గ్రామంలోని కురుబ కాలనీ వాసులు చవితి సందర్భంగా ప్రాథమిక పాఠశాల వద్ద వినాయక ప్రతిమను ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించిన అనంతరం సాయంత్రం నిమజ్జనం పూర్తి చేశారు. అప్పటికే తేలికపాటి వర్షపు జల్లులు పడుతున్నాయి. ఆ తరువాత వినాయక మంటపానికి ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలను తొలగించేందుకు విద్యార్థి జానకొండ నరేశ్‌తో పాటు మరి కొంత మంది యువకులు మంటపానికి చేరుకున్నారు. విద్యుద్దీపాలు తొలగిస్తున్న క్రమంలో నరేశ్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అక్కడే ఉన్న మిత్రులు ప్రాణాపాయంలో ఉన్న నరేశ్‌ను కాపాడే యత్నం చేశారు. దగ్గరికి వెళ్లే ప్రయత్నం చేస్తుండగా... నేను విద్యుత్ షాక్‌కు గురయ్యాయని, దగ్గరకు రావద్దంటూ నరేశ్ చెప్పినట్లు గ్రామస్థులు అంటున్నారు. అయితే షాక్ తగిలిన కొద్ది సేపటికే నరేశ్ మంటపం పైనుంచి కిందకు పడిపోయాడు. అప్రమత్తమైన యువకులు నరేశ్‌ను 108 అంబులెన్స్‌లో బత్తలపల్లికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. నరేశ్ తండ్రి గొర్రెల కాపరి. కాగా తల్లి చెన్నమ్మ, అక్కలు చంద్రకళ, చిట్టిలతో పాటు సెలవు రోజుల్లో నరేశ్ కూలి పనులకు వెళ్తూ జీవనం సాగించేవాడు. తాడిమర్రి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కోసం మద్దెలచెరువుకు వచ్చి...

నరేశ్ తల్లిదండ్రులు పదేళ్ల క్రితం నార్పల మండలం నల్లపరెడ్డి గ్రామం నుంచి ఉపాధి కోసం మద్దెలచెరువు గ్రామానికి వలస వచ్చారు. ఇక్కడ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా నరేశ్ మృత్యువాత పడ్డాడు. సంఘటనతో కుటుంబీకులు బోరున విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


నరేశ్ మృతదేహం వద్ద బోరున విలపిస్తున్న కుటుంబీకులు

గుత్తి ఆర్‌ఎస్‌లో ఐదు ఇళ్లలో చోరీ

గుత్తి: మున్సిపల్ పరిధిలోని గుత్తి ఆర్‌ఎస్‌లో శనివారం అర్ధరాత్రి ఐదు ఇళ్లలో చోరీ జరిగింది. అంబేడ్కర్ కాలనీకి చెందిన ఓబులేశు కుటుంబంతో అనంతపురంలో బంధువుల సీమంతానికి వెళ్లాడు. ఇంటికి వేసిన తాళాలను దుండగులు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. రెండు బీరువాలను ధ్వంసం చేసి అందులో ఉన్న రూ.5 వేల నగదు, మూడు ఉంగరాలు, జత కమ్మలు, జత వెండి గొలుసులు అపహరించారు. అదే విధంగా మెయిన్ రోడ్డులో ఉన్న సుధీర్ కుమార్ స్టీల్ సామాన్ల షాపు వెనక భాగంలో ఉన్న తలుపులకు వేసిన తాళాలు పగులగొట్టారు. క్యాష్ టేబుల్ డ్రాయర్‌లో ఉన్న రూ.25 వేల నగదు ఎత్తుకెళ్లారు. నాలగడ్డ వీధిలో నివసిస్తున్న సుశీల ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లగా తాళాలు పగులగొట్టారు. ఇంట్లో చెక్క బీరువాను ధ్వంసం చేసి రూ.5 వేల నగదు ఎత్తుకెళ్లారు. అదే వీధిలో పూల లక్ష్మీదేవి ఇంటితో పాటు మరో ఇంట్లో చోరీయత్నం జరిగింది. ఎటువంటి వస్తువులు చోరీకి గురికాలేదని తెలిపారు. సీఐ ప్రభాకర్‌గౌడ్, ఎస్‌ఐ చాంద్ బాషా సంఘటనాస్థలాలు పరిశీలించారు. అనంతపురం క్లూస్ టీం ద్వారా తనిఖీలు నిర్వహించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


గుత్తి ఆర్‌ఎస్‌లోని ఓబులేశు ఇంట్లో బీరువాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ చాంద్‌బాషా

ద్విచక్ర వాహనానికి దారి ఇవ్వలేదని...

గొర్రెల కాపరి హత్య


నరసింహప్ప మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

పావగడ: తాను వెళ్తున్న ద్విచక్ర వాహనానికి గొర్రెలు దారి ఇవ్వడం లేదని గొర్రెల కాపరిపై దాడి చేసి హత్య చేసిన సంఘటన ఆదివారం సాయంత్రం పావగడ తాలూకా చెన్నరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివి.పరిగి మండలం ముద్దిరెడ్డిపల్లికి చెందిన నరసింహప్ప (53) ఏడాది క్రితం గొర్రెలను మేత కోసం పావగడ ప్రాంతంలోని బుగుడూరు, గుమ్మగట్ట తదితర ప్రాంతాలకు తరలించాడు. సాయంత్రం గొర్రెలు తోలుకుని గుమ్మఘట్టకు వెళ్తున్నాడు. ఈ సమయంలో పరిగి మండలం చెరుకూరు గ్రామానికి చెందిన రామాంజి, అనిల్ ద్విచక్ర వాహనంపై చెన్నరెడ్డిపల్లి వైపు వెళ్తున్నారు.అయితే ఎంత సేపటికి దారి కల్పించలేదని గొర్రెల కాపరి నరసింహప్పతో వాగ్వాదానికి దిగారు. చెంపకు కొట్టి కాలితో తన్నడంతో ఒక్కసారిగా కుప్పకూలి నరసింహప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పావగడ సీఐ మహేష్, ఎస్‌ఐ కాంతరాజు తెలిపారు.

'మహనీయుల అడుగుజాడల్లో నడవాలి'

అనంతపురం టౌన్ : సమాజంలో ప్ర తిఒక్కరూ మహనీయుల అడుగు జా డల్లో నడవాలని జడ్పీ చైర్మన్ చమన్‌సాబ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో దావతే ఇస్లామి ధార్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో ఇజ్తిమా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గౌస్‌మొద్దీన్,మత బోధకుడు అరీఫ్ అలీ అక్తారీ ఖురాన్ పాల్గొన్నారు.

రైలు కింద పడి యువతి మృతి

హిందూపురం టౌన్: మలుగూరు సమీపంలో రైలు కిందపడి యువతి మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సూర్యనారాయణ తెలిపిన వివరాలివి. లేపాక్షి మండలం శిరివరం గ్రామానికి చెందిన సరస్వతి (19) కొట్నూరు సమీపంలోని మిల్లులో పనిచేస్తుండేది. శనివారం ఉదయం పీఎఫ్ డబ్బులు తీసుకొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. సాయంత్రానికి కూడా రాకపోవడంతో సోమందేపల్లి మండలం నడింపల్లికి వారి అక్కయ్య ఇంటికి వెళ్లిందని తల్లిదండ్రులు భావించారు. అయితే ఆదివారం మధ్యాహ్నం రైల్వే ట్రాక్‌పై మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి వెళ్లి అక్కడ ఉన్న అడ్రస్‌తో సరస్వతి తండ్రి వెంకటస్వామికి సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. కూతురి మృతదేహం చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. శవ పంచనామా నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. ఇదిలా ఉంటే రైలు కిందపడి ఆత్మహత్యకు కారణాలు పోలీసులు ఆరా తీస్తున్నారు. సంఘటనా స్థలంలో లేఖ దొరికినట్లు స్థానికులు పేర్కొంటుండగా... పోలీసులు మాత్రం అలాంటిదేమి లేదంటున్నారు.

గుంతకల్లు - గుత్తి రైలు మార్గంలో మరొకరు...

గుంతకల్లు టౌన్: గుంతకల్లు-గుత్తి రైలు మార్గంలోని సత్యనారాయణ పేట వద్ద దోనుముక్కల రోడ్డులోని ఇంద్రమ్మ కాలనీకి చెందిన ప్రసాద్(30) అనే యువకుడు ఆదివారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.


నేడు తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

శెట్టూరు: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం రైతు సమస్యలపై తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకుడు టైలర్ వన్నూరుస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా పంపిణీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. అర్హులైన రైతులకు సబ్సిడీ నేటికీ అందలేదన్నారు. ప్రభుత్వం స్పందించి అర్హులైన రైతులకు సబ్సిడీ మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ముట్టడి కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ నాయకులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

లోకల్ గైడ్

ఎమ్మెల్యే డైరీ

రాయదుర్గం : శాసనసభ్యులు, గ్రామీణ గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు సోమవారం బెంగళూరులో ఉంటారు.



రాయదుర్గం : మధు : జయ జానకి నాయక
కేబీ ప్యాలెస్ : నేనే రాజు నేనే మంత్రి
ఎస్వీ సినిమాక్స్ : లై
కణేకల్లు - శ్రీ చిక్కణ్ణేశ్వర : జయ జానకి నాయక
ఉద్దేహాళ్ : తాజ్ : జయ జానకి నాయక

అంబేద్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కణేకల్లు : కళ్యాణదుర్గం మండలంలోని దాసంపల్లి గ్రామంలో 31వ తేదీన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కణేకల్లు కృష్ణ కోరారు. భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దళితులు కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరుకావాలని చిక్కణ్ణేశ్వర స్వామి దేవాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పరశురామ్, వన్నూరుస్వామి, యల్లప్ప, గంగాధర, బసప్ప, వెంకటేశులు పాల్గొన్నారు.

నేడు నేమకల్లులో విత్తన పంపిణీ

బొమ్మనహాళ్ : ఇప్పటివరకు మెట్ట పొలాల్లో పంటలు వేయని రైతులకు సోమవారం ఉచితంగా ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఏవో అహ్మద్ బాషా తెలిపారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్ ఫోన్‌తో పాటు వ్యవసాయ కార్యాలయం వద్దకు రావాలన్నారు. ప్రస్తుతం ఉలవ 15 క్వింటాళ్లు, కొర్ర 10.2, పెసర ఆరు, అలసందలు 20 క్వింటాళ్లు నిల్వ ఉన్నాయన్నారు.

విద్యానికేతన్ జట్టుపై ఆర్డీటీ విజయం

కణేకల్లు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం జరిగిన సన్నాహక క్రికెట్ మ్యాచ్‌లో కణేకల్లు క్రాసింగ్‌కు చెందిన విద్యానికేతన్ జట్టుపై ఆర్డీటీ క్రికెట్ సెంటర్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేపట్టిన ఆర్డీటీ జట్టు నిర్ణీత 25 ఓవర్లకు 160 పరుగులు సాధించింది. ఇందులో కుళ్లాయ్ 61, అజిత్ 21 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన విద్యానికేతన్ 75 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తరుణ్ నాలుగు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. కార్యక్రమంలో ఆర్డీటీ క్రికెట్ కోచ్ హరినాథ్‌రెడ్డి, విద్యానికేతన్ కోచ్ మోహన్, పురుషోత్తమ్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు







రాయదుర్గం, కణేకల్లులో నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుడు, ఉడేగోళంలో అన్నదానం చేస్తున్న వీరశైవ లింగాయత్‌లు

ఘనంగా వినాయకుడి నిమజ్జనోత్సవం

రాయదుర్గం : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను మూడవ రోజైన ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిమజ్జనం చేశారు. జేఆర్ఎస్ కాలనీ, రాజీవ్ గాంధీ కాలనీ, కోతిగుట్ట తదితర ప్రాంతాల్లో కొలువుదీరిన బొజ్జగణపయ్యలను ప్రధాన వీధుల్లో ఊరేగించారు. యువకులు ఆనందోత్సాహాల నడుమ కేరింతలు కొడుతూ, రంగులు చల్లుతూ, డప్పులు వాయిస్తూ, బాణసంచాలు పేల్చుతూ ముందుకు సాగారు. మహిళలు వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. పురవీధుల్లో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలివెళ్లారు.

రాయదుర్గంరూరల్‌లో : 74 ఉడేగోళం గ్రామంలో ఆదివారం వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ట్రాక్టర్లు, ఎద్దులబండ్లను అందంగా అలంకరించి విగ్రహాలను ప్రతిష్ఠించి గణపతిబప్పా మోరియా అంటూ నినాదాలతో గ్రామ సమీపంలోని బావిలో నిమజ్జనం చేశారు.

గుమ్మఘట్టలో : మండల పరిధిలోని కలుగోడు, 75 వీరాపురం, పూలకుంట తదితర గ్రామాల్లో ఆదివారం గణేష నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించి ఆయా గ్రామాల సమీపంలోని కొలనుల్లో నిమజ్జనం చేశారు.

కణేకల్లులో : గణేష్ నిమజ్జనం ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. నేసేపేట, హరిజనవాడ, లిటిల్ ఏంజిల్స్ స్కూలు, బీసీ హాస్టల్, దేవమ్మ గుడి దగ్గరతో పాటు పలు వీధుల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలను మేళతాళాలతో, టపాసులు పేల్చుతూ భారీ ఊరేగింపు మధ్య నిమజ్జనానికి తరలించారు. హెచ్చెల్సీ కాలువలో నీరు లేక పోవడంతో వేదావతి హగరిలో నిల్వ ఉన్న వర్షపునీటిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

బొమ్మనహాళ్‌లో : మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక చవితి మూడవ రోజున గణేశ నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. ఎల్బీనగర్ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద, ఉప్పరహాళ్, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, లింగదహాళ్, ఉంతకల్లు, చంద్రగిరి, కురువల్లి, దర్గాహోన్నూరు, గోవిందవాడ తదితర గ్రామాల్లో అందంగా అలంకరించిన వాహనాల్లో గణేశ విగ్రహాలను ఉంచి ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. ఎస్ఐ శ్రీరామ్‌శ్రీనివాస్, ఎస్‌హెచ్‌వో లక్ష్మీనారాయణ బందోబస్తు పర్యవేక్షించారు.

డీ హీరేహాళ్‌లో : మండలంలో ఆదివారం వినాయకని మజ్జనం భక్తిశ్రద్ధలతో చేశారు. గొడిశెలపల్లి, డీ హీరేహాళ్, కాదలూరుతో పాటు అన్ని గ్రామాల్లో వినాయకుని నిమజ్జనాన్ని నిర్వహించారు. జైబోలో గణేష్ మహారాజ్‌కీ అంటూ నినాదాలు చేస్తూ యువకులు డప్పు వాయిద్యాలు, కేరింతల నడుమ వినాయకుడిని నిమజ్జనం చేశారు.





ఎల్‌బీ నగర్, డీ హీరేహాళ్‌లో నిమజ్జనానికి తరలుతున్న గణేషులు

గోశాలకు పశుగ్రాసం వితరణ



టిప్పర్ల ద్వారా పశుగ్రాసం పంపిస్తున్న రైతులు

బొమ్మనహాళ్ : కర్ణాటక కూడ్లిగి తాలుకాలోని గుండుబొమ్మనహళ్లి వద్దనున్న గోశాలకు ఉద్దేహాళ్‌కు చెందిన రైతులు రూ.3 లక్షల పశుగ్రాసం వితరణ చేశారు. రైతులకు పశుగ్రాసం కర్ణాటక ప్రభుత్వం కొని అందిస్తుండగా ఇక్కడి రైతులు స్పందించి పశుగ్రాసాన్ని అందించారు. జొన్న, మొక్కజొన్న పచ్చి పశుగ్రాసాన్ని ఆరు టిప్పర్ల ద్వారా డ్రైవర్ మారుతి, మధు, రామాంజనేయులు, పట్టాభిరామారావు, యు రామరాజు, వన్నూరుస్వామి తరలించారు.


ఘనంగా ఎన్ఎంయూ ఆవిర్భావ దినోత్సవం


రాయదుర్గంరూరల్ : పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎన్ఎంయూ నాయకుల ఆధ్వర్యంలో ఎన్ఎంయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆ సంఘం డిపో ప్రెసిడెంట్ టీఎస్‌కే జిలాన్, కార్యదర్శి హెచ్‌టీ స్వామి పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు టంకశాల హనుమంతు, కార్యదర్శి నాగరాజు, జోనల్ కార్యదర్శి కేపీ ఖాన్ ముఖ్య అతిథులుగా పాల్గొని జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచారు. వారు మాట్లాడుతూ ఎన్ఎంయూ కార్మికుల కోసం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. సంఘం బలోపేతానికి కార్మికులంతా ఐకమత్యంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 60 రోజుల సమ్మెక్యాంధ్ర సెలవులు, 60 యేళ్ల ఉద్యోగ కాల పరిమితిని పెంచినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రికు కృతజ్ఞతలు తెలిపారు. సెప్టెంబర్ 12వ తేదీన విజయవాడలో జరిగే గోల్డెన్ జూబ్లీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొంటున్నట్లు తెలిపారు. పెద్దఎత్తున ఎన్ఎంయూ కార్మికులు పాల్గొని సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ కార్యదర్శి భాస్కర్ నాయుడు, ఎంఎండీ షఫీ, రాయుడు, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న ఎన్ఎంయూ నాయకులు







పట్టణంలో వివిధ ఆకృతుల్లో కొలువుదీరిన గణనాథులు

జైజై గణేశా...

రాయదుర్గం : పట్టణంలోని వినాయక సర్కిల్, నీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద, బళ్లారి రోడ్డు, నేసేపేట, తేరుబజార్ తదితర ప్రాంతాల్లో ఆదివారం గణనాథులను వివిధ అలంకరణల్లో కొలువుదీర్చారు. గణనాథులను దర్శించుకునేందుకు పట్టణ ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చారు.

నేడు జిల్లాస్థాయి మీకోసం

అనంతపురం కలెక్టరేట్: కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం జిల్లాస్థాయి మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ వీర పాండ్యన్, జేసీ రమామణి, జేసీ-2 ఖాజా మొహిద్దీన్, డీఆర్‌ఓ మల్లీశ్వరితోపాటు ఇతర ఉన్నతాధికారులు హాజరై ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ఫిర్యాదుదారులు అర్జీతోపాటు ఆధార్ కార్డు, సెల్ నెంబర్ తప్పని సరిగా తీసుకురావాలని సూచించారు.ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంటెక్ కౌన్సెలింగ్‌కు
140 మంది హాజరు

జేఎన్‌టీయూ: ఎంటెక్, ఎంఫార్మ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం గేట్, జీప్యాట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు 140 మంది ఆదివారం కౌన్సెలింగ్‌కు హాజరైనట్లు వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య విజయ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కూడా కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. అభ్యర్థులు ఉదయం 10 గంటలకు జేఎన్‌టీయూ పరిపాలన భవనంలోని అడ్మిషన్స్ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలన్నారు. అలాగే ఏపీ పీజీఈసెట్-2017లో అర్హత సాధించిన విద్యార్థులకు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

ఎస్కేయూ అడ్మిషన్స్ జాయింట్ డైరెక్టర్ జీవీ రమణ రాజీనామా

ఎస్కేయూ: వర్సిటీ అడ్మిషన్ల జాయింట్ డైరెక్టర్ జీవీ రమణ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని రిజిస్ట్రార్ సుధాకర్‌బాబుకు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. తనకంటే జూనియర్‌ను అడ్మిషన్స్ డైరెక్టర్‌గా నియమించడంతో మనస్తాపానికి గురై రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జీవీ రమణ సోషియాలజీ విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు.

నేడు డీటీల ప్రమోషన్ల డీపీసీ

అనంతపురం కలెక్టరేట్: రెవెన్యూ శాఖలో డిప్యూటీ తహసీల్దార్ల పదోన్నతుల కోసం సోమవారం డీపీసీ నిర్వహించనున్నారు. ఇదివరకు ఈనెల 23వ తేదీన డీపీసీ నిర్వహించాలని సీసీఎల్ఏ నిర్ణయించగా.. కొన్ని అనివార్య కారణాల నేపథ్యంలో ఈనెల 28వ తేదీకి వాయిదా వేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పనిచేసే ఏడుగురు డిప్యూటీ తహసీల్దార్లకు తాజాగా జరిగే డీపీసీలో పదోన్నతి కల్పించనున్నారు. దీంతో ఆయా అధికారులు పదోన్నతుల కోసం ఆశతో ఎదురుచూస్తున్నారు.

సినిమా గ్రాఫ్
అనంతపురం

గంగ	: అర్జున్‌రెడ్డి
గౌరి	: ఫిదా
గాయత్రి	: వీఐపీ-2
గౌతమి	: లై
త్రివేణి	: వివేకం
తరంగిణి	: ఆనందో బ్రహ్మ
తేజస్విణి	: ఏ జెంటిల్‌మెన్
శాంతి	: నేనే రాజు నేనే మంత్రి
సుధ	: అర్జున్‌రెడ్డి
స్వప్న	: లయన్స్ గేట్
శ్రీవెంకటేశ్వర	: జయ జానకీ నాయక
నీలిమా	: అమీ తుమీ



గురువులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

యాడికి: మండలకేంద్రమైన యాడికి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2004-05వ సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా కలుసుకుని వారి యోగక్షేమాలు, స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో నాటి తీపిగుర్తులను వారు నెమరువేసుకున్నారు. అప్పట్లో చదువు చెప్పిన ఉపాధ్యా యులకు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. తమను గుర్తుంచుకుని సన్మానించడంపై గురువులు ఆనందం వ్యక్తంచేశారు.

పాఠశాల సహాయకులకు జేఎల్‌గా ప్రమోషన్లు కల్పించాలి

బీఈడీ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

అనంతపురం అర్బన్: జూనియర్ లెక్చరర్ల పదోన్నతులకు అడ్డంకిగా మారిన జీవో 223ను రద్దుచేసి 302ను పునరుద్ధరించాలని బీఈడీ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఆదివారం బీఈడీ టీచర్స్ అసోషియేషన్ కార్యవర్గసమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ సం ఘం రాష్ట్రకార్యదర్శి నారాయణస్వామి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందప్ప, శివశంకరప్ప మాట్లాడుతూ.. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు ఆమోదం లభించినా పాఠశాల సహాయకులకు పదోన్నతులు కల్పించడంలో ఇబ్బంది ఏర్పడిందన్నారు. గతంలో జారీ చేసిన జీవో 223ను రద్దు చేసినప్పుడే పదోన్నతులకు అవకాశం ఉంటుందన్నారు. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించి జీవో 302ను పునరుద్ధరించి పాఠశాల సహాయకులకు జేఎల్‌లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. అలాగే పాఠశాల, మాధ్యమిక, ఉన్నత విద్యలను ఒకే శాఖ కిందికి తీసుకురావాలన్నారు. 371డీని మార్పు చేసి జిల్లా యూనిట్‌గా పదోన్నతులు కల్పించాలన్నారు. నియోజకవర్గానికి ఒక డిప్యూటీ డీఈఓ, మం డలానికి ఇద్దరు ఎంఈఓలను నియమించి పర్యవేక్షణ పెంచాలన్నారు. ప్రతి మండలానికీ ఓ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి పేద పిల్లలు చదువుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. జిల్లాలో మరో ఐదు ప్రభుత్వ డైట్ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు పలువురు పాల్గొన్నారు.

ఎల్‌పీ వ్యవస్థ రద్దు కోసం ఉద్యమిద్దాం

భాషా పండితోపాధ్యాయ సమాఖ్య పిలుపు

అనంతపురం అర్బన్: లాంగ్వేజ్ పండిట్ల వ్యవస్థ రద్దు చేసే వరకూ సంఘాలకు అతీతంగా కలిసి ఉద్యమిద్దామని భాషాపండితోపాధ్యాయ సమాఖ్య నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం లాంగ్వేజ్ పండిట్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భాషా పండితోపాధ్యాయ సమాఖ్య నాయకులు గోవర్ధన్, జయరామ్, రవికుమార్ తదితరులు మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న లాంగ్వేజ్ పండిట్లపై వివక్ష చూపడం సరికాదన్నారు. అదే పాఠశాలల్లో ఇంగ్లీష్ టీచర్లను ఇతర స్కూల్ అసిస్టెంట్ల మాదిరిగానే గుర్తించి గౌరవిస్తున్నారన్నారు. ఎల్‌పీ తెలుగు, హిందీ పండిట్లు కూడా హైస్కూళ్లలోనే బోధిస్తున్నా.. పండిట్లు అనే భావనతో చూస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సమాన పని చేస్తున్నా.. తక్కువ వేతనం ఇస్తూ.. ఎందుకో వ్యత్యాసం...చూపిస్తున్నారన్నారు. కాబట్టి ఎల్‌పీ వ్యవస్థను రద్దు చేసేంతవరకూ పండిట్లందరం కలిసికట్టుగా ఉద్యమిద్దామని వారు పిలుపునిచ్చారు. సంఘాలకు అతీతంగా అందరూ ఒకే గొడుగు కిందికి వచ్చి జరుగుతున్న అన్యాయంపై పోరాటానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు ఆదినారాయణ, మల్లికార్జున, నరసారెడ్డి, శంకర్‌నారాయణ, చంద్రమోహన్, రమేష్, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జట్ల ఎంపిక

అనంతపురం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే బాలబాలికల జట్లను ఆదివారం ఎంపిక చేశారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వీరలంకయ్య నేతృత్వంలో జట్ల ఎంపిక జరిగింది. సెప్టెంబర్ 10నుంచి 22వ తేదీవరకూ ఆర్డీటీ సహకారంతో ఈ జట్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు కార్యదర్శి వీరలంకయ్య తెలిపారు. బాలురకు ఇండోర్ స్టేడియంలో, బాలికలకు ఆత్మకూరులో శిక్షణ ఉంటుందన్నారు. 22 నుంచి కర్నూలు జిల్లా పాణ్యంలో రాష్ట్రస్థాయి జట్లను ఎంపిక చేశారన్నారు. కటక్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఈ జట్లను పంపుతారన్నారు. కార్యక్రమంలో సెలెక్షన్ కమిటీ సభ్యులు రామయ్య, అనిల్, ప్రసాద్, అంజిబాబు, నరసింహులు, రాఘవేంద్ర, రాజేశ్వరి, లక్ష్మీకుమారి, సీనియర్ అథ్లెట్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన బాలబాలికల జట్లు

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 1, 9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): రుణాలు మంజూరవుతాయి. సన్నిహితుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. పొదుపు పథకాల గురించి సహోద్యోగులతో చర్చిస్తారు. ఆస్పత్రులు, ఔషధ రంగాల వారికి ప్రోత్సాహకరం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. కొత్త పరిచయాలు ఉల్లాసం కలిగిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

మిథునరాశి: (మే21-జూన్21): వృత్తి, వ్యాపారాల్లో మార్పులు, చేర్పులకు అనుకూలం. సహోద్యోగుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. ఉద్యోగ ప్రయత్నాలు కొలిక్కి వస్తాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతారు.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): పొదుపు పథకాలు, చిట్‌ఫండ్‌లు లాభిస్తాయి. మెయిల్స్, శుభ సందేశాలు అందుకుంటారు. సాంకేతిక విద్యా కోర్సుల్లో ప్రవేశానికి అనుకూలం. ప్రేమానుబంధాలు బలపడతాయి. విద్యార్థులకు శుభప్రదం.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్థిక విషయాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక విషయాలను సమీక్షించుకుంటారు. రుణాలు మంజూరవుతాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీ, సోదరుల వ్యవహారాలు, ప్రయాణాలు, చర్చలకు అనుకూల సమయం. వాహనాలు కొనుగోలు చేస్తారు. స్టేషనరీ, ఏజెన్సీలు, మార్కెటింగ్, బోధన రంగాల వారికి శుభప్రదం. శుభవార్త అందుకుంటారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. రాజకీయ, సినీరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులను సమీక్షించుకుంటారు. పాత బకాయిలు వసూలవుతాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): స్నేహానుబంధాలు విస్తరిస్తాయి. యూనియన్‌లు, సహకార సంఘాల కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు. వేడుకల్లో పాల్గొంటారు. ఊరేగింపులు, ప్రదర్శనల్లో పాల్గొంటారు. సంకల్పం నెరవేరుతుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో ప్రముఖుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. రాజకీయ, సినీ, బోధన రంగాల వారు గౌరవ పదవులు అందుకుంటారు. పూర్వానుభవంతో లక్ష్యాలు సాధిస్తారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): న్యాయ, రక్షణ, బోధన రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. సంకల్పం నెరవేరుతుంది.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పెద్దల ఆరోగ్యం మెరుగుపడుతుంది. వృత్తి, వ్యాపారాల్లో పురోగతిని సమీక్షించుకుంటారు. ప్రముఖుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. శ్రమకు తగిన ఫలితం అందుకుంటారు.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. న్యాయ, రక్షణ, బోధన రంగాల వారు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సమావేశాలకు సన్నాహాలు చేస్తారు. సంకల్పం ఫలిస్తుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

టంగ్ ట్విస్టర్స్

1. Clean clams crammed in clean cans.
2. There those thousand thinkers were thining how did the other three thieves go through.
3.Singing Sammy sung songs on sinking sand.
4. Picky people pick Peter Pan PeanutButter, 'tis the peanut-butter picky people pick.

సూక్తి

అసత్యంతో సాధించే విజయం కంటే.. సత్యంతో సాధించే పరాజయమే మేలు.

ఔనా!



డాల్ఫిన్లు ప్రతి అరగంటకు ఒకసారి సముద్ర ఉపరితలానికి వచ్చి ఊపిరి పీల్చుకుంటాయి.

అద్దాల మయసభ

అదో అద్దాల దారి. అందులో అడుగుపెట్టామో.. ఎటు వైపు చూసినా ప్రతిబింబాలే కనిపిస్తాయి. ఏ దిక్కుకు వెళ్లాలో అర్థం కాదు. కాలు తీసి కాలు వేద్దామంటే.. అంతా అయోమయం. అద్దాల తళుకులు, మిరుమిట్లుగొలిపే కాంతులు కనులను మాయ చేస్తాయి. మరి అద్దాల దారుల్లో అసలు దారేదో కనుక్కోవడమే దీని ప్రత్యేకత. ఇదో 'దారి కనుక్కోండి' పజిల్ అన్న మాట. సింగపూర్‌లోని 'విజ్ఞాన కేంద్రం'(సైన్స్ సెంటర్)లో ఆకట్టుకుంటున్న ఈ 'మిర్రర్ మేజ్' ఓ ఆధునిక మయసభ అన్నమాట!



'దారి కనుక్కోండి' పజిల్ అంటే చాలామందికి ఎంతో ఇష్టం. చాలా దేశాల్లో రకరకాల 'మేజ్ పజిళ్లు' పర్యాటకులను ఆకట్టుకుంటాయి. మొక్కజొన్న, పొద్దుతిరుగుడు తోటల్లోనూ తికమక పెట్టే దారులు ఏర్పాటు చేస్తుంటారు. అలానే సింగపూర్‌లో 'సైన్స్ సెంటర్' ఏర్పాటు చేసి 40 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఇటీవలే అందులో ఓ 'మిర్రర్ మేజ్'ను ఏర్పాటు చేశారు.



పెద్ద పెద్ద అద్దాలు ఫ్రేములతో దీన్ని తీర్చిదిద్దారు. ఇందులోకి అడుగుపెడితే చాలు.. పైనా, కిందా, ఎటు వైపు చూసినా అద్దాల అందాలే. ఒకటికి పది ప్రతిబింబాలు కనిపిస్తుంటే.. అంతా అయోమయంగా తోస్తుంది. ఎటువైపు వెళ్లాలో తెలియదు. దారి ఉంది కదా అని అటు వైపు వెళ్లామో.. అంతే అది 'డెడ్ ఎండ్'ను సూచిస్తుంది. ప్రతి మలుపులో భ్రమింపచేసే ఎన్నో మాయలు. అసలు దారి ఎటు ఉందో తెలుసుకుంటే ఈ పజిల్ పూర్తి చేసినట్టే. ఈ అద్దాల గందరగోళానికి తోడు, మిరుమిట్లు గొలిపే లైట్ల కాంతులు కళ్లను తప్పుదోవ పట్టిస్తాయి. మొత్తంగా 270 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఆ అద్దాల మేజ్ సందర్శకులన ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ మేజ్ సెప్టెంబర్ వరకు పర్యాటకుల కోసం అందుబాటులో ఉంటుంది. మయసభను తలపిస్తున్న ఈ మాయ అద్దాల దారిలో నడుస్తూ, తెగ సంతోషపడుతు ఆ జ్ఞాపకాల్ని తమ సెల్‌ఫోనుల్లో బంధించుకుంటున్నారు. ఎవరైనా ఉచితంగానే మిర్రర్ మేజ్‌ను సందర్శించవచ్చు.

- ❖ ఆసియాలోని అతి పెద్ద 'మిర్రర్ మేజ్'గా ఇది రికార్డు సృష్టించింది.
- ❖ కాంతి భౌతిక ధర్మంతో పాటు, రంగులు కలిగించే భ్రమను సందర్శకులకు తెలియజేయడమే ఈ మిర్రర్ మేజ్ లక్ష్యమని నిర్వాహకులు అంటున్నారు.
- ❖ బ్రిటన్‌కు చెందిన ప్రముఖ మేజ్ డిజైనర్ 'అడ్రియన్ ఫిషర్' ఈ మేజ్‌ను రూపొందించాడు.

నవ్వుల్ నవ్వుల్

లంబూ : ఏరా! మేధావీ కొత్త కారు కొన్నావట? ఏ కంపెనీది?

మిస్టర్ మేధావి : కంపెనీ పేరు గుర్తుకు రావడం లేదు కానీ 'టీ'తో స్టార్ట్ అవుతుంది.

లంబూ : అవునా! నాది పెట్రోల్ పోస్తే గానీ స్టార్ట్ కాదు.

చెప్పగలరా?


వనంలో ఉన్నా కానీ మనంలో లేను
దివిలో ఉన్నా కానీ భువిలో లేను
నత్తిలో ఉన్నా కానీ సుత్తిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

మీకు తెలుసా?




పడుకున్నప్పటికంటే టీవీ చూస్తుంటేనే ఎక్కువ క్యాలరీలు ఖర్చు అవుతాయి.


బొమ్మ గీయండి



దారి కనుక్కోండి



రంగులు వేయండి



జవాబులు

చెప్పగలరా? : వదిన
జంతర్‌మంతర్ :
1. మెలకువ
2. వినియోగం
3. సుప్రభాతం
4. పంచాయతీ

జంతర్‌మంతర్

1. మెకువల ▸ ....
2. వియోనిగం ▸ ....
3. భాతంసుప్ర ▸ ....
4. చాపంయతీ ▸ ....

చుక్కలు కలపండి



30న నీటి విడుదలకు అధికారుల సుముఖత

తుంగభద్ర డ్యాంను పరిశీలించిన మంత్రి కాలవ

రాయదుర్గం: తుంగభద్ర జలాశయం నుంచి ఎగువకాలువ(హెచ్చెల్సీ)కు ఆంధ్రావాటా నీటిని ఈనెల 30న విడుదల చేసేందుకు బోర్డు అధికారులు సుముఖత వ్యక్తం చేశారు. సమాచార పౌరసంబంధాలు, గ్రామీణ గృహ నిర్మాణ శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులుతో పాటు కదిరి ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా, హెచ్చెల్సీ ఎస్ఈ శేషగిరిరావు ఆదివారం తుంగభద్ర జలాశయాన్ని సందర్శించారు. అనంతరం వైకుంఠం అతిథి గృహంలో బోర్డు సీఈ శంకర్‌గౌడ్, ఎస్ఈ శశిభూషణ్‌రావుతో చర్చించారు. జిల్లాలోని కదిరి, పుట్టపర్తి, అనంతపురం, శింగనమల, రాయదుర్గం వంటి ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని వివరించారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(సీబీఆర్)లోనూ, రాయదుర్గం సమ్మర్ స్టోరేజి ట్యాంకులోనూ పూర్తిగా నీరు ఖాళీ అయినందున తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడనున్నాయని వివరించారు. ఈ పరిస్థితిల్లో తాగునీటి అవసరాలు తీర్చేందుకు వెంటనే నీరు విడుదల చేయాలని కోరారు. ప్రస్తుతం జలాశయంలో నిల్వ ఉన్న 60 టీఎంసీల నీటిలో ఆంధ్రా వాటా కింద తొమ్మిది టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక కూడా ఇండెంట్ ఇవ్వాలని బోర్డు అధికారులు వివరించారు. ఆంధ్రా సరిహద్దువరకు 105 కిలోమీటర్ల మేర నీరు ప్రయాణించి అక్కడికి చేరేపాటికి జలచౌర్యం జరిగే అవకాశముంటుందని తెలిపారు. దీంతో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఇండెంట్లు ఇస్తే వారి వారి వాటాల నీటిని విడుదల చేసేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఆంధ్రావాటా మాత్రమే విడుదల చేస్తే నీటి లెక్కింపు జలాశయంలోనే చేయాల్సి ఉంటుందన్నారు. ఇరురాష్ట్రాలూ ఇండెంట్లు ఇస్తే ఆంధ్రా సరిహద్దులో లెక్కిస్తామన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా మంత్రికి వివరించారు. నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కర్ణాటక ప్రభుత్వాన్ని ఒప్పించి వారి ఇండెంట్ కూడా తీసుకునేందుకు ప్రయత్నించాలని ఈ సందర్భంగా సీఈని మంత్రి కోరారు. ఒకవేళ వారు ఇండెంట్ ఇవ్వని పక్షంలో ఆంధ్రావాటా నీటిని 30వతేదీ నుంచి విడుదల చేయాలని కోరారు. అలాగే అనంతపురం జిల్లా కలెక్టర్ ద్వారా 30వ తేదీ నుంచి నీరు విడుదల చేయాలని కోరుతూ బోర్డుకు లేఖ ఇప్పిస్తామని మంత్రి తెలిపారు. కనీసం రోజుకు వెయ్యి క్యూసెక్కుల ప్రకారం నీరందిస్తే మిడ్‌పెన్నార్(ఎంపీఆర్)కు చేరుకుని.. అక్కడి నుంచి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(సీబీఆర్)కు చేరుకునేసరికి నెలరోజుల సమయం పడుతుందన్నారు. కాబట్టి కర్ణాటకలో 29న జరిగే ఐసీసీ సమావేశంలో నీటి విడుదలకు ఇండెంట్ ఇచ్చేలా ఆ రాష్ట్రాన్ని ఒప్పించాలన్నారు. మంత్రి ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించిన బోర్డు ఎస్ఈ 30న నీరు విడుదల చేస్తామని తెలిపారు. కాకపోతే కర్ణాటక అభిప్రాయాన్ని కూడా వెంటనే తెలుసుకుంటామన్నారు.

నీరు విడుదల చేస్తాం : బోర్డు ఎస్ఈ

తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఆంధ్రావాటా నీటిని విడుదల చేసేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని బోర్డు ఎస్ఈ శశిభూషణ్ రావు తెలిపారు. జలాశయం 60 ఏళ్ల చరిత్రలో గత ఏడాది, ఈ ఏడాది మాత్రమే అత్యంత తక్కువ(వంద టీఎంసీల లోపు) నీటి లభ్యత ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు లభ్యమైన 60 టీఎంసీల నీరు తాగునీటి అవసరాలు తీర్చుకునేందుకు మాత్రమే సరిపోతాయనే ఉద్దేశంతో పంటలకు అందించడం లేదన్నారు. ఈ ఏడాది పంటలు సాగు చేయలేని పరిస్థితికి నీటి కొరతే కారణమన్నారు. కాబట్టి ఆంధ్రావాటా కింద అందే తొమ్మిది టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. దీనిపై కర్ణాటక అభిప్రాయం కూడా తీసుకుని నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.



కాలువపై ఏర్పాటుచేసిన టెలిమెట్రీ విధానాన్ని పరిశీలిస్తున్న మంత్రి కాలవ

కర్ణాటకలో కాలువను పరిశీలించిన మంత్రి

బళ్లారి నుంచి హొసపేటె వద్దగల తుంగభద్ర డ్యామ్ వరకు కాలువ(హెచ్చెల్సీ)ను మంత్రి కాలవ శ్రీనివాసులు తదితరులు సందర్శించారు. తుంగభద్ర బోర్డు కాలువ ఆధునికీకరణ కోసం వెచ్చిస్తున్న నిధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం 15 కిలోమీటర్ల వరకు కాలువ ఆధునికీకరణలో భాగంగా లైనింగ్ పనులు పరిశీలించారు. 3200 క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన కాలువలో 4 వేల క్యూసెక్కుల పరిమాణంలో నీ రు ప్రవహించేలా ఆధునికీకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అంతేకాకుండా ఆంధ్రా సరిహద్దులోనూ, డ్యామ్ హెడ్‌లోనూ, కర్ణాటక డిస్ట్రిబ్యూటరీల వద్దనూ ఏర్పాటు చేసిన టెలిమెట్రీ పరికరాలను వారు పరిశీలించారు. ఈ ఏడాది నుంచే టెలిమెట్రీ విధానం ద్వారా నీటి కొలతలు ప్రారంభిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. దరోజీ వద్ద ఉన్న కాలువ డీప్‌కట్‌ను పరిశీలించారు. 105 కిలోమీటర్ల (ఆంధ్రా సరిహద్దు) వరకు నీటి నష్టాలు గతంలో కంటే ఇప్పుడు తగ్గుతాయని తెలిపారు.

రోజూ 1500 క్యూసెక్కులు అవసరం

తుంగభద్ర డ్యామ్ నుంచి తమ వాటా కింద రోజూ 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సిన అవసరం ఉందని హెచ్చెల్సీ ఎస్ఈ శేషగిరిరావు కోరారు. జిల్లాలో నెలకొన్న తాగునీటి సమస్య ను వెంటనే పరిష్కరించేందుకు రోజూ 1500 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తే సీబీఆర్ కు కనీసం 20 రోజులకైనా నీరు చేరుతుందన్నారు. హంద్రీనీవా నీరు కూడా లేకపోవడంతో తాగునీటి సమస్య పరిష్కారానికి హెచ్చెల్సీ జలాలే శరణ్యమన్నారు. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలతో పాటు హెచ్చెల్సీ కింద పంటలు సాగు చేసే పరిస్థితి ఇప్పట్లో ఉండదన్నారు. రైతులు దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలన్నారు.

- శేషగిరిరావు, ఎస్ఈ , హెచ్చెల్సీ

రేపు టీడీపీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం

హాజరుకానున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి దేవినేని

అనంతపురం అర్బన్: తెలుగుదేశం పార్టీ జిల్లా సమన్వయకమిటీ సమావేశం ఈనెల 29వ తేదీ (మంగళవారం) నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే బీకే పార్థసారథి తెలిపారు. జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్‌లో గల బీకే స్వగృహంలో ఈ సమావేశం జరగనుంది. దీనికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, భారీనీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో పాటు హిందూపురం పార్లమెంటు పరిశీలకుడు, ఎక్సైజ్ శాఖ మంత్రి జవహర్ హాజరవుతారు. ప్రధానంగా జిల్లాలోని నీటి సమస్య, ప్రత్యామ్నాయవిత్తనాలు, పంటనష్టపరిహారం తదితర అంశాలపై సు దీర్ఘంగా చర్చించనున్నారు. ఇదే నేపథ్యంలో జిల్లాపరిషత్ చైర్మన్ పదవీ ఒప్పందంపై కొనసాగుతున్న ఉత్కంఠకు తెరదించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ సమావేశానికి జల్లాలోని మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలిసభ్యులు, సమన్వయకమిటీ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని బీకే కోరారు.





ఆదివారం విజయవాడలోని కనకదుర్గ అమ్మవారిని దర్శించుకోవడానికి వెళ్తున్న మంత్రి పరిటాల సునీత, కుటుంబ సభ్యులు.. అనంతరం మంత్రికి ప్రసాదాన్ని, అమ్మవారి ఫొటోను అందజేస్తున్న ఆలయ అధికారులు

తుంగభద్ర జలాశయ సమాచారం

27-8-17	ప్రస్తుతం	గత ఏడాది
నీటిమట్టం (అడుగులు)	1620.58	1617.83
సామర్థ్యం (టీఎంసీలు)	59. 81	52.55
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	10, 795	7, 453
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	850	8, 878



'గిడుగు' స్మారక అవార్డుకు టీచర్ శ్రీరాములు ఎంపిక

బుక్కరాయసముద్రం: తెలుగువ్యవహారిక భాషోద్యమ పితామహుడు రావు బహద్దూర్ గిడుగు రామ్మూర్తి పంతులు స్మారక అవార్డుకు మండలంలోని వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్లోపాధ్యాయుడు శ్రీరాములు ఎంపికయ్యారు. ఈనెల 29న గి డుగు రామ్మూర్తి పంతులు జయంత్యుత్సవా లను పురస్కరించుకుని రాష్ట్రంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో 29న జరిగే పురస్కారాల ప్రదానోత్సవంలో ఈ గౌరవ పురుస్కారాన్ని శ్రీరాములు అందుకోనున్నారు. 1989 డీఎస్సీలో 1800 ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై ఉద్యమం నడిపి ఆ పోస్టులు ఇప్పించడంలో శ్రీరాములు కీలకపాత్ర పోషించారు. అలాగే స్పెషల్ టీచర్లకు 95 ఈవో అమ లు చేయడంలో, బకాయిలు ఇప్పించడంలో కీలక పాత్ర పోషించారు. అలాగే అనంతపురం రూరల్ మండలంలో రీసోర్స్ పర్సన్‌గా పనిచేస్తున్న సమయంలో అప్పటి జిల్లా కలెక్టర్ సోమేష్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు.

సుమారు 15 సంవత్సరాలుగా విద్యారంగంలో అనేక సేవ లందించడంతో పాటు విద్యార్థుల విద్యాభివృద్ధికి విశేషంఘ కృషి చేశారు. ఇలా పలు సేవా కార్యక్రమాలు చేపట్టినందునే అయన ఈ అవార్డుకు ఎంపిక య్యారు.



8న జేఎన్‌టీయూ పాలకమండలి సమావేశం

జేఎన్‌టీయూ: వాయిదా పడుతూ వస్తున్న జేఎన్‌టీయూ పాలకమండలి సమావేశం సెప్టెంబర్ 8న నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. వర్సిటీలో పోస్టుల భర్తీ అంశంపై ప్రభుత్వం జారీ చేసిన జీవోను పాలకమండలి సభ్యులు ఆమోదించనున్నారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు ప్రభుత్వం జారీ చేసిన జీవోను ఆమోదించి ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే జేఎన్‌టీయూ ఇంత వరకూ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయలేదు. జేఎన్‌టీయూలో 158 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో 10 ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

నేటి నుంచి పనుల నిలిపివేత..!

అనంతపురం కార్పొరేషన్ : నగరపాలక సంస్థలో పెండింగ్ ఉన్న బిల్లులు చెల్లింపులో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సోమవారం నుంచి అభివృద్ధి పనులను నిలిపివేయనున్నారు. 271 విచారణ బిల్లులతోపాటు, బీఆర్‌జీఎఫ్, 13వ ఆర్థిక సంఘం తదితర పనుల బిల్లులు కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఇటీవలే కాంట్రాక్టర్లు సోమవారం నుంచి పనులు చేయకుండా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు నగరపాలక సంస్థలో మీకోసం

అనంతపురం కార్పొరేషన్ : నగర పాలక సంస్థలో సోమవారం మీకోసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆదివారం కార్యాలయ వర్గాలు తెలిపాయి. డివిజన్లలో నెలకొన్న సమస్యలను వినతుల రూపంలో అధికారుల దృష్టికి తేవాలని కోరారు.

యూనిఫామ్ తయారీ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం ప్రెస్‌క్లబ్: సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూనిఫామ్ తయారీలో జరుగుతున్న అక్రమాలపై ప్రభుత్వం వెంటనే విచారణ చేసి అక్రమార్కులపై తగు చర్యలు తీసుకోవాలని మాదిగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పసులూరి ఓబులేసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... దుస్తుల తయారీలో ప్రభుత్వ కొలతలు కాకుండా తక్కువ కొలతలతో తయారు చేయడంతో విద్యార్థులకు అవి సరిపోవడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గంగాధర్, కుళ్లాయప్ప, మనోహర్ పాల్గొన్నారు.

కొనసాగిన గోపాల మిత్రల ధర్నా

అనంతపురం కలెక్టరేట్ : పశుసంవర్ధక శాఖ కార్యాలయం ఎదుట గోపాల మిత్రలు చేపట్టిన ధర్నా కార్యక్రమం ఆదివారం తొమ్మిదో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ గత ఏడాది జిల్లాలోని 66 మంది గోపాల మిత్రలను అధికారులు ఏకపక్షంగా తొలగించారని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని పలు మార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టినా పట్టించుకోలేదన్నారు.

డెంగీ జ్వరంపై అప్రమత్తత అవసరం

అనంతపురం వైద్యం : ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా డెంగీ జ్వరం వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని ప్రజలందరూ తగిన జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాలను కాపాడుకోవాలని జాతీయ ఆయూష్ వైద్యుల సంఘం (నామా) రాష్ట్ర నాయకులు డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు, పోగుల కుమారయ్య, గోకుల్ నాగేశ్వరావు పేర్కొన్నారు. నామా ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కమలానగర్‌లోనా శ్రీ రాజ్యలక్ష్మమ్మ ఆశ్రమంలో డెంగీ జ్వరంపై ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయూష్ వైద్యులు ముస్తాక్ అహ్మద్, నసీమా, భారతి, వేణుగోపాల్, ఆయూష్ పార్మాసిస్టులు మహేంద్రబాబు, ప్రతాపరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పాల్‌థామస్, స్వచ్ఛంధ సంస్థ కరుణాకరణ్, రాజ్యలక్ష్మమ్మ ఆశ్రమం అధ్యక్షుడు సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలని రేపు కలెక్టరేట్ ఎదుట నిరసన

అనంతపురం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిని పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 29న కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గోవిందు, రామన్న తెలిపారు. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయులకు భద్రత లేకుండాపోయిందన్నారు. ఇందులో భాగంగానే మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్నామన్నారు.

'విద్యార్థిని మృతికి కారకులను శిక్షించాలి'

అనంతపురం అర్బన్: కర్నూలులో కట్టమంచి రామలింగారెడ్డి పాఠశాలలో అనుమానాస్పదంగా మరణించిన విద్యార్థిని ప్రీతిబాయి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని విద్యార్థులు నిరసన చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అమ్మాయి మృతిపై విచారణ జరిపి బాధ్యులైన కరస్పాండెంట్లను కఠినంగా శిక్షించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాకే నరేష్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శివకుమార్, మహ్మద్ బాషా పాల్గొన్నారు.

వాడవాడలా ఆధ్యాత్మిక శోభ

అనంతపురం టౌన్ : వినాయక చవితి వేడుకల్లో భాగంగా మూడో రోజున వాడవాడలా ఆధ్యాత్మికశోభ ఉట్టిపడింది. గ్రామాలు మొదలుకొని జిల్లాకేంద్రం వరకూ అన్ని ప్రాంతాల్లోనూ కొలువుదీరిన ఆదిదేవుడికి పూజలతో నీరాజనం పలికారు. ఆదివారం గణనాథుడి మండపాలన్నింటిలోనూ స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. రకరకాల రూపాల్లో పార్వతీసుతుడు భక్తులకు దర్శనమిచ్చాడు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సప్తగిరి సర్కిల్‌లో వినాయకచవితి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఉదయం సామూహిక గీతా పారాయణం, విష్ణుసహస్రనామ పారాయణాలు పఠించారు. విద్యుత్‌నగర్‌కు చెందిన శ్రీరామ సత్సంగం బృందంచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఓబుళదేవరనగర్‌లోని గణనాథుని మండపంలో సిద్ధి, బుద్ధి, వినాయక కళ్యాణోత్సవం నిర్వహించారు. మారుతినగర్‌లో అభ్యుదయ గణేష ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 31వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు.



అన్నదానం చేస్తున్న నటుడు ప్రకాష్, కార్పొరేటర్

హాస్యనటుడు తిరుపతి ప్రకాష్ సందడి..!

అనంతపురం కార్పొరేషన్ : హాస్యనటుడు తిరుపతి ప్రకాష్ ఆదివారం నగరంలో సందడి చేశారు. వినాయక చవితి పండుగ నేపథ్యంలో ఆయన నగరానికి వచ్చారు. స్థానిక రెండోరోడ్డులో గణేష్ మండపం వద్ద వినాయక భక్త మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక కార్పొరేటర్ లక్ష్మిరెడ్డితో కలసి భక్తులకు అన్నదానం చేశారు.

వైద్యకళాశాలలో ఘనంగా వినాయక చవితి వేడుకలు

అనంతపురం వైద్యం : నగరంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో వైద్య విద్యార్థులు, జూనియర్ వైద్యులు వినాయక చవితి వేడకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు వివిధ పూజలు నిర్వహించారు. ఆందరికి అందుబాటులో ఉండేలా వైద్యవిద్యార్థులు, జూనియర్ వైద్యులు వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో కళాశాల వైద్యులు, వైద్య సిబ్బంది పెద్దఎత్తున అక్కడికి వచ్చారు. అదేవిధంగా శాంతి థియేటర్ ఆవరణలో కూడా వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శాంతి థియేటర్ యాజమాన్యం గుర్రం సుధాకర్‌నాయు డు, ప్రసాద్, రమేష్‌బాబు, రమేష్, జయప్రకాష్‌నాయు డు, శేఖర్, మురళి, బాలాజీ, రసూల్, నూర్ పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న వైద్య విద్యార్థులు

మహిళ ఆత్మహత్యాయత్నం

ఆంధ్రజ్యోతి, అనంతపురం : రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని కళావతమ్మ కాలనీలో నివాసముంటున్న గుజ్జల రాధ అనే మహిళ ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆ మహిళ ఇంట్లోనే పురుగుల మందు తాగి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. రాధ భర్త కొన్నాళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె ఒంటరిగా జీవిస్తోంది. తీవ్ర మానసిక వ్యథకు లోనై ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'సంపన్నుల కోసమే స్వయంపోషక పాఠశాలల చట్టం'

అనంతపురం అర్బన్: విద్యారంగాన్ని కుబేరులకు అప్పగించేందుకే ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విద్యాచట్టాలను తీసుకొస్తున్నాయని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మండిపడ్డారు. విద్యావికాస వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉపాధ్యాయ భవన్‌లో స్వయం పోషక పాఠశాలల చట్టం-2017పై సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు గేయానంద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గతంలో విద్య సామాజిక కార్యక్రమంగా ఉండేదని... ఇప్పుడు చదువును వ్యాపార వస్తువుగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టబద్ధమైన రక్షణ కోసం కొత్త చట్టాలను తీసుకొస్తున్నారన్నారు. పాఠశాల పెట్టి దోచుకుని సంపాదించుకుని కుబేరులుగా మారండనే చట్టాలు వస్తున్నాయన్నారు. చిన్న చిన్న ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్ స్కూల్స్ సైతం ఇప్పుడు చట్టాలకు కుదేలవుతున్నాయన్నారు. కుబేరులను సంపన్నుల కోసమే స్వయం పోషకస్వతంత్ర పాఠశాలల చట్టం-2017ను ప్రభుత్వాలు తీసుకొచ్చాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసే ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసి పెద్దోళ్ల చేతుల్లో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జిలాన్, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి సూర్యుడు, ఆప్టా జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు మాట్లాడుతూ అనేక పాఠశాలలో కనీస మౌళిక వసతులు లేవన్నారు. సమావేశంలో సంఘాల నాయకులు సుధాకర్, రమణయ్య, సీకే నాగేంద్రబాబు, కోటేశ్వరప్ప, నా గేంద్ర, రామన్న, రామలింగయ్యానాయుడు, లక్ష్మినారాయణ, గోవిందరెడ్డి, తులసీరెడ్డి, భాస్కర్‌నారాయణ పాల్గొన్నారు.

వినాయక మండపాల్లో జాగ్రత్తలు పాటించండి

అనంతపురం సప్తగిరిసర్కిల్: వినాయక మండపాల్లో విద్యుత్‌పరమైన జాగ్రత్తలు పాటించాలని అనంతపురం డివిజనల్ ఇంజనీర్ నారాయణ నాయక్ పేర్కొన్నారు. మండపాల్లో విద్యుత్‌వైర్లకు ఎలాంటి అర్తులు లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని, ఒకవేళ ఉన్నా సక్రమంగా ప్లాస్టర్‌ను వేయాలన్నారు. మండపంలో ఎల్‌ఈడీ బల్బులు వేసుకోవడం మంచిదన్నారు. ఏవైనా విద్యుత్ సమస్యలు వచ్చినప్పుడు తమ సిబ్బందిని సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. సొంతగా ఎలాంటి పనులు చేయవద్దన్నారు. అదే విధంగా మండపాల్లో షాట్‌సర్క్యూట్ ఏర్పడి ప్రమాదాలు సంభవించిన సమయాల్లో అదుపుచేసేందుకు ఇసుక తదితర వాటిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వినాయక నిమజ్జనం వేడుకల సందర్భంగా విద్యుత్‌లైన్లను గమనిస్తూ విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్లాన్నారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

అనంతపురం టౌన్ : జిల్లాలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కసాపురం ఆంజనేయలు, సీపీఎం నగర కార్యదర్శి నాగేంద్రకుమార్ పేర్కొన్నారు. ఆదివారం గణేనాయక్‌భవన్‌లో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో బీజేపీ, టీడీపీ యువతకు అనేక హామీలిచ్చాయని, వాటిని ఆచరణలో పెట్టడంలో మాత్రం పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కేంద్రం 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, రాష్ట్రంలో టీడీపీ ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగులకు నిరుద్యోగభృతి, ఏటా డీఎస్సీ వంటి హామీలిచ్చాయన్నారు. ప్రభుత్వం ఏర్పడి 3 సంవత్సరాలయినా హామీలను అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయ కులు బాలకృష్ణ, నూరుల్లా, కుమార్, మసూద్, సంతోష్ పాల్గొన్నారు.

తక్కువ తూకంతో మోసం చేస్తే కేసులు

అనంతపురం కార్పొరేషన్ : తక్కువ తూకం ఉన్న బియ్యం ప్యాకెట్లను విక్రయించి వినియోగదారులను మోసం చేస్తే ఊరుకునేది లేదని, కేసులు నమోదు చేస్తామని తూనికలు కొలతల శాఖ హిందూపురం ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ వైజి శంకర్ తెలిపారు. హిందూపురంలోని ఎంఎఫ్ రోడ్డులో ఆయన ఆధ్వర్యంలో రైస్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ దుకాణంలో 25 కిలోల బియ్యం ప్యాకెట్ల తూకంలో తేడాలున్నట్లు గుర్తించారు. దీంతో ఓ హోల్‌సేల్ దుకాణంపై కేసు నమోదు చేశారు.

అలరించిన 'ఆడుకుందాం-పాడుకుందాం'

అనంతపురం టౌన్ : మొదటిరోడ్డులోని త్యాగరాజ సంగీత సభనందు మాసవారీ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన 'ఆడుకుందాం-పాడుకుందాం' కార్యక్రమం వీక్షకులను విశేషంగా అలరించింది. ఈసందర్భంగా గాయకులు లతా శ్యామ్, శ్రీదేవి, నాగరాజు, గాయత్రి, సతీష్, రమణ, రిషిత పాత, కొత్తపాటలను ఆలపించారు. అనంతరం ఈనెల 20న తాడిపత్రిలో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ జీనియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్'లో భాగంగా అన్నమయ్య సంకీర్తనల ఆలాపనలో పాల్గొని, విజేతలైన ఏడుగురు అనంత కళాకారులకు సర్టిఫికేట్‌లు అందజేశారు. కార్యక్రమంలో జ్ఞానేశ్వర్, మహేష్, ప్రభావతి, విజయకువర్, ఏలూరి యంగన్న, గోపాల్‌రావు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి 5వేల వాటర్ ప్యాకెట్లు

అనంతపురం కార్పొరేషన్ : వినాయక నిమజ్జనం నేపథ్యంలో నగరపాలక సంస్థ తరపున తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ మూర్తి ఆదివారం పేర్కొన్నారు. శింగనమల చెరువు వద్ద జరిగే నిమజ్జనానికి నగర పాలక సంస్థ తరపున కూడా సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. నాలుగు క్రేన్లతోపాటు, చీకటి లేకుండా ఉండేందుకు ఫోకస్ లైట్లు కూడా అందిస్తున్నామన్నారు. భక్తులు, ఇతర భద్రతా సిబ్బందికి నగరపాలక సంస్థ తరపున ఐదువేల వాటర్‌ప్యాకెట్లు సరఫరా చేస్తున్నామని తెలిపారు.

నేడు నృత్యప్రదర్శన

ఎస్కేయూ: నగరంలోని కమలానగర్ నందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జీఎస్టీ వినాయకుడి వద్ద సోమవారం సాయంత్రం 6 గంటలకు శ్రీ నృత్యకళానిలయం వ్యవస్థాపకురాలు గుంటూరు సంధ్యామూర్తి శిష్యబృందంచే నృత్యప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వినాయక ఉత్సవ సమితి ప్రతినిధులు పేర్కొన్నారు.

చౌడేశ్వరిదేవి ఆలయం ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ధర్మవరంఅర్బన్: చౌడేశ్వరిదేవి దేవాలయఅభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రామాలయంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ ఉచిత వైద్యశిబిరంలో అధిక సంఖ్యలో పాల్గొన్న రోగులకు వైద్యులు వివేక్, చందనలు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యులు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటేశ్, కాచర్ల నారాయణస్వామి, బండారు శ్రీనివాసులు, బీవీ రమణ, రాధాక్రిష్ణ, నారాయణస్వామి, నరసింహులు, శివయ్య, బండారు ఆంజనేయులు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చందమూరి చెరువులో నిమజ్జనం







వినాయకులను నిమజ్జనానికి తీసుకెళ్తున్న యువకులు

గంగ ఒడికి గణపయ్య

ధర్మవరంఅర్బన్: అడుగడుగునా కోలాహలం.. డప్పు వాద్యాలు.. రంగులు చల్లుకుంటూ యువత కేరింత... వెరసి ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. ఉదయం విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం విగ్రహాలను ప్రత్యేకంగా అలకరించి ట్రాక్టర్లపై ఉంచి నిమజ్జనానికి తీసుకెళ్లారు. రంగులు చల్లుకుంటూ నృత్యాలు, చెక్కభజనలు, కోలాటాల నడుమ ఉత్సాహంగా ర్యాలీ గణేష్ ర్యాలీ నిర్వహించారు. పలు ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇన్‌చార్జ్ డీఎస్పీ ముక్కా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సీఐ హరినాథ్, ఎస్ఐలు జయానాయక్, సురేశ్‌లు గట్టి బందోబస్తు నిర్వహించారు. విగ్రహాలను ప్యాదిండి వద్ద ఉన్న చందమూరి చెరువుల్లో నిమజ్జనం చేశారు.

తాడిమర్రి: వినాయక నిమజ్జనోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. సమీపంలోని నీటికుంటల్లో ప్రతిమలను నిమజ్జనం చేశారు. మండల వ్యాప్తంగా పిన్నధరి, నిడిగల్లు, మరువపల్లి అగ్రహారం, తాడిమర్రి, మద్దులచెరువు, శివంపల్లి, ఆత్మకూరు, దాడితోట, కునుకుంట్ల, రామాపురం, పెద్దకోట్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను యువకులు కోలాహలంగా నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తాడిమర్రి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ధర్మవరంరూరల్: మండలంలోని చిగిచెర్ల, చిన్నూరుబత్తలపల్లి, పోతుకుంట, చింతలపల్లి, గొట్లూరు తదితర గ్రామాలలో గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని యువకుల కోలాహలం మధ్య నిర్వహించారు. వినాయకుడిని ప్రత్యేక ట్రాక్టర్‌పై ఏర్పాటు చేసి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ ఊరేగింపులో రంగులు చల్లుకుంటూ నృత్యం చేశారు. అనంతరం గణనాథుడిని కుణుతూరు వద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

ముదిగుబ్బ: వినాయకచవితిని పురస్కరించుకుని వాడవాడలా వెలసిన విగ్రహాలను ఆదివారం భక్తులు కోలాహలంగా ఊరేగించి నిమజ్జనానికి తీసుకెళ్లారు. నిమజ్జనాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. నిమజ్జనం చేయడానికి ఎక్కడా నీరు లేక పోవడంతో వైవీఆర్ డ్యాంకు తరలించారు. రంగులు చల్లుకుంటూ పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా గడిపారు. అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మగ్బూల్‌బాషా బందోబస్తు నిర్వహించారు.

బత్తలపల్లి: మండలంలోని పలు గ్రామాలలో వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయకుని మూడు రోజులు పాటు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి మూడవ రోజు ఆదివారం వినాయకులను యువకులు, చిన్నారులు,మహిళలు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సవాల మధ్య నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ హారూన్‌బాషా పోలీసు బందోబస్తు నిర్వహించారు.



యువకుల కేరింతలు



మహిళల కోలాహలం



నిమజ్జనానికి వినాయక తరలిస్తున్న దృశ్యం



తాడిమర్రిలో...



ముదిగుబ్బలో...

గణేశుడికి ప్రత్యేక పూజలు

ధర్మవరంఅర్బన్: వినాయకుడికి పట్టణంలో వినాయకచవితి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.పలుప్రాంతాలలో ఏర్పాటుచేసిన వినాయకులు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వివిధ రూపాల్లో వినాయకుడు భక్తులకు దర్శినమిచ్చారు. మూడవ రోజు కొంతమంది వినాయకులను నిమజ్జనం చేయగా, మరికొంతమంది ఐదు, తొమ్మిది రోజుల పాటు పూజించి అనంతరం నిమజ్జనం చేయనున్నారు.

రూ.12,500కు లడ్డూ వేలం: పట్టణంలోని గాంధీనగర్ చౌడేశ్వరిదేవి దేవాలయం వద్ద వినాయకుని లడ్డు వేలంపాట నిర్వహించారు. ఉదయం వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, ఉత్సవకమిటీ నిర్వాహకులు మూడు రోజుల పాటు పూజలు నిర్వహించి అనంతరం లడ్డు వేలం వేశారు. సీకే బ్రదర్స్‌లో శ్రీనివాసులు, గోవిందులు రూ.12,500 లడ్డును దక్కించుకున్నారు. ప్రసాదాన్ని దక్కడం మహా భాగ్యమని శ్రీనివాసులు, గోవిందులు పేర్కొన్నారు.



వేలం పాటలో లడ్డూ దక్కించుకున్న సీకే బ్రదర్స్ శ్రీనివాసులు, గోవిందు







పట్టణంలో వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన గణనాథులు



ఆవు, దూడల విగ్రహం





నంద్యాలలో టీడీపీకి 30వేల మెజార్టీ : ఎమ్మెల్యే

ధర్మవరం: నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ తరపున పోటీ చేసిన భూమా బ్రహ్మానందరెడ్డి 30 వేల మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల వాగ్దానాలను ఒక్కొక్కటి నెరవేర్చడమే కాకుండా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీపడకుండా రేయింబవళ్లు రాజీపడుతూ ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారన్నారు. పరిశ్రమల కోసం దేశదేశాలు తిరుగుతూ రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు కృషిచేయడం వల్లనే పరిశ్రమలన్నీ రాష్ట్రం వైపు చూస్తున్నాయన్నారు. అనంత జిల్లాకు కియో ఫ్యాక్టరీ ఓ వరంలా మారిందని, వీటి వల్ల ప్రత్యక్షంగా 10వేల మందికి, పరోక్షంగా మరో 8వేల మందికి పైగా ఉపాధి కల్గే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, మార్కెట్‌యార్డ్ చైర్మన్లు బీరే గోపాలకృష్ణ, కమతం కాటమయ్య, పట్టణాధ్యక్షుడు చిప్పల మల్లికార్జున, జడ్పీటీసీ మేకల రామాంజినేయులు, ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, పురుషోత్తంగౌడ్, కౌన్సిలర్లు ఇనయతుల్లా, కేహెచ్‌ప్రకాశ్, నాయకులు తలారి చంద్రమోహన్‌బాబు, దేవరకొండ రామక్రిష్ణ, టైలర్ సాకే కుళ్లాయప్ప, మార్కెట్ రహీం, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న గోనుగుంట్ల

నేడు సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు : ఎంపీడీఓ

ముదిగుబ్బ: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రుణమేళా నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ మల్లికార్జున తెలిపారు. సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు తమ ఆన్‌లైన్ దరఖాస్తు పత్రాలతో పాటు ఆధార్, రేషన్‌కార్డులు, బ్యాంకు పాసుపుస్తకం తదితర ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాల్సి ఉందన్నారు.

ఘర్షణలో అన్నదమ్ములకు గాయాలు

గుత్తిరూరల్: మండలంలోని అనగానదొడ్డి గ్రామంలో ఘర్షణపడి అన్నాదమ్ములు గాయపడ్డారు. గ్రామంలోని జంగం నాగయ్య, ఆయన తమ్ముడు జంగం కృష్టయ్యలు ఇంటి విషయంలో మాటామాటా పెంచుకుని ఘర్షణ పడ్డారు. కృష్టయ్య అతడి బావమరిది నరసింహులు కర్రలతో దాడి చేయడంతో నాగయ్య చెయ్యి విరిగి తీవ్రంగా గాయపడ్డాడని పోలీసులు తెలిపారు. ఈ ఘర్షణలో కృష్టయ్య తలకు స్వలంగా గాయాలయ్యాయి. గాయపడిన వీరిని కుటుంబ సభ్యులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నాగయ్యను అనంతపురం తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గుంతకల్లులో టెంకాయ కొడుతున్న ఎమ్మెల్యే



జెండా ఊపి నిమజ్జన ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



అల్పాహారాన్ని అందజేస్తున్న మారుతీ బేకరీ నిర్వాహకులు



కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో ...

బై బై గణేశా..!

గుంతకల్లుటౌన్: వినాయక నిమజ్జనోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పలు వీధుల్లోని మండపాల్లో కొలువుదీర్చిన వినాయక విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లలో కొలువుదీర్చి ఊరేగింపుగా రైల్వే గ్రౌండు వద్దకు తీసుకువచ్చారు. పట్టణంలో నగర ఉత్సవ సమితి అధ్వర్యంలో చేపట్టిన నిమజ్జనోతవానికి ఎమ్మెల్యే జితేంద్రగౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ, వైస్ చైర్మన్ శ్రీనాథ్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, తహసీల్దార్ హరిప్రసాద్, డీఎస్పీ శ్రీధర్‌రావు హాజరయ్యారు. ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ పూజలు చేసి జెండా ఊపి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం 3 గంటలకు రైల్వే క్రీడా మైదానానికి వచ్చిన మూడు వినాయక విగ్రహాల నిర్వాహకులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. నిమజ్జన ఊరేగింపు స్టేషన్ రోడ్డు, మండిబజార్, గాంధీ సర్కిల్, ఆర్టీ స్ట్రీట్, మార్కెట్ రోడ్డు, మెయిన్ రోడ్డు, బస్టాండ్, పాతగుంతకల్లు మీదుగా నిర్వహించి మార్కెట్ యార్డు సమీపంలోని వినాయక ఘాట్‌లో నిమజ్జనం చేశారు. పొట్టి శ్రీరాములు సర్కిల్‌ల్లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రసాదాలను అందజేశారు. డీఎస్పీ శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో, అర్బన్ రూరల్ సీఐలు రాజా, గురునాథ్‌బాబు, ఎస్ఐలు నగేష్‌బాబు, వలిబాషు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర ఉత్సవ సమితి అధ్యక్షుడు బండారు కృష్ణమూర్తి, కార్యదర్శి సోమనాథ్, సభ్యుడు ఇల్లూరి లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు ఆమ్లెట్ మస్తాన్‌యాదవ్, అన్వర్‌బాషా, టీడీపీ నాయకులు కోడెల చంద్రశేఖర్, హనుమంతు, భజరంగ్‌దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంజూలా వెంకటేశ్, బీజేపీ నాయకులు పట్నం రామాంజినేయులు, గోవిందరాజులు, రామాంజినేయులు, పురంధర్, విజయ లక్ష్మి, కసాపురం రవి పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనంలో పాల్గొన్న భక్తులకు 60 అడుగుల రోడ్డులోని మారుతి స్వీట్, బేకరీ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అల్పాహారాన్ని అందజేశారు.

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లో ఆదివారం సాయంత్రం వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాలను ప్రత్యేకగా అలంకరించిన ట్రాక్టర్లలో కొలువుదీర్చి మేళాతాళాల మధ్య యువత కేరింతలతో పట్టణంలోని వీధుల గుండా ఊరేగించారు. అనంతరం స్థానిక గుత్తి చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేశారు. గుత్తిఆర్ఎస్‌లో బసినేపల్లి ఉప్పువంకలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. సీఐ ప్రభాకర్‌గౌడ్, ఎస్ఐ చాంద్‌బాషా గట్టి బందోబస్తును నిర్వహించారు.

గుత్తిరూరల్: మండలంలోని జక్కలచెరువు, తొండపాడు, గాజులపల్లి, గొందిపల్లి, ధర్మాపురం, బ్రాహ్మణపల్లి, రజాపురం, పెద్దొడ్డి తదితర గ్రామాల్లో ఆదివారం వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని వినాయక విగ్రహాలను ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లపై కొలువుదీర్చి మేళాతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామ శివారులోని నీటి కుంటలు, చెరువుల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

పామిడి : పట్టణంతోపాటు పల్లెల్లో వినాయక విగ్రహాల నిమజ్జనం ఆదివారం ఘనంగా జరిగింది. డప్పు వాయిద్యాల మధ్య యువత కేరింతలు కొడుతూ, చిందులేస్తూ ఎంతో అట్టహాసంగా వివిధ వాహనాలలో విగ్రహాలను నిమజ్జనానికి తీసుకువెళ్లారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



గుంతకల్లులో విగ్రహాల నిమజ్జనం



జక్కలచెరువులో యువకుల కేరింతలు



గుత్తిలో నిమజ్జనానికి తరలివెళ్తున్న విగ్రహాలు



పామిడిలో ...

ముగిసిన వినాయక ఉత్సవాలు

గుంతకల్లురూరల్: కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహించిన వినాయక ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. దీంతో ఆలయంలోని స్వామివారి మూల విరాట్టుకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. యాగశాలలో పూర్ణహుతి నిర్వహించి వినాయక పూజలను చేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ మధు, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏపీపీఆర్ నాల్గవ తరగతి ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గం ఎంపిక

గుత్తి: పట్టణంలోని ఏపీ పంచాయతీ రాజ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక పంచాయతీ రాజ్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మురళీకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడిగా జయభాన్, కార్యదర్శిగా మహమ్మద్, ఉపాధ్యక్షుడిగా చిట్టిబాబు, సహాయ కార్యదర్శిగా రామాంజినేయులు, కోశాధికారిగా శ్రీహరి రావులను ఎన్నుకున్నారు.

వ్యాపారాలపై వర్తకులతో ఎంపీ జేసీ ఆరా

గుంతకల్లుటౌన్: వ్యాపారాలు ఎలా జరుగుతున్నాయంటూ వర్తకులను ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని కసాపురం ఆలయ ట్రస్ట్ సభ్యుడు జగదీష్ ప్రసాద్ ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా జేసీ దుస్తుల వ్యాపారులతో వ్యాపారాలు, రాజకీయాల గురించి ఆరా తీశారు. అనంతరం కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని, వెండి వినాయకున్ని దర్శించుకున్నారు. కౌన్సిలర్ కృపాకర్, విశ్రాంత డీఎస్పీ సయ్యద్ జాఫర్, జడ్పీ మాజీ చైర్మన్ కేసీ నారాయణ, కో-ఆప్షన్ సభ్యురాలు మహబున్నీసా, పూజారి బసప్ప, మాజీ ఎమ్మెల్యే అరికెర జగదీష్ ఇంటికి వెళ్లి పలకరించారు. జేసీ వెంట ఎమ్మెల్యే జితేంద్రగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనాథ్‌గౌడ్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు పువ్వాడి చంద్రశేఖర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు తలారి మస్తానప్ప, కౌన్సిలర్లు ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, రమేశ్ గౌడ్, అన్వర్‌బాష, తెలుగుయువత పట్టణ అధ్యక్షుడు రాము, నాయకులు జింకల జగన్నాథ్, మధు, తదితరులు ఉన్నారు.

సేవాలాల్ మహరాజ్‌కు ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎంపీ జేసీ

గుత్తిరూరల్: మండలంలోని చెర్లోపల్లి పంచాయతీలోని సేవాఘడ్‌లో ఆదివారం అనంతపురం ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కేశవనాయక్, ట్రస్ట్‌సభ్యులు ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సేవాలాల్ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. నిర్మాణంలో ఆగిపోయిన టీటీడీ ఫంక్షన్ హాల్‌ను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అశ్వత్థనాయక్, సుబ్రహ్మణ్య నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా ఉద్యమించాలి : వాల్మీకులు

గుత్తి: వాల్మీకుల హక్కుల సాధన కోసం సమష్టిగా ఉద్యమించాలని వాల్మీకి సంఘం నాయకులు కృష్ణయ్య పేర్కొన్నారు. స్థానిక వాల్మీకి సంఘం కార్యాలయంలో ఆదివారం వాల్మీకి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వాల్మీకులు ఐక్యంగా ఉండి రాబోయే ఎన్నికల్లో తమ సత్తాను చాటాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు బొద్దుల రంగయ్య, వెంకటేశ్, సుబ్బరాయుడు, శివయ్య, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

లోకల్ గైడ్

ఎమ్మెల్యే డైరీ

గుంతకల్లు: స్థానిక ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ సోమవారం ఉదయం 10 గంటలకు క్యాంపు కార్యాలయంలో కౌన్సిలర్లతో సమావేశమవుతారు. సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు.

సినిమా గైడ్

గుంతకల్లు

వాసవి : జయ జానకి నాయక
చైతన్య : అర్జున్‌రెడ్డి
కేపీఎస్ : నేనే రాజు నేనే మంత్రి

గుత్తి

అమృత్: నేనే రాజు నేనే మంత్రి
కేపీఎస్ : జయజానకి నాయక

పామిడి

మంజు: ఆనందోబ్రహ్మ
హనుమాన్: జయ జానకి నాయక

అక్రమ మద్యం స్వాధీనం

హిందూపురం టౌన్: వైన్ షాపు నుంచి అక్రమంగా బెల్ట్‌షాపు నిర్వహించడానికి తీసుకెళ్తున్న అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్ట్‌చేసినట్లు రూరల్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా బిట్ కళాశాల వద్ద మలుగూరుకు చెందిన లక్ష్మయ్య అనే వ్యక్తి ద్విచక్రవాహనంలో 69మద్యం బాటిళ్ల తీసుకెళ్తుండగా అదుపులోకి తీసుకుని విచారించగా విక్రయించడానికి తీసుకెళ్తున్నట్లు ఒప్పుకున్నాడు. అతన్ని అరెస్ట్‌చేసి ద్విచక్రవాహనం సీజ్‌చేసి కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పరిగి: స్థానిక అమర్ విద్యామందిరంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 2013-14 బ్యాచ్‌కు సంబంధించిన విద్యార్థులు పాఠశాలలో కలుసుకుని ఒకరినొకరు ఆలింగనం చేసుకుని గత స్మృతులు గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు

జై బోలో గణేష్ మహరాజ్‌కీ..

పలు మండలాల్లో ప్రశాంతంగా నిమజ్జనం

హిందూపురం రూరల్: హిందూపురం గ్రామీణ మండలంలోని మలుగూరు, ఎంబీరేపల్లి, కగ్గల్లు, బా లంపల్లి, పంచాయతీల్లోని గ్రామాల ప్రజలు ఆదివా రం నాడు గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించా రు. మిగిలిన చౌళూరు, పూల కుంట, బేవనహళ్లి, పంచాయతీ గ్రామాలు సోమ వారం నిమజ్జనం జరుపుకోనున్నారు. ఊరేగింపుగా వస్తున్న వినాయకుడికి అడుగడుగునా నీటి బిందెలతో యువతులు స్వా గతం పలకడం విశేషం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటుచేసినట్లు రూరల్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

హిందూపురం టౌన్: వినాయక చవితిని పురస్కరించుకుని ప్రతిష్ఠించిన విగ్రహాలను నిమజ్జనం చేయడానికి ఆదివారం తరలించారు. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో చిన్న విగ్రహాలు ఏర్పాటు చేసుకున్న భక్తులు ఆదివారం ఊరేగింపుగా తీసుకొచ్చి గుడ్డం కోనేరులో నిమజ్జనం చేశారు.

లేపాక్షి : మండలంలోని సోమిరెడ్డిపల్లి, మామిడిమాకులపల్లి, కె.బసవన్నపల్లి, తదితర గ్రామాల్లో ఆదివారం గణేష్ నిమజ్జనాన్ని యువకులు ఉత్సాహంగా జరుపుకున్నారు. శుక్రవారం గణేష్ విగ్రహాలను కొలువుతీర్చి ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో మూడు రోజులు వినాయకునికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆదివారం వినాయకున్ని ప్రత్యేకంగా అలంకరించి వీధుల్లో ఊరేగిస్తూ చెరువు వద్ద ప్రత్యేకంగా నీళ్ల వదిలి గణేష్ నిమజ్జనాన్ని గావించారు.

పరిగి : పరిగి, కొడిగెనహళ్లి, మోదా, పైడేటి, ధనాపురం, పలు గ్రామాల్లో వినాయక సేవాసమితి ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల విఘాతం కలగకుండా పోలీసులు పలు జాగ్రత్తలు తీసుకున్నారు.

చిలమత్తూరు: మండలంలోని మరువకొత్తపల్లి, చిలమత్తూరు, తుమ్మలకుంట, ఆర్.మాకులపల్లి, టేకులోడు తదితర గ్రామాల్లో ఆదివారం గణేష్ నిమజ్జన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.



నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథుడు



చిలమత్తూరులో..



మిట్టమీదపల్లిలో...

లోకల్ గైడ్

localguide

హిందూపురం మార్కెట్‌లో కూరగాయల ధరలు



టమోట రూ.40, ఉల్లి 40, మిరప 60, బీరకాయ 40, ఉర్లగడ్డ 20, వంకాయ 30, బెండకాయ 40, క్యారెట్ 60, బీన్స్ 60, కోసు 30, మునగ 60, ముల్లంగి 40, బఠాణి 120, సీమవంకాయ 60, నెమలికోసు 60, దొండకాయ 40, బీట్‌రూట్ 40, క్యాబేజి 20, తెల్లగడ్డలు 100, కాకరకాయ 60, సొరకాయ 30, గోరు చిక్కుడు 40, చిక్కుడు 40, క్యాప్సికమ్ 80, అల్లం : 80

హిందూపురంలో సినిమాలు

శ్రీనివాస - నేనే రాజు నేనే మంత్రి -2, **విష్ణు** - వివేకం, **గురునాథ్**- జయ జానకి నాయక, **అమృత్** - దండుపాళ్యం, **లక్ష్మి** - అర్జున్‌రెడ్డి, **బాలాజీ** - ఆనందో బ్రహ్మ

వాహనదారులకు కౌన్సెలింగ్

హిందూపురం టౌన్: ద్విచక్రవాహనంలో త్రిబుల్ రైడింగ్ వెళ్తున్న వాహన చోదకులకు ట్రాఫిక్ ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, వినూత్న కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆదివారం పట్టణ పరిధిలో ద్విచక్రవాహనాల్లో ముగ్గురితో వెళ్తుండగా వారికి జరిమానా విధించి మూడుగంటలపాటు ద్విచక్రవాహనం ఇవ్వకుండా అక్కడే ఉంచి కౌన్సెలింగ్ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పరిగి : బంధువులకు ఆరోగ్యం బాగాలేదని సమాచారం తెలుసుకున్న పరిగికి చెందిన నీరుగంటి తిప్పన్న, మిత్రుడు భజంత్రి సురేష్ ద్విచక్రవాహనంపై హిందూపురం వైపు బయలుదేరారు. హిందూపురం నుంచి గుర్తుతెలియని మరో వాహనం వంతెనపై ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తిప్పన్న, సురేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో బెంగళూరుకు మెరుగైన చికిత్సకోసం తరలించారు. తిప్పన్న తల్లి గంగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శరత్‌చంద్ర తెలిపారు. అయితే ద్విచక్రవాహనాన్ని ఢీకొంది మడకశిర ప్రాంతానికి చెందిన కారుగా అనుమానిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

ఖురాన్ సందేశం శాంతి

- అవగాహన సదస్సులో మౌలానా వలీవుల్లాసాబ్

హిందూపురం టౌన్: పవిత్ర ఖురాన్‌లో శాంతి సందేశమే సమానత్వమే ఉందని హజరత్ మౌలానా వలీవుల్లాసాబ్ పేర్కొన్నారు. ఆదివారం ఎంఎంఎస్ ఫంక్షన్‌హాల్లో పహిమేదిన్ అకాడమి ఆధ్వర్యంలో ఇస్లామిక్ విద్య, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హజరత్ మౌలానా వలీవుల్లాసాబ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఖురాన్ పఠించి సమాజంలో సన్మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్ నూరుల్లా, అర్ఎంఎస్ షఫీవుల్లా, సిద్దిక్‌సేట్, మౌ లానా మాలిక్‌సాబ్, ఇలియాజ్, నజీర్, అకాడమీ వలంటీర్లు పాల్గొన్నారు.

'బెట్ట పరిస్థితులు తట్టుకునే మొక్కలు నాటాలి'

చిలమత్తూరు: జిల్లాలో వలాలను ఇచ్చే మొక్కలతోపాటు వర్షాభావ పరిస్థితులను తగ్గించే మొక్కలను పెంచి పోషించాలని సామాజిక అటవీ విభాగం డీఎఫ్ఓ వెంకటరమణ పేర్కొన్నారు. చిలమత్తూరు సమీపంలో ఎర్రకొండ అటవీప్రాంతంలో ఉన్న నర్సరీని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీశాఖ ఆధ్వర్యంలో కర్నాటక సరిహద్దు నుంచి గుట్టూరు వరకు జాతీయ రహదారి వెంబడి చెట్లు నాటే కార్యక్రమం చేపట్టారు. అటవీశాఖ అధికారులు విద్యార్థులకు మొక్కల పెంపకం, పోషణపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓలు రాముడు, శ్రీరాములు పాల్గొన్నారు.

వైభవంగా విఘ్నేశ్వరుడి కల్యాణం



వివాహ వేడుకకు ముస్తాబైన విఘ్నేశ్వరుడు

హిందూపురం అర్బన్: పట్టణ పరిధిలోని లేపాక్షి రోడ్డులో నెలకొన్న శ్రీ వల్లభ వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ప్రథమ పూజితుడు, విఘ్నరాజు అయిన శ్రీ వినాయకుని కల్యాణం శ్రీ సిద్ధి, బుద్ధి సమేతంగా అంగరంగ వైభవంగా జరిగింది. వేదపండితులు సునీల్‌శర్మ బృందంచే శాస్త్రోక్తంగా కల్యాణమహోత్సవం కన్నుల పండువగా సాగింది. వేద పండితుల మంత్రోచ్చారణలతో, మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో వివాహ వేడుకలు కమనీయంగా నిర్వహించారు. సాధారణంగా వినాయకుని కల్యాణం చిత్తూరు జిల్లా కానిపాకంలో మాత్రమే చేస్తారని అనంతపురం జిల్లాలో ఒక్క హిందూపురంలో మాత్రమే ఈ వేడుకలు చేపడుతున్నట్లు అర్చకులు సునీల్ తెలిపారు. దీంతో ఈ వేడుకలు తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సిద్ధి, బుద్ధి శ్రీ పార్వతీ తనయునికి పూలు నగలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా వల్లభ మహాగణపతిని సర్వాంగ సుందరంగా ఏర్పాటు చేసి గరుడవాహనంపై అదిరోహించి స్వామివారు భక్తులకు కనువిందు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం, వినియోగించారు.

గోవుల తరలింపును అడ్డుకున్న శివసేన నాయకులు

లేపాక్షి: మండల పరిధిలోని లాలేపల్లి గ్రామం పొలిమేరల్లో కొంతమంది రైతుల వద్ద నుంచి దళారులు 33ఎద్దులు, 8ఆవులను కొనుగోలుచేసి కోబేలాలకు తరలించడానికి సిద్ధం చేశారు. ఈ విషయం శివసేన జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌కు సమాచారం ఇవ్వగా అక్కడికి చేరుకున్న ఆయన పశువుల తరలింపును అడ్డుకున్నారు. ప్రస్తుతం గోవధ నిషేధమని అలా చేస్తే వారిని కఠినంగా శిక్షిస్తారని విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీధర్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అలాగే దళారులకు ఇకమీదట ఆవులను కబేళాలలకు తరలిస్తే శిక్షలు కఠినం గా ఉంటాయని హెచ్చరించారు. అనంతరం రైతులతో మాట్లాడి ఎవరెవరి పశువులను వా రికి ఎస్ఐ ఆధ్వర్యంలో అప్పగించేశారు.

'మిశ్రమ పంట సాగుతో వ్యవసాయం లాభసాటి'



పంటలను పరిశీలిస్తున్న విజయకుమార్

చిలమత్తూరు : మిశ్రమ పంటలు సాగు చేసి వ్యవ సా యాన్ని లాభసాటి గా మార్చు కోవాలని వ్యవసాయశాఖ రాష్ట్ర సలహాదారుడు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని ఆరుమాకులపల్లి, టేకులోడు గ్రా మాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. సేం ద్రియ పద్ధతిలో సాగుచేసిన ఆర్కుల, మామిడి పంటలను పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. రైతులు వేరుశనగతోపాటు అంతర్‌పంటగా కం ది, జొన్న, అలసంద, తదితర పదిరకాల పంటలు సాగుచేసుకోవాలన్నారు. దానివల్ల రైతుకు ప్రతినెలా ఆదాయం చేతికందే అవకాశం ఉంటుందన్నారు. రైతులు సేంద్రియ పద్ధతులు అవలంబించడం వల్ల సాగు వ్యయం గణనీయంగా తగ్గడంతోపాటు దిగుబడి బాగా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్య వసాయశాఖ జేడీ శ్రీరామమూర్తి, ఏడీఏలు రవి, లక్ష్మీనాయక్, ఏఓలు, రైతులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

తనకల్లు: మండల కేంద్రమైన తనకల్లులో ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ నెల 30వ తేదిన పుట్టపర్తిలో హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గానికి తాగునీరు, సాగునీరు అందించే విషయంపై రాజకీయాలకు అతీతంగా జరుగు సమావేశానికి ప్రతి ఒక్కరు హాజరు కావాలని కోరుతూ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, రైతు సంఘం మండల కన్వీనర్ రెడ్డెప్ప, రైతు సంఘం మండల అధ్యక్షుడు చౌడప్ప, శ్రీనివాసులు, పెద్దరంగప్ప, చంద్రయ్య, రెడ్డెప్ప, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనం


నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్తున్న గణనాథులు

కదిరిరూరల్: మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో 49 వినాయక విగ్రహాలు వినాయక చవితి పండుగ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఆదివారం ఘనంగా నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి పంచాయతీలో 13 గణేష్ విగ్రహాలు, మొటుకుపల్లిలో 6 గణేష్ విగ్రహాలు, బూరుగుపల్లిలో 4 వినాయక విగ్రహాలు, ముత్యాల చెరువులో 6 వినాయక విగ్రహాలు, కే బ్రాహ్మణపల్లిలో 4, ఎగువపల్లిలో 3, కొండమనాయునిపాలెంలో 3, కాళసముద్రంలో 3, పట్నం 3, ఎర్రదొడ్డిలో 2, కుంట్లపల్లి, చలమకుంట్లపల్లిలో 2 వినాయక విగ్రహాలను ఆయా పంచాయతీల సమీపంలోని కుంటలు, చెరువుల్లో నిమజ్జనానికి తరలించారు. కుమ్మరవాండ్లపల్లిలో వినాయక విగ్రహాలను ముస్కిన్ కుంటలో మొటుకుపల్లి పంచాయతీ మూడుముద్దల కుంటలో నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. రూరల్ ఎస్ఐ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు బీ లక్ష్మీదేవీ, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి గంగులప్ప, బీసీ సెల్ అధ్యక్షుడు ఊరాతి చంద్ర, అంజి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినాయక లడ్డు వేలం: కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి కేవీపీ గణేష్ విగ్రహం వద్ద శనివారం రాత్రి లడ్డు వేలం పాట నిర్వహించారు. ఈ వేలంపాటలో కుమ్మరవాండ్లపల్లికి చెందిన టీడీపీ నాయకులు గంగులప్ప, రమేష్ రూ. 32,000లకు లడ్డును దక్కించుకున్నారు. అనంతరం భక్తులకు లడ్డ ప్రసాదాన్ని పంచి పెట్టారు.

తలుపులలో.. తలుపుల బలిజిపేట శ్రీరామదేవాలయం వద్ద ఏర్పాటు చేసిన 16 అడుగుల వినాయక విగ్రహాన్ని ఆదివారం మధ్యాహ్నం జేసీబీ సహాయంతో ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లులో వినాయక విగ్రహాన్ని చిరక్కమ్మ కుంటలో నిమజ్జనం చేశారు. కుమ్మరపేట, ఎగువపేట, తహసీల్దార్ కార్యాలయం వద్ద, కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాలను తుమ్మాకులకుంట, ఎర్రచెరువులలో నిమజ్జనం గావించారు.

వినాయక లడ్డు వేలం: మండలంలోని తూపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక లడ్డూ శనివారం రాత్రి నిర్వాహకులు వేలం నిర్వహించారు. తూపల్లి గ్రామానికి చెందిన అన్నదమ్ములు అమర్‌నాథ్ రెడ్డి , రామచంద్రారెడ్డి రూ. 86,500లకు వేలం పాటలో వినాయక లడ్డును దక్కించుకున్నారు.

గాండ్లపెంటలో.. వినాయక చవితి పండుగ సందర్భంగా మండల వ్యాప్తంగా 20 గణనాథులను ఏర్పాటు చేసుకొన్నారు. ఆదివారం నిమజ్జనానికి తరలించారు. ఎస్ఐ హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వినాయక లడ్డు వేలం: మండలంలోని రెక్కమాను గ్రామంలో ఏర్పాటు చేసిన వినయక లడ్డును ఉదయ్ శంకర్ రూ. 3,600లు పాట పాడి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సూర్యశేఖర్, ఈశ్వరమ్మ, డాక్టర్ ఖాజా, సురేష్, భక్తులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట: మండల కేంద్రంలోని కొత్తపేట బజారు, పోలీసుస్టేషన్, ఇందిరా కాలనీ, అంబేద్కర్ నగర్, ఎన్ రెడ్డివారిపల్లి, పీ కొత్తపల్లి, ఫెడబల్లి, ధనియానిచెరువు గ్రామాల్లో కొలువు తీరిన గణనాథులను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. కడప జిల్లా వెలిగల్లు జలాశయంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎస్ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కొత్తపేట బజారులో వినాయక లడ్డును రూ. 3,900లకు మనోహర్‌నాయుడు సొంతం చేసుకున్నారు.

తనకల్లు: మండలంలోని వివిధ గ్రామాలతో పాటు మండల కేంద్రమైన తనకల్లులో కొలువైన గణపయ్యలను ఆదివారం నిమజ్జనం చేయడానికి మండల పరిధిలోని సీజీ ప్రాజెక్టులో ఏర్పాట్లను ఎస్ఐ శ్రీనివాసులు , ఏఎస్ఐ బాలరాజులు పరిశీలించారు. ప్రత్యేకించి పోలీసు సిబ్బందితో పాటు 15 మంది స్వచ్ఛందంగా నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనడానికి వాలెంటీర్లను నియమించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రమైన తనకల్లు నుండి పలు విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్ళాయి.


తలుపులలో నిమజ్జనం చేస్తున్న దృశ్యం


లంబాడీలు నృత్యంలో పాల్గొన్న కుమ్మరవాండ్లపల్లి సర్పంచు

సెల్‌ఫోన్లు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

గాండ్లపెంట: మండలంలోని రెక్కమాను గ్రామంలో మల్లికార్జున సెల్‌ఫోన్‌లను తక్కువ ధరలకు విక్రయిస్తుండగా గాండ్లపెంట పోలీసులు అతనిపై ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ మల్లికార్జునకు బెంగుళూరుకు చెందిన కొందరు వ్యక్తులు సెల్‌ఫోన్‌లు తక్కువ ధరలకు అమ్మమని చెప్పారని, అందువల్ల అతను వాటిని తక్కువ ధరలకు విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు.

ఆర్టీసీలో పదవీ విరమణ ఉద్యోగుల మొత్తము మంజూరు

కదిరిఅర్బన్: ఆర్టీసీ ఉద్యోగులకు క్రెడిట్ కోఆపరేటివ్ సంస్థ నుంచి పదవీ విరమణ మొత్తము మంజూరు అయినట్లు కదిరి ఆర్టీసీ డిపో ఆఫీస్ సూపరింటెండెంట్ మోకా హరిమోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. 01-07-2017 నాటికి 59 సంవత్సరాలు నిండి, సీసీఎస్‌లో సభ్యత్వం కల్గిన కదిరి డిపో రిటైర్డ్ ఉద్యోగులు 179 మందికి, ఒకొక్కరికి సగటున రూ. 1350 ప్రకారం, రూ. 2,41,650లను వారి బ్యాంక్ అకౌంట్‌లకు జమ చేసినట్లు సీసీఎస్ కార్యదర్శి రాఘవరెడ్డి తెలిపారన్నారు. దశల వారిగా బ్యాంక్ అకౌంట్‌లలో జమ అవుతాయని, ఒకవేళ ఎవరికైనా జమ కాకపోతే సీసీఎస్‌లో ఏర్పాటు చేసిన సెల్ నెంబర్ 7382924399కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. తమ సర్వీసు కాలంలో ప్రతి సంవత్సరంనకు రూ.45 ప్రకారం ఈ మొత్తం మంజూరు అవుతుందని, కనీసం రూ. 100లకు అయినా పెంచాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినట్లు తెలిపారు.

వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన

గాండ్లపెంట: ద్విచక్ర వాహన దారులు రోడ్డు నిబంధనలపై కదిరి రూరల్ సీఐ శ్రీధర్ అవగాహన కల్పించారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహన దాంగలు డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, రికార్డులు తప్పని సరిగా ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనంలో ఇద్దరు కంటే ఎక్కువగా ప్రయాణించకూడదన్నారు. వాహనాలు నడిపేటప్పుడు వేగాన్ని తగ్గించి, జాగ్రత్తలు పాటించాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హరినాథ్‌రెడ్డి, పోలీసులు, వాహన డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

కస్టమర్లకు మెరుగైన సేవలు అందించాలి..: డీఎం


హమాలీలకు సూచనలిస్తున్న డీఎం

కదిరిఅర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం నుంచి ఆర్టీసీ పార్శిల్, కొరియర్ సేవలను అందిస్తోందని ప్రయాణికులకు, వ్యాపారులకు, కస్టమర్లకు మెరుగైన సేవలు అందించాలని డిపో మేనేజర్ సూర్యనారాయణ హమాలీలకు సూచించారు. డిపో కార్యాలయంలో హమాలీలతో ఆయన సమావేశమయ్యారు. గతంలో ఏఎన్‌ఎల్ సంస్థ వారే పార్శిల్ సర్వీసులను నిర్వహించేవారని, ఆదివారం నుంచి ఆర్టీసీనే నిర్వహిస్తుందని హమాలీలు సహకరించి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. హమాలీలు డ్రస్‌కోడ్ పాటించాలని, ప్రయాణికుల లగేజీలను జాగ్రత్తగా దించాలని, ఒక వేళ లగేజీ డ్యామేజీ అయితే వాటి విలువను హమాలీల నుంచి రాబట్టుకుంటామన్నారు. ఈ సందర్భంగా హమాలీల నాయకుడు అల్లాబకష్ గతంలో ఏఎన్‌ఎల్ వారు ఇచ్చే కమీషన్ తక్కువగా ఉందని అది ఏమాత్రం సరిపోవడం లేదని పెంచాలని డీఎం దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ మోకా హరిమోహన్, అసిస్టెంట్ మేనేజర్ హంపన్న తదితరులు పాల్గొన్నారు.

లోకల్ గైడ్

కదిరి మార్కెట్‌లో కూరగాయల ధరలు



వంకాయ కిలో రూ.22, టమోటా 45, బెండ 30, బీరకాయ 30, కాకరకాయ 40, క్యారెట్ 60, బీట్‌రూట్ 60, బీన్స్ 65, ముల్లంగి 40, పచ్చిమిర్చి 30, ఉర్లగడ్డ 22, కోసుగడ్డ 30, మునగ 50, కాప్సికమ్ 60, ఉల్లిపాయలు 40

కదిరి సినిమాలు

సంగం - వివేకం, **రాధిక** - వీఐపీ-2
,**వేమల** - అర్జున్‌రెడ్డి , **మౌనిక -** జయ జానకి నాయక

ఎమ్మెల్యే డైరీ

సోమవారం ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాష నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉండరు.

పేదలకు చీరల పంపిణీ

నంబులపూలకుంట: మండల కేంద్రంలో మాజీ సర్పంచు వెంకటరమణమ్మ, సాంబశివారెడ్డి దంపతులు నల్లగంగమ్మ ఆలయ సమీపంలో ఆదివారం పేదలకు చీరలు పంపిణీ చేశారు. వారి కుమారుడు సాయిరాంరెడ్డి జయంతి వేడుకలలో భాగంగా చీరలు పంపిణీ చేస్తున్నారు. కుమారుడి జ్ఞాపకార్థం ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నిరసన దీక్షను జయప్రదం చేయండి..: ఎస్టీయూ

కదిరిఅర్బన్: సీపీఎస్ రద్దు చేయాలనే డిమాండ్‌తో ఎస్టీయూ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టే నిరసన దీక్షను జయప్రదం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవిందునాయుడు, నాయకులు దొడ్డం రవి, రామమోహన్, గంగాధర్‌రెడ్డి, జవహార్, హరినాయక్, శంకర్‌నాయక్, సుబహాన్, షౌకత్, దివాకర్ తదితరులు పిలుపు నిచ్చారు. జిల్లాలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొని నిరసన దీక్షను జయప్రదం చేయాలని కోరారు.

నేటి నుంచి ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ

తలుపుల: మండలంలోని రైతులకు నూరు శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు అయిన ఉలవలు, అలసందలు, కొర్రలను సోమవారం నుంచి వ్యవసాయ కార్యాలయం వద్ద పంపిణీ చేయనున్నట్లు ఏఈఓ నయాజ్ తెలిపారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ నెంబర్ తీసుకువచ్చి, ప్రత్యామ్నాయ విత్తనాలను పొందవచ్చన్నారు.

ఉత్సాహంగా క్రికెట్‌లీగ్ పోటీలు

కదిరిఅర్బన్: ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ కదిరి క్రికెట్ లీగ్ 2017-18లో భాగంగా ఆదివారం స్థానిక ఎస్‌టీఎస్‌ఎన్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన పోటీలలో కోచింగ్ సీనియర్ జట్టు తన విజయం పరంపరను కొనసాగించింది. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సీనియర్స్ జట్టు కెప్టెన్ అనీల్ 83 పరుగులు, ఇర్ఫాన్ 30 పరుగులతో రాణించడంతో నిర్ణీత 25 ఓవర్లలో 165 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన జూనియర్స్ జట్టు 25 ఓవర్లలో 130 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది.

కంచె తొలగింపు

నంబులపూలకుంట: మండలంలోని యర్రవంకలవారిపల్లిలో దళిత కాలనీ సమీపంలో ఉన్న వివాదాస్పద స్థలానికి ఏర్పాటు చేసిన కంచెను ఆదివారం ఎస్ఐ రమేష్‌బాబు తొలగింప చేశారు. తహసీల్దార్ నాగరాజు ఆదేశాల మేరకు ప్రభుత్వ స్థలంలో వేసిన రైతులకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బందితో తరలివెళ్ళి కంచెను తొలగించారు. అయితే ఈ భూములను నమ్ముకుని చాలా సంవత్సరాలుగా పంటలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నామని, లేని పోని అనర్థాలతో గ్రామాల్లో సమస్యలు పునరావృతం అవుతున్నాయని, కంచె తొలగించేందుకు గడవు ఇవ్వాలని ఎస్ఐను గ్రామస్థులు కోరారు. అనంతరం గ్రామస్థులు రెండు రోజులు గడువు కోరడంతో త్వరితగతిన సమస్యను పరిష్కరించుకోవాలని ఎస్ఐ వారికి సూచించారు.

నిబంధనల ప్రకారం నిమజ్జనం చేయాలి: ఎస్ఐ

కదిరిరూరల్: కదిరి రూరల్ పరిధిలోని పట్నం పంచాయతీ వీరేపల్లి పేటలో వినాయక విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేయకపోవడంతో పట్నం ఎస్ఐ రాఘవ ఎందుకు చేయలేదని నిర్వాహకులను ప్రశ్నించారు. ఈవిషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఐ శ్రీనివాసులు వీరేపల్లి పేటకు వెళ్ళి గ్రా మస్థులతో మాట్లాడి, సోమవారం నిమజ్జనం చేయాలని గ్రామస్థులకు సూచించారు.

హెంజేరు సిద్దేశ్వరస్వామికి విశేష పూజలు

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్దేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేషపూజలు నిర్వహించారు. స్వామి వారిని వివిధ పూలతో విశేషంగా అలంకరించి అభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, ఆకుపూజ అలంకరణ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమానికి మండలం నుంచే కాక సమీప కర్ణాటకలోని వివిద గ్రామాల నుంచి కూడా వందలాది మంది భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రత్యామ్నాయ విత్తనాలను తీసుకెళ్లండి

అమరాపురం: ఇంత వరకు వేరుశనగ సాగుచేయని రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు తీసుకువచ్చి స్థానిక ఏఓ కార్యాలయంలో ప్రత్యామ్నా విత్తనాలైన ఉలవ, మొక్కజొన్న, అలసంద వంటి విత్తనాలను తీసుకువెళ్లాలని ఏఓ శేకన్న ఆదివారం తెలిపారు. 28న నిడ్రగట్టు, కే.శివరం, 29న హలుకూరు, హేమావతి, 30న బసవనపల్లి, వలస, 31న అమరాపురం, తమ్మడేపల్లి గ్రామాలలోని రైతులు ప్రత్యా మ్నాయ విత్తనాలు తీసుకువెళ్లాలని కోరారు.

మడకశిరలో ఓ మోస్తరు వర్షం

మడకశిర అర్బన్: మడకశిరలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షం రాకతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేశారు. ముందస్తు సాగుచేసిన వేరుశనగ పంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం పిందెలు, కాయలు కాశాయని, ఈ వర్షానికి కాయలు బలిసి పూర్తి పంట చేతికందే ఆస్కారముంటుందని పలువురు రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి


స్పీడ్ బ్రేకర్ వేయిస్తున్న ఎస్ఐ నాగన్న

రొళ్ల: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఎస్ఐ నాగన్న ఆధ్వర్యంలో వాహనాలు వేగంగా వెళ్లే కూడళ్లు, ప్రదాన రహదారులు, పాఠశాలల సమీపాలలో స్పీడ్‌బ్రేకర్లు వేయిస్తున్నారు. దీంతో వాహనాల వేగం నియంత్రించి ప్రమాదాల నుం చి కొంత మేరా కాపాడవచ్చని ఎస్ఐ తెలిపారు.

జో కుమారుడికి ఇంటింటా పూజలు


పూజలు నిర్వహిస్తున్న మహిళలు

అమరాపురం: వినాయక చవితిని పురస్కరించుకుని పా ర్వతి తనయుడు జోకుమారునికి ఇంటింటా విశేషపూజలు నిర్వహించారు. పూర్వపు ఆచారం ప్రకారం మండల కేంద్రానికి చెందిన బెస్తరకులస్థులు జోకుమారుని బుట్టలో ఉంచి వివిధ పూలతో అలంకరించి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి బియ్యం, బేడలు వంటి వాటిని సేకరించారు. బెస్తరకులస్థులైన హనుమక్క, మూర్కణప్ప, గంగమ్మ, నటరాజప్ప, జయరామప్పలు వర్షాలు కురిసి, పంటలు బాగా పండి ప్రజలు సుఃఖశాంతుల తో ఉండాలనే ఉద్దేశంతో వినాయకచవితి సందర్భంగా జోకుమారునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా వినాయక నిమజ్జనం


ప్రత్యేక అలంకరణలో భవాని గణపతి , నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు

మడకశిర అర్బన్: పట్టణంలోని స్టేట్ బ్యాంక్ సమీపంలో రూకులకుంటలో విద్యార్థులు ఏర్పాటుచేసిన వినాయకుని నిమజ్జనం కార్యక్రమం ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఊరేగింపు అనంతరం పట్టణ సమీపంలోని బావిలో నిమజ్జనం చేశారు. అదేవిధంగా ఆదిరెడ్డిపాళ్యంలో వెలసిన వినాయకుడిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు అనంతరం నిమజ్జన చేపట్టారు. పట్టణంలోని వాల్మీకి సర్కిల్, అమరాపురం బస్టాండు వడిసలమ్మదేవి ఆలయం వద్ద వెలసిన భవాని గణపతికి యువకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పావగడ: తాలూకా వ్యాప్తంగా గణేషుని నిమజ్జనం ఆదివారం సంబరంగా జరిగింది. మూడవ రోజు ఆదివారం డప్పు వాయిధ్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. తాలూకాలోని మీనకుంటపల్లి గ్రామంలో ఆదివారం గణేషుని నిమజ్జనం ఎంతో ఉత్సాహంగా జరిగింది

అమరాపురంలో: చవితిని పురస్కరించుకుని మూడవ రోజు పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో వినాకుడిని ఊరేగించి నిమజ్జనం గావించారు.

గుడిబండ: మండలంలోని ఎస్.రాయాపురం, దిన్నేహట్టి, మందలపల్లి, పీసీగిరి తదితర గ్రామాలలో ఆదివారం ఘనం గా వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. వినా యక విగ్రహాలను ఆయా గ్రామాల్లో మేళతాళాలతో ఊరేగించారు. భక్తిశ్రద్దలతోపూజలు నిర్వహించి అనంతరం నిమజ్జనం చేశారు.

రొళ్ల: మండల పరిధిలోని హెచ్‌టీహళ్లి గ్రామంలో ఆదివారం వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు ఆదివారం నిమజ్జన కార్యక్రమం చేపట్టారు.

అందని ప్రత్యామ్నాయ విత్తనాలు

- తడి ఆరిపోతోందంటున్నరైతన్నలు - 20వేల హెక్టార్లలోసాగవని పంటలు

మడకశిర: తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణ ంగా ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగుచేయని రైతులు ప్రత్యామ్నాయ పంటల విత్తనాల కోసం కార్యాలయాల చుట్టు తిరుగుతూ పడిగాపులు కాస్తున్నారు. ఓ మోస్తరు తుంపర్లు పడుతున్నాయి. కనీసం ప్రత్యామ్నాయ విత్తనాలు వేసుకుందామనుకున్నా అధికారులు వాటిని పంపిణీ చేయడంలో జాప్యం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ విత్తనాల కోసం గ్రామాల నుంచి విత్తనాల కోసం వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద పడిగాపులు కాశారు. నియోజకవర్గంలో ప్రతి యేడు ఖరీఫ్‌లో 54వేల హెక్టార్లలో వేరుశనగ పంట సాగుచేయాల్సి ఉంది. అయితే ఈ యేడు వర్షాభావం కారణంగా 20వేల హెక్టార్లలో వేరుశనగ పంట సాగుచేయలేదు. నియోజకవర్గంలో రొళ్ల, అమరాపురం, మడకశిర గుడిబండ మండలాలకు వంద క్వింటాళ్ల ఉలవ, వంద క్వింటాళ్ల పెసర రావడం జరిగింది. అగళి మండలానికి విత్తనాలు సరఫరాకావాల్సిఉంది. వందశాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేస్తామని చెప్పడంతో రైతులు విత్తనాల కోసం కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు. అయితే ఇంత వరకు విత్తనాలు మాత్రం పంపిణీ చేయలేదు. పలువురు రైతులుమాట్లాడుతూ వేరుశనగ పంట సాగుచేయలేకపోయామని, కనీసం ఉలవ, పెసర సాగు చేద్దామంటే సకాలంలోవిత్తనాలు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు పంపిణీ చేస్తే పంటలు సాగుచేస్తామన్నారు.

నేటి నుంచి అన్ని మండల కేంద్రాల్లో విత్తనాల పంపిణీ : వ్యవసాయశాఖ ఏడీ

సోమవారం నుంచి అన్ని మండల కేంద్రాలలో ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించి ఉలవలు, అలసంద అన్ని మండల కేంద్రాలలో పంపిణీ చేసేందుకు వంద క్వింటాళ్ల చొప్పున విత్తనాలు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

హరించుకుపోతున్న పచ్చదనం

- యథేచ్ఛగా రంపపు కేంద్రాలకు తరలుతున్న కలప - పట్టించుకోని అధికారులు



రొళ్ల: కర్ణాటక సా మిల్లుకు మండలం నుంచి కలప అక్రమంగా తరలుతోంది. అయితే సంబంధిత శాఖాధికారులు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నా రు. కరువును ఆసరగా చేసుకుని వ్యాపారులు రైతుల వద్దకు దళారుల సహకారంతో వచ్చి వారిని నమ్మించి పొలాల్లో ఎన్నో ఏళ్లుగా పెంచుకున్న చెట్లను అతి తక్కువ ధరలకు కొనుగోలు చే స్తు న్నారు. రైతులతో పాటు వాగులు, వంకలు, అటవీ ప్రాంతం, చెరువులలో యథేచ్ఛగా కలపను నరికి సా మిల్లుకు తరలించి సొ మ్ముచేసుకుంట్టున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖాధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. సంబందిత అధికారులు స్పందించి చెట్లను నరికి కలపను షామిళ్లకు తరలించే దళారులు, వ్యాపారులపై గట్టి నిఘా ఉంచి పచ్చదనాన్ని సంరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.


కర్ణాటకకు తరలుతున్న కలప

అక్రమంగా కలప తలిస్తే చర్యలు : అటవీశాధికారి చంద్రమౌళి

పచ్చని చెట్లను నరికి కలపను తలించే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు అటవీశాఖాధికారి చంద్రమౌళి తెలిపారు. చెట్లు నరకుతూ పట్టుబడితే జరిమాన విధించనున్నట్లు తెలిపారు. అడవులను సంరక్షించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

రూ.25 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

మడకశిర టౌన్: పట్టణంలో ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్‌కింద రూ.25 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పనులు చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ శరణ్యసుబ్బరాయుడు, టీడీపీ పట్టణాధ్యక్షులు మనోహర్ తదితర పనులను ప్రారంభించారు. ఆదివారం కొత్తగా ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ కింద నాలుగు సీసీ రోడ్లు మంజూరయ్యాయి. దీంతో పనులను ప్రారంభించారు. డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచు మాదవరాజు, కౌన్సిరల్ జేఎస్ నాగరాజు తదితరులు ఉన్నారు.

తెగిపోయిన చెక్‌డ్యాంలు


జమ్మానుపల్లి, తురకవాండ్లపల్లి వద్ద తెగిన చెక్‌డ్యాం

మడకశిర రూరల్: ప్రతి వర్షపు చుక్క వడిసి పట్టి భూగర్భ జలాలు పెంపొందించేందుకు కోట్లాదిరూపాయలు ఖర్చుచేస్తోంది. అయితే పడిన వర్షపునీరంతా తెగిన చెక్‌డ్యాంల గుండా వృథాగా పోతోంది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో జమ్మానుపల్లి, తురకవాండ్లపల్లి, కల్లుమర్రి, గంతలపల్లి, మణూరు, హరేసముద్రం గ్రామాల్లో నిర్మించిన చెక్‌డ్యాంలు భారీ వర్షాలకు గతంలో తెగిపోయాయి. అయితే ప్రస్తుతం అరకొరగా కురుస్తున్న వర్షపు నీరు కూడా వృథాగా వెళ్తోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ఆయా ప్రాంత రైతులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

మడకశిర రూరల్: మండల పరిధిలోని హరేసముద్రం పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఆదివారం గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానో పాధ్యాయురాలు ప్రమీళ,ఉపాధ్యా యులు చలపతి, జాన్‌ప్రకాష్, ప్రసాద్,రామిరెడ్డి, రామన్న, రమేష్, పీఈటీలు ఇతర ప్రాంతాల పాఠశా లలకు బదిలీ అయ్యారు. కొత్తగా జాయిన్ అయిన ఉపాధ్యా యులు, గ్రామస్థులు వారిని ఘనంగా పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం


విజేత జట్టుకు బహుమతిని అందజేస్తున్న జడ్పీటీసీ పాండురంగప్ప

రొళ్ల: మండలంలోని హులీకుంట గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహించినక్రికెట్ టోర్నమెంటులో విజేతలకు ఆదివారం బహుమతులుప్రదానంచేశారు. హులీకుంట గ్రామానికి చెందిన బీ టీం రన్నర్‌గా నిలవడంతో పీసీగిరి గ్రా మానికి చెందిన జట్టు విన్నర్‌గా నిలిచింది. ముఖ్య అతిథు లు గా విచ్చేసిన జడ్పీటీసీ వీఎం పాండురంగప్ప, వైసీపీ సీని యర్ నాయకుడు అనంతరాజులు మొదటి బహుమతిని రూ.10వేలు, రెండవ బహుమతి రూ.5వేల చొప్పున పంపిణీ చేశారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు బహుమతులు ఎంతో తోడ్పడతాయన్నారు.

చెరువులో బయటపడ్డ వినాయక రాతి విగ్రహం



పెనుకొండ : వినాయక నిమజ్జన కార్యక్రమంలో భాగంగా పీఓపీ విగ్రహాలను నిమజ్జనం చేయడానికి స్థానిక టీడీపీ మహిళా నాయకురాలు సవితమ్మ సౌజన్యంతో ఎక్సాకవేటర్ సాయంతో గుంతలు తవ్వించారు. ఈ సందర్భంగా రాయల కాలంనాటి అతి ప్రాచీనమైన వినాయక రాతివిగ్రహం బయటపడింది. బయటపడ్డ ఈ విగ్రహాన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు.





నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్తున్న విగ్రహాలు - బోగసముద్రం చెరువులో నిమజ్జనం చేస్తున్న విగ్రహాలు - నిమజ్జనానికి తరలివచ్చిన ప్రజలు

ఘనంగా గణేష్ నిమజ్జనం





గోరంట్ల, రొద్దం,ఆర్ లోచర్ల గ్రామాల్లో వినాయకుల ఊరేగింపు , నిమజ్జనానికి బయలుదేరి వినాయక విగ్రహాలు

పెనుకొండ: వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని వివిధ కూడళ్లలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను మూడు రోజులుగా యువకులు నిర్వహించి ఆదివారం వాటిని ఘనంగా నిమజ్జనోత్సవం నిర్వహించారు. తోటగెరి, ఎగువగడ్డ, శివసా యి మందిరం, బీటీఆర్, ఆల్విన్, తదితర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన విగ్రహాలతోపాటు గృహాల్లో ఏర్పాటుచేసిన విగ్రహా లను ట్రాక్టర్లపై, ఆటోలపై, ఎద్దులబండ్లపై తప్పట్లు, బ్యాం డ్ మేళాలు, బాణసంచా పేల్చుతూ పురవీధుల్లో ఊరేగింపుగా బోగసముద్రం చెరువుకు చేర్చారు. అక్కడ పురోహితుల మంత్రో చ్చారణల న డుమ విగ్రహాలను నీళ్లలో నిమజ్జనం చేశారు. వేలాది మంది ప్రజలు చెరువువద్దకు తరలి వచ్చారు. ఎస్ఐ జనార్దన్ భారీ బందోబస్తునిర్వహించారు.

టౌన్‌లో గణేశ నిమజ్జనం సందర్భంగా డీఎస్పీ కరీముల్లాష రీఫ్, సీఐ వెంకటేశులు ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

పెనుకొండ రూరల్ : వినాయక చవితి పండగ పురస్క రించుకుని మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మం డలంలోని కోనాపురం, గుట్టూరు, ఇస్లాపురం, తదితర గ్రామాల్లో ఏర్పాటుచేసిన వినాయక ప్రతిమలను గ్రామాల్లో ఊరేగించి చెరువుల్లో నిమజ్జనం చేశారు.

రొద్దం : మండలంలోని ఆదివారం గణేష్ నిమజ్జనం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక బస్టాండు ఆవరణంలో ఏర్పాటు చేసిన 13అడుగుల గణపతి విగ్రహానికి పూజలు నిర్వహించి ట్రాక్టర్‌లో అలంకరించారు. పోలేపల్లి వీధి, న్యూ ఎస్సీకాలనీ, పాత ఎస్సీకాలనీ, కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో ఏర్పాటు చేసిన గణపతులను గ్రామంలో వరుసగా ఊరేగింపు నిర్వహించారు. ఆర్‌లోచర్ల గ్రామంలో ఎస్సీ కాలనీలో 2, బీసీ కాలనీ, ఆర్ కొట్టాల, చెక్‌పోస్టు, సుబ్బరాయప్పకొట్టాల, మరువపల్లి గ్రామాల్లో ఏర్పాటుచేసిన విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. ఎస్ఐ మునీర్‌అహ్మద్, సిబ్బంది గ్రామాల్లో తిరిగి బందోస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ విగ్రహ కమిటీ సభ్యులు, యువకులు, గ్రామస్థులు, మహిళలు నిమజ్జనానికి తరలి వెళ్లారు.

గోరంట్ల రూరల్ : మండల వ్యాప్తంగా వినాయక నిమజ్జన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గోరంట్లతోపాటు కరావులపల్లి, మందలపల్లి, పాలసముద్రం, బూదిలి, తదితర గ్రామాల్లోని 20వినాయక వ్రిగహాలను భారీ ఊరేగింపుతో నిమజ్జనం చేశారు. పాలసముద్రం గ్రేట్‌వే వద్ద వినాయక చవితి సంద ర్భంగా బాలముడి వినాయకుడి ఆలయంలో సోమవారం భక్త చింతామణి హాస్యనాటిక నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సోమందేపల్లి : మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. గ రెండు రోజులుగా ప్రత్యేక పూజలు అందించి వినాయకులను నిమజ్జనం చేశారు. 70కిపైగా వినాయక విగ్రహాలను పాపిరెడ్డిపల్లి చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా నిమజ్జనానికి తరలిస్తున్న విగ్రహాలను దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. ధనలక్ష్మీరోడ్డులో వినాయక నిమజ్జనంలో ఉపసర్పంచ్ డీసీ ఈశ్వరయ్య ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో భారీ భద్రత ఏర్పాటు చేశారు.

గ్రామానికి డ్రమ్స్ వితరణ



డ్రమ్స్ అందజేస్తున్న రామచంద్ర

పెనుకొండ టౌన్ : మండలంలోని అమ్మవారిపల్లి గ్రామానికి అదే గ్రామానికి చెందిన దాత రియల్‌ఎస్టేట్ వ్యాపారి రామచంద్ర ఆదివారం డ్రమ్స్ వితరణగా అందించారు. వినాయక చవితి నిమ జ్జనానికి పురస్కరించుకుని, అలాగే గ్రామంలో ప్రతియేటా ఆల యాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఈ దశలో నాలుగు రకా ల డ్రమ్స్‌ను రూ.10వేలు వెచ్చించి ఇవ్వడం జరిగిందన్నారు. ప్రముఖ జ్యోతిష్యులు నారాయణప్ప, రవూఫ్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలి

పెనుకొండ : నంబులపూలకుంట మండలం ఎర్రవంకవారిపల్లి గ్రామంలో దళిత కాలనీలో గంగమ్మగుడి ధ్వంసం చేయడం, ఈ విషయంపై నిజానిజాలు తెలుసుకోవడానికి వెళ్లిన నిజనిర్దారణ కమిటీ సభ్యుడు నాగిరెడ్డిపై అధికార పార్టీ నాయకుడు దాడి చేయడం అమానుషమని దాడిచేసిన వారిపై కేసు నమోదుచేసి వెంటనే అరెస్ట్‌చేయాలని సీపీఎం పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హరి, పెద్దన్న విలేకరులతో మాట్లాడుతూ గంగ మ్మ గుడి ధ్వంసం చేయడంతో దళితులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపటార న్నారు. ఇందులో నిజానిజాలు తెలుసు కోవడానికి గ్రామానికి వెళ్లిన నిజ నిర్ధారణ కమిటీ గ్రామంలో పర్య టించి వెనుతిరిగి వస్తుండగా గ్రామంలోని అధికార పార్టీకి చెందిన వారు నాగిరెడ్డిపై దాడిచేయడం అమానుషమన్నారు. దాడికి పాల్ప డిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

'నా సేవలను వినియోగించుకోండి'

పెనుకొండ : ప్రమాదాల్లో గాయపడి ప్రాణాపాయ స్థితిలోఉన్నవారికి సకాలంలో వైద్య సేవలు అందించి వారి ప్రాణాలను కాపాడాలనే ఉద్దేశ్యంతో పెనుకొండలో ట్రామాకేర్ సెంటర్ భవనాలు నిర్మించి అందుకోసం అత్యాధునిక పరికరాలతో కూడిన రూ.25లక్షలు విలువచేసే నన్ను కొనుగోలు చేశారు. కానీ నన్ను నడపడానికి డ్రైవర్, పరికరాలు వినియోగించడానికి టెక్నికల్ అసిస్టెంట్‌ను నియమించక పోవడంతో నాలుగేళ్లుగా నేను నిరుపయోగంగా పడి ఉండి తుప్పుపడుతున్నాను. ట్రామాకేర్ సెంటర్‌ను ఇంతవరకు ఎలాగో ప్రారంభించలేదు. కనీసం నన్ను ప్రభుత్వ ఆసుపత్రి ఉద్యోగులు ఉపయోగించుకునేలా డ్రైవర్‌ను, టెక్నికల్ అసిస్టెంట్‌ను నియమించి రోగులకు నా సేవలు అందేలా చూడాలని కోరుతున్నాను.

సదా మీ సేవలో మీ అంబులెన్స్, పెనుకొండ.



నిరుపయోగంగా పడిఉన్న అంబులెన్స్

నేడు ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ

రొద్దం: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ప్రత్యా మ్నాయ పంట విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏఓ సుబాకర్ తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకాల్లో సంతకాలు చేసిన వారికి మాత్రమే సోమవారం పంపిణీ చేస్తామన్నారు. మిగిలిన రైతులకు 29,30,31 తేదీల్లో పంపిణీ నిర్వహించనున్నామన్నారు. సోమవారం సంతకాలు లేని రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ విత్తనం ఇవ్వబడదన్నారు.

రేపు రుణమేళా..

గోరంట్ల రూరల్ : స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో లబ్దిదారుల ఎంపిక కోసం మంగళవారం రుణమేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆజాద్ తెలిపారు. గోరంట్ల మండలానికి 226రుణ యూనిట్లు మంజూరైనాయని కార్పొరేషన్‌లవారీగా ఎస్సీ 51, ఎస్టీ18, బీసీ 70, మైనార్టీ 27, కాపు 60యూనిట్లు కేటాయించారు. దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువకులు ధ్రు వీకరణ పత్రాలతో హాజరవ్వాల్సిందిగా కోరారు.

పెనుకొండలో : పెనుకొండ మండలంలో ఎస్సీ 50, ఎస్టీ 13, బీసీ 80, కాపు 80, ఫెడరేషన్ గ్రూపు 4, రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 29న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివశంకరప్ప తెలిపారు. ఉదయం 10గంటలకు ఎంపీడీఓ కార్యాల యం వద్ద ఎస్‌బిఐ, అనంత గ్రామీణబ్యాంక్, మధ్యాహ్నం ఎస్‌బి హెచ్, ఎస్‌బిఐ శెట్టిపల్లి, గుట్టూరు గ్రామీణ బ్యాంక్ పరిధిలో ఇంటర్వ్యూలు జరుపుతున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఆధార్, కులధృవీకరణ పత్రాలతోపాటు బ్యాంక్ పాసుపుస్తకం జిరాక్స్‌కాపీతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ

రొద్దం : పెద్దకోడిపల్లి గ్రామంలో చెరువు సమీపంలో వెలసిన అక్కమ్మగార్ల గుడి వద్ద ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. దాతలు బహూకరించిన వెండి విగ్రహాలను సాయంత్రం పెన్నా నదిలో గంగ పూజకు తరలించారు. పూజల అనంతరం గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారాయణ, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

గోరంట్ల రూరల్ : స్థానిక చౌడేశ్వరీ కాలనీ సమీపంలో మడికట్టులో పేకాట జూదమాడుతుండగా పోలీసులు దాడిచేసి ఆదివారం నలుగురిని అరెస్ట్‌చేశారు. 100కు స్థానిక ప్రజలు సమాచారం అందించడంతో అధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో దాడి జరిపి జూద రులను అరెస్ట్ చేశారు. రూ. 6900ల నగదును స్వాధీన పరుచుకుని రిమాండుకు పంపుతున్నట్లు తెలిపారు.

యోగాతో ప్రశాంతత

గోరంట్ల రూరల్ : యోగాశనం ద్వారా మనిషిలోని మానసిక ప్రశాంతత లభిస్తుందని అందువల్ల ప్రతి ఒక్కరూ సిద్ద సమాధి యోగా శిక్షణ తీసుకోవాలని గురూజీ డా.గిరిజా శ్రీనివాస్ పేర్కొన్నారు. గోరంట్లలో ని శ్రీసరస్వతి విద్యామందిరంలో ఆదివారం ఎస్ఎస్‌వైపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీధర్‌గురూజీ, ప్రిన్సిపాల్ భక్తవత్సలం పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లకు జియో ట్యాగింగ్ తప్పని సరి

ఓబుళదేవరచెరువు : నూతనంగా మంజూరు అయి, నిర్మిస్తున్న వ్యక్తి గత మరుగుదొడ్ల నిర్మాణాలకు జియో ట్యాగింగ్ తప్పని సరి అని ఎంపీడీఓ కావలి నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం మండల ంలోని సున్నంపల్లి, మహమ్మదాబాద్ క్రాస్, రామయ్యపేట, చౌడేపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పనులను ఆయన పరి శీలించారు. సాంకేతిక సహాయకులు మోహన్ బాబు, మేట్ల సంఘం అధ్యక్షుడు రెడ్డిపల్లి మహేష్‌రెడ్డి, క్షేత్ర సహా యకులు పీరా, నీలకంఠారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

పుట్టపర్తి : ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ,కిషన్ మైనార్టీల కార్పోరేషన్ ద్వారా అందించే సబ్సిడీరుణాలకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమీషనర్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. 30న బీసీ,కాపు కార్పొరేషన్ ద్వారా అందించే రుణాలకు ఇంటర్వ్యూలుం టాయని దరఖాస్తు చేసుకున్న వారు హాజరుకావాలన్నారు.

30 న ఓబుళదేవరచెరువులో ...

ఓబుళదేవరచెరువు : 2016-17 సంవత్సరం వ్యక్తిగత రు ణాల కోసం ధరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు ఈ నెల 30 న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఎంపీడీఓ కావలి నాగరాజు పేర్కొన్నారు. రుణాల కోసం ధరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీ.సీ, మైనార్టీ, కాపు అభ్యర్థులు ధరఖాస్తు చేసుకున్న ఆన్‌లైన్ సర్టిఫికేట్‌తో పాటు ఆధార్, రేషన్‌కార్డు, ఆయా బ్యాంక్ పరిధిలోని ఖాతా నెంబర్లు, ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరు కావాలని ఆయన కోరారు. వీటిలో ఏ ఒక్కటి చేయక పోయినా అలాంటి వారి ధరఖాస్తులు పరిగణలోకి తీసుకోమని ఆయన తెలిపారు. రెండు నకలు సెట్లను సమర్పించాలన్నారు.

ఈఓఆర్‌డీని నియమించండి

ఓబుళదేవరచెరువు : మండలానికి రెగ్యులర్ ఈఓ ఆర్‌డీని నియమించాలని బీ.సీ జనసభ అధ్యక్షుడు ఎం ఎస్ షబ్బీర్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలో ఈఓఆర్‌డీ పోస్టు రెం డేళ్లుగా ఖాళీగా ఉండటంతో పంచాయతీల అభి వృద్ధితో పాటు పారిశుద్యం కుంటు పడుతోందని పేర్కొ న్నారు. రెగ్యులర్ ఈఓఆర్‌డీ లేక పోవడం వల్ల ఇన్‌చార్జ్‌గా గోరం ట్ల ఈఓఆర్‌డీ అంజనప్పను నియమించారు. అయి తే అతను రెండు చోట్ల న్యాయం చేయలేక పోతున్నారని ,ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ ఈఓ ఆర్‌డీని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.

తాగునీటికి అధిక ప్రాధాన్యం



తాగునీటిబోరుకు పూజలు చేస్తున్న దృశ్యం

బుక్కపట్నం :పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా తాగునీటికే అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్టు సర్పంచ్ యశోద తెలిపారు. ఆదివారం కోట వీధిలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం పీఎస్‌సీ నిధులతో బోరు వేసేందుకు సర్పంచ్ భూమిపూజ చేశారు. టీడీపీ నాయకులు సయ్యద్‌బాషా, రామక్రిష్ణ,రాయుడు, రమేశ్, వెంకటరా ముడు,సతీశ్, రామాంజినేయులు, షామీర్, రవి, గుర్రప్ప పాల్గొన్నారు.

నేటి నుండి యోగా శిక్షణ

పుట్టపర్తి: శ్రీసత్యసాయి ధ్యానమండలి ఆధ్వర్యంలో సోమవారం నుండి యోగా, ధ్యాన, శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు వెంకటరమణగురూజీ పేర్కొన్నారు. మొదటి రోజు సాయంత్రం 6గంటలకు స్థానిక చిత్రావతి రోడ్డులో ఉన్న సత్యసాయి ద్యానమండలి కార్యాలయంలో యోగా తరగతులు ప్రారంభమవుతాయన్నారు.వచ్చేనెల 5వతేదీ వరకు ఉదయం, సాయంత్రం శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని అందరు పాల్గొనవచ్చన్నారు. యోగా తరగతులు ముగిసిన అనంతరం ఆయా రోగాలు ఉన్న వ్యక్తులకు ఉచితంగా మందులను అందిస్తామన్నారు.

ఘనంగా బొజ్జ గణపయ్యల నిమజ్జనం





పుట్టపర్తి రూరల్ , పట్టపర్తి , కొత్తచెరువులో వినాయకులను నిమజ్జనానికి తీసుకెళ్తున్న యువకులు బుగ్గపల్లిలో వినాయకుడి నిమజ్జనం ..

పుట్టపర్తి:వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన గణేశ్ ఉత్సవ విగ్రహాల నిమజ్జనం ఘనంగా జరిగింది. మూడురోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న ఉత్సవ విగ్రహాలను ఆదివారం పట్టణంల ఊరేగించారు. గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విగ్ర హాలను ఊరేగిస్తూ ప్రశాంతి నిలయానికి తీసుకెళ్లారు. అ నంతరం విగ్రహాలను చాపచెరువులో నిమజ్జనం చేశారు. డీఎస్పీ ముక్కా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సీఐ బాలసుబ్రహ్మణ్యరెడ్డి, ఎస్‌ఐ వెంకటేశ్‌నాయక్‌లు బందో బస్తు ఏర్పాటుచేశారు.

బుక్కపట్నంలో: మండల కేంద్రంలో భక్తులు వినాయక చవితిని పురష్కరించుకుని గణనాథున్ని ఆదివారం నిమజ్జనం చేశారు. ఆదివారం సాయంత్రం మేళతాళాల మధ్య ఊరేగింపు నిర్వహించి చెరువులో నిమజ్జనం చేశారు.

కొత్తచెరువులో: గణేశ్ నిమజ్జనాన్ని యువకులు, పెద్దలు ఆదివారం మండలవ్యాప్తంగా గ్రామాల్లో ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు. నృత్యాలు, చెక్కభజనలు కోలాటాలు చేస్తూ డప్పువా యిద్యాల మధ్య నిమజ్జనంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

పుట్టపర్తిరూరల్‌లో: పుట్టపర్తి మండలంలోని పలు గ్రామాలలో వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. ఆదివారం సాయంత్రం 3గంటల నుండి వినాయక నిమజ్జనం కోసం ఆయా వినాయకులను పుర వీధు ల్లో ఊరేగిం చారు. మండలంలోని బుగ్గపల్లిలో వినాయకుని గ్రా మ`సరి హద్దులోని ఈశ్వరుడి బావిలో నిమజ్జనం చేశారు. పుట్టపర్తి పరిసర ప్రాంతాలలోని వినాయక విగ్రహాలను ఘనంగా ఊరేగించి సాహెబ్ చెరువలో వినాయక విగ్ర హాలను భక్తి శ్రద్దలతో నిమజ్జనం చేశారు. సీఐ రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రూరల్, అర్బన్ పోలీసులు పోలీ సుబందో బస్తు నిర్వహించారు.






బుక్కపట్నంలో, పుట్టపర్తి టౌన్ , ప్రశాంతి నిలయం, గోకులం నుంచి నిమజ్జనానికి తరలిపోతున్న విఘ్న వినాయకుడి విగ్రహాలు

దెబ్బతిన్న రహదారులు

కురిసిన వర్షాలకు గుంతలమయంగా తయారైన వైనం .... మరింత అధ్వానంగా గ్రామీణ దారులు

ఓబుళదేవరచెరువు : గ్రామీణ ప్రాంతాలు ప్రగతికి పట్టుకొ మ్మలన్న నానుడి క్రమేణా కనుమరుగు అవుతోంది. దీనికి నిదర్శ నమే గ్రామీణ రహదారులు ప్రయాణికులకు అసౌకర్యాలుగా ఉ న్నాయి. ఇటీవల కురిసిన వర్షానికి ప్రధాన రహదారితో పాటు గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయి. ఓ.డీ.చెరువు నుండి తుమ్మ లకుంట్లపల్లికి వెళ్ళే నల్లగు ట్లపల్లి రహదారి గుంతలమయ మైంది. రాత్రి వేళల్లో పొరపాటున ఆదమరచి ద్విచక్ర వాహ నాలు నడిపితే.. ప్రమాదాలు తప్పవని ప్రజ లు పేర్కొం టున్నా రు. వీటికితోడు కొత్త రోడ్డు కూడా దెబ్బతింది.

ప్రధానంగా గౌరాపురం నుండి కొండకమర్లకు వెళ్ళే రహదారి మరింత అధ్వానంగా తయారు అయ్యింది. ఆ రహదారిలో ప్రయాణిస్తే నొప్పులు తప్పవని ఆయా గ్రామాల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కదిరి - హిందూపురం



ప్రధాన రహ దారిలో గతంలో గుంతలు ఏర్పడిన సమ యంలో ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేశారు.

అయితే ఇటీవల కురిసిన వర్షానికి మళ్లీ గుంతలు య .ధా స్థానానికి చేరుకున్నాయి. మండల కేంద్రంలోని ప్రధాన రహ దారి గుంతలమ యమైంది. మిట్ట పల్లి రహదారి కూడా అదే విధం గా తయారయ్యింది. ఇప్ప టికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పం దించి ప్రమాదాల జరగక ముం దే రహదారిలో ఏర్పడిన గుంతలను మరమ్మతులు చేయించాలని మం డల ప్రజలు కోరుతున్నారు.

నెరవేరనున్న చిరకాల వాంఛ

చిత్రావతి నదిపై కేశాపురం వద్ద వంతెన నిర్మాణం చురుగ్గా సాగుతున్న పనులు

కొత్తచెరువు: చిత్రావతి నదిపై కేశాపురం వద్ద వంతెన నిర్మాణం ఆ మూడు పంచాయతీలలోని ప్రజల చిరకాల కోరిక.మండల పరిధి లోని కొడపగానిపల్లి సమీపంలో చిత్రావతి నదిపై వంతెన నిర్మిస్తే కేశాపురం, మైలసముద్రం, నారేపల్లి పంచాయతీలలోని ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. రహదారి నిర్మాణం జరిగితే రైతులు తమ ఉత్పత్తులను తరలించుకోవడానికి క్రయ విక్రయాలకు సుల భతరంగా ఉండటమే కాక మండల కేంద్రా నికి ప్రజలు చేరుకోవాలంటే దాదాపు 10కిలో మీటర్ల దూరం తగ్గుతుంది. ఈ నేపథ్యంలో సీఎం చంద్ర బాబునాయుడు, ఎమ్మెల్యే పల్లెరఘునాథరరెడ్డిల ప్రత్యేక చొరవతో కేశాపురం వంతెన నిర్మాణానికి రూ.4కోట్లు మంజూరయ్యాయి. వీటి పనులు 20 రోజుల క్రితంనుండి చురుకుగా జరుగుతుండటంతో పాటు మూడునెలల్లో వంతెన నిర్మాణం పూర్తి అయ్యేందుకు చర్యలు ముమ్మరం చేశారు. దీంతో ఆయా గ్రామాలప్రజలు వంతెన నిర్మాణంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

కొత్తచెరువు:బీసీ డిక్లరేషన్‌ను అమలు చేస్తేనే బీసీల ఓట్లు అడిగి హక్కు ఉం టుందని బీసీ ఉద్యోగుల సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏ.గోవిందు పేర్కొన్నారు. సెప్టెంబర్ 9న కదిరి జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయనతెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ..అన్ని రాజకీయపార్టీల ద్వారా ఎంపికైన బీసీ ప్రజాప్రతినిధులు బీసీ డిక్లరేషన్‌ను అమలుచేసేలా కృషిచేయాలన్నారు. కదిరి రెవెన్యూ డివిజన్ పరిధిలోని 13 మండ లాల్లో గల ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో పది, ఇంటర్, డిగ్రీ చదివి మెరిట్‌మార్కులు సాధించిన 135 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు ఇస్తామన్నారు. సర్పంచ్ మాణిక్యంబాబా, తిరుపతేంద్ర, బైరవ, శంకర, లక్ష్మీనారాయణ, నాగభూషణ నాయుడు,గంగాదర్ పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఓబీసీ నాయకులు

'ప్రత్యామ్నాయ పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలి'

అనంతపురం కలెక్టరేట్ : ప్రత్యామ్నాయ పంటల సాగులో తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చునని ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త సంపత్‌కుమార్, శాస్త్రవేత్త రామసుబ్బయ్య పేర్కొన్నారు. కంది పంటలో ఒత్తుగా ఉన్న మొక్కలను 20 సెం.మీలకు ఒక మొక్క ఉంచి మిగతా వాటిని తొలగించాలన్నారు. పెసర పంటలో పల్లాకు తెగులు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంతర వాహిక మందులు 2.0 మి.లీ డైమిథయేట్ లేదా 1.5 గ్రాముల అసిఫేట్ లేదా 0.4 లీటర్ల ఇమిడాక్లోఫ్రిడ్ ను నీటిలో కలిపి పక్షం రోజులకోమారు పిచికారి చేయాలన్నారు. బోర్ల కింద సాగు చేసిన మొక్కజొన్న ప్ర స్తుతం కోత దశలో ఉందన్నారు. 25 నుంచి 30 రోజుల మధ్య 50 కిలోల యూరియా, 45-50 రోజులకు 50 కిలోల యూరియా, 60-65 రోజులకు ఎకరాలకు 25 కిలోల పొటాష్ ఎరువులు వాడాలన్నారు.

చంద్రన్న బీమా చెక్కు పంపిణీ

అనంతపురం సప్తగిరిసర్కిల్: రూరల్ మండల పరిధిలోని ఆకుతోటపల్లిలో చాకలి శ్రీనివాసులు ఇటీవలే మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబానికి ఎంపీటీసీ రమణ తదితరులు చాకలి శ్రీనివాసులు భార్య తిరుమలమ్మకు రూ.30వేలు చంద్రన్న బీమా చెక్కును ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మురళి, లక్ష్మినారాయణ, చౌదరి, రాధాకృష్ణ, వెంకట్రాముడు, డీసీ బాబు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ కాలనీలో అన్నదానం

అనంతపురం సప్తగిరిసర్కిల్: స్థానిక ఎస్‌బీఐ కాలనీలో వినాయక చవితిని పురష్కరించుకుని అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ చైర్మన్ గౌస్ ముద్దీన్, జడ్పీటీసీ వేణుగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హరి, లింగమయ్య, దస్తగిరి, సత్యం, నాగభూషణం, కాలనీవాసులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం ప్రత్యేకపూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం దేవాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో మీకోసం

రాప్తాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే మీకోసం కార్యక్రనమానికి అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. ప్ర జలు అందించే అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు.

రామేశ్వరయ్య హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలి : సీపీఐ

ఆంధ్రజ్యోతి, అనంతపురం : యల్లనూరు మండల సీపీఐ కార్యదర్శి రామేశ్వరయ్య హత్య కేసులో నిందితులను త్వరితగతిన అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఐ నాయకులు జిల్లా ఎస్పీని కోరారు. ఈ మేరకు ఆదివారం సీపీఐ జిల్లా కార్యదర్శి జగదీష్ ఆ పార్టీ నాయకులతో కలిసి ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. తమ పార్టీ యల్లనూరు మండల కార్యదర్శి రామేశ్వరయ్యపై దాడి చేసి దారుణంగా నరికి చంపారని ఎస్పీకి వివరించారు. అడ్డొచ్చిన అతని భార్యపైనా దాడి చేశారన్నారు. అయితే రామేశ్వరయ్య దారుణ హత్యను విద్యుత్ తీగల తగాదాగా,పాత కక్షలుగా చిత్రీకరించేందుకు ప్రయత్నం జరుగుతోందన్నారు. అతని హత్యవెనుక రాజకీయ హస్తాలు ఉన్నాయన్న అనుమానాలు తమకు కలుగుతున్నాయని ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. నిజానిజాలు నిగ్గుతేల్చాలని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని ఎస్పీని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జాఫర్, నారాయణస్వామి, మల్లికార్జున, కాటమయ్య, లింగమయ్య, కేశవరెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

తోటివారిసేవలోనే ఆత్మ సంతృప్తి : మేయర్

అనంతపురం టౌన్ : తోటివారికి సేవ చేయడంలో ఎంతో ఆత్మ సంతృప్తి వుంటుందని నగరపాలక సంస్థ మేయర్ మదమంచి స్వరూప అన్నారు. వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఆదివారం సాయంత్రం సప్తగిరి సర్కిల్ వద్ద వినాయక చవితి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యాసామాగ్రి అందజేశారు. కార్యక్రమానికి మేయర్ స్వరూప ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వేడుకలు ఎలా చేసినా ఈ సమయంలో పేదలకు, పేద విద్యార్థులకు ఏదోఒకరకంగా ప్రోత్సాహమందించడం వల్ల గణనాథుడి కటాక్షం ప్రతిఒక్కరిపై వుంటుందన్నారు. సప్తగి రి సర్కిల్ వినాయక ఉత్సవ సమితి ప్రతి ఏడాది సేవాకార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం మేయర్ చేతులమీదుగా విద్యారణ్య ఇంగ్లీష్ మీడియం, తెలుగుమీడియం పాఠశాలలు, కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల, నెహ్రూ నగరపాలక పాఠశాల, నేతాజి నగరపాలక, పొట్టిశ్రీరాములు, ఎస్ఎస్‌బీఎన్ హైస్కూల్, రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్, గిల్డ్ ఆఫ్ స ర్వీస్, నెం.1 ప్రభుత్వ పాఠశాల, రహమత్ యూపీ స్కూల్, శా రద నగరపాలకోన్నత పాఠశాలల విద్యార్థులకు నోటుపుస్తకాలు, టవల్, బెడ్‌షీట్, దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి వేణుగోపాల్, బీజేపీ నాయకుడు లలిత్‌కుమార్, శీనా, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వినాయకుడి నిమజ్జనం



కామరాజుకుంటలో వినాయకుడి నిమజ్జనం, వినాయక విగ్రహాలను ఊరేగిస్తున్న యువకులు, గ్రామస్థులు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని చందమూరు వద్ద ఉన్న కామరాజుకుంట మొదటి సారిగా భక్తులతో కిటకిట లాడింది. వందలాదిగా తరలివచ్చిన వివిధ రూపాల్లో ఉన్న వినాయక ప్రతిమలతో ఆ గ్రామం పులకించింది. హంద్రీనీవా ద్వారా కామరాజుకుంటకు కృష్ణజాలలు చేరిన నేపథ్యంలో ధర్మవరం పట్టణం నలుమూలల కనుచూపు మేర నీటి జాడ లేకపోవడంతో వినాయక నిమజ్జనోత్సవానికి కామరాజుకుంటే దిక్కయింది. దీంతో పోలీసు అధికారులు కూడా నిమజ్జనాలన్నీ కామరాజుకుంటలోనే నిర్వహించాలని సమాచారం ఇవ్వడంతో ధర్మవరంతోపాటు చెన్నేకొత్తపల్లి పలు గ్రామాల నుంచి వివిధ వాహనాల్లో వినాయకులను నిమజ్జనానికి తరలించడంతో కామరాజు కుంట గణపతి బొప్పా మోరియా అనే నినాదంతో మారుమోగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ధర్మవరం ఇన్‌చార్జ్ డీఎస్పీ ముక్కా శివరామిరెడ్డి, సీఐలు యుగంధర్, హరినాథ్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, సిబ్బంది ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఆటోయూనియన్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినాయక చవితి వేడుకలు నిర్వహించడంతోపాటు నిమజ్జనోత్సవం సందర్భంగా లడ్డు వేలంపాటను నిర్వహించారు. ఎస్‌ఐ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రూ.3,600కు జడ్పీటీసీ వెంకటరామిరెడ్డి, ఆంజనేయులు, స్థానిక వ్యాపారి రంగా సంయుక్తంగా లడ్డును దక్కించుకున్నారు.

రామగిరిలో: మండలంలోని పలు గ్రామాలలో వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. ఆదివారం సాయంత్రం 3 గంటల నుంచి వినాయక నిమజ్జనం కోసం ఆయా వినాయకులను పుర వీధుల్లో ఊరేగించారు. రామగిరి, కానుగులకుంట, పోలేపల్లి, చెర్లోపల్లి తదితర గ్రామాలలో మూడు రోజుల పాటు వినాయకులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం వినాయక విగ్రహాలను ఘనంగా ఊరేగించి చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయసంఘటనలు జరగకుండా ఎస్‌ఐ శేఖర్ పోలీస్‌బందోబస్తు నిర్వహించారు.

కనగానపల్లిలో: మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో మూడు రోజులుగా కొలువు తీర్చిన వినాయకప్రతిమలను ఆదివారం నిమజ్జనం చేశారు. గణనాథులను ఆటోలో, ట్రాక్టర్‌ల్లో గ్రామాల్లో ఊరేగించారు.యువకులు, చిన్నారులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అనంతపురం సప్తగిరిసర్కిల్: రూరల్ మండల పరిధిలోని ఉప్పరపల్లి, మన్నీల, చియ్యేడు, క్రిష్ణంరెడ్డి పల్లి, అక్కంపల్లి తదితర ప్రాంతాల్లో వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అక్కంపల్లిలోని లడ్డూను వేలం నిర్వహించారు.

రాప్తాడులో: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం వినాయక నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా ప్రత్యేక పూజలు జరిపిన వినాయక విగ్రహాలను సూర్యాస్తమయంలోపు నిమజ్జనం చేశారు. వినాయక విగ్రహాలను గ్రామపురవీధుల గుండా ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘనలు జరగకుం డా ఎస్‌ఐ ధరణీబాబు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆత్మకూరులో: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వినాయకుడి నిమజ్జనాలు ఉత్సాహంగా నిర్వహించారు. బీసీ కాలనీ, జిల్లాపరిషత్ హైస్కూల్, ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర, అభ్యుదయ పాఠశాల దగ్గర, పాత,కొత్త ఎస్సీ కాలనీల్లో పెద్ద విగ్రహాలను ఏర్పాటు చేశారు.

'యోగాతోనే మానవ జీవితానికి పరిపూర్ణత'

అనంతపురం టౌన్ : మానవ జీవితానికి యోగాతోనే పరిపూర్ణత చేకూరుతుందని యోగా గురువు రఘు గురూజీ పేర్కొన్నారు. సత్యసాయి ధ్యానమండలి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం శారదానగర్‌లోని విద్యుత్ ఎస్‌ఈ కార్యాలయంలో వ్యక్తిత్వ వికాసంపై శిక్షణాతరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డీఓ మలోల, నగరపాలక కమిషనర్ మూర్తి, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ఆచార్య క్రిష్ణయ్య, ఎస్కేయూ ప్రొఫెసర్ ఏవీ రమణ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘు గురూజీ మాట్లాడుతూ... భూమిపై పశువులు గడ్డి, పక్షులు గింజలు, పులులు, సింహాలు వంటి జంతువుల మాంసాన్ని తింటున్నాయని, కానీ మానవుడు మాత్రం అన్నిరకాల పదార్థాలు తిని ఆరోగ్యాన్ని చెడగొట్టుకుంటున్నారన్నారు. వైద్యం, ఆధ్యాత్మికత రెండూ యోగాలోనే వున్నాయన్నారు. కార్యక్రమంలో వెంకటేశప్ప గురూజి, దస్తగిరి, బాలాజి, ఆనంద్, రమేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కుంటిమద్దిలో పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

రామగిరి: మండలంలోని కుంటిమద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-08 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆనాడు పదో తరగతిలో వందమంది విద్యార్థులు ఉండేవారు. ఈ అపూర్వసమ్మేళనానికి 80 మందికి పైగా హాజరై నాటి గురువులైన ఓబుళేసు, రామాంజనేయులు, జగన్నాథ్, నారాయణ, అస్మత్‌బేగం, పద్మావతి, వెంకటస్వామి, వెంకటేశ్ తదితరులను ఘనంగా సత్కరించారు. గురువులకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదువుకోవడం వల్ల నేడు మంచి స్థాయికి చేరుకోవడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాలలో ఆనాటి జ్ఞాపకాల గురించి చర్చించుకున్నారు. నాడు గురువులు చెప్పిన మాటలు నేడు ఎంతో విలువైనవిగా గమనించామని విద్యార్థులు పేర్కొన్నారు. ఆ సంవత్సరం పదిలో చదివిన వారిలో ఆర్మీలో, ఉపాధ్యాయులుగా, పీఈటీలుగా ఉద్యోగాలలో స్థిరపడ్డారని, అదే విధంగా మరి కొందరు సాఫ్ట్‌వేర్, ఇతర ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగాలు చేస్తున్నారన్నారని వివరించారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

'ప్రతిఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలి'

అనంతపురం వైద్యం : సమాజంలోని ప్రతిఒక్కరూ సేవాదృక్పథం అలవర్చుకుని పేద ప్రజలకు తమవంతు బాధ్యతగా సేవలందించాలని సీఐ సాయిప్రతాప్, రాయలసీమ బలిజ మహాసంఘం అధ్యక్షుడు బళ్లారి వెంకటరాముడు పేర్కొన్నారు. ఈ మేరకు గణపతి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఆదివారం అంబారపు వీధిలో సుమారు 1000 మంది భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీఐ సాయిప్రతాప్, రాయలసీమ బలిజ మహాసంఘం అధ్యక్షుడు బళ్లారి వెంకటరాముడులు హాజరయ్యారు. వారి చేతులు మీదుగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని దానాలంటే అన్నదానం గొప్పదన్నారు. వినాయక పండుగను పురస్కరించుకొని భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదానం కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కాలనీలోని పలువురు దాతల సహకారంతో చేపట్టామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కాపు జేఏసీ కన్వీనర్ భవానీరవికుమార్, ఎన్‌వీ నందకుమార్, గల్లా హర్ష, కేశవ, మహేష్, సంపత్ రాయల్, సాయిలిఖి, హేమంత్, గోపాలక్రిష్ణ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న సీఐ సాయిప్రతాప్, రాయలసీమ బలిజ మహా సంఘం అధ్యక్షుడు బళ్లారి వెంకటరాముడు

మీకోసంకు హాజరుకండి

శింగనమల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగే మీకోసం కార్యక్రమానికి అధికారులు హాజరుకావాలని తహసీల్దార్ జీ నాగేంద్ర కోరారు. ఉదయం 10 గంటలకే అధికారులు అందరూ తప్పకుండా హాజరుకావాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

పుట్లూరులో : మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే మీకోసం కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తహసీల్దార్ సూచించారు. ప్రజల సమస్యలపై అర్జీలు వచ్చిన వెంటనే పరిష్కరించాలన్నారు.

రెడ్డి కులస్థుల అభివృద్ధికి కృషి చేయాలి

నార్పల: నిరుపేదలైన రెడ్డి కులస్థుల అభివృద్ధికి అన్ని రాజకీయ పార్టీలు కృషి చేయాలని జాతీయ ఓసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక షాదీఖానాలో రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన రెడ్డిగర్జన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెడ్డికులస్థుల్లో కూడా ఎంతో మంది నిరుపేదలున్నారన్నారు. వారికి ఇళ్లస్థలాలు కూలా లేక, పిల్లలను చదివించేందుకు కష్టపడుతూ కూలీ పనులకు పంపేపరిస్థితి ఏర్పడి దిన్నారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు రెడ్డికులస్థులకోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. అనంతరం శ్రీకాంత్‌రెడ్డిని సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గంగులకుంట నరేష్‌కుమార్, జవర్ధన్‌రెడ్డి, చవ్వా రాజశేఖర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, దొడ్డప్రకాశ్‌రెడ్డి, థియేటర్ భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బండ్లపల్లి శివారెడ్డి పాల్గన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండండి



మలేరియాపై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గార్లదిన్నె: మలేరియాపై అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌ఓ నాగరాజు సూచించారు. ఆదివారం సంజీవపురం గ్రామలంలో వైద్యాధికారులు పారిశుధ్య నివారణ చర్యలు చేపట్టారు. ఇంటింటా తిరిగి అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం సీహెచ్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రకాష్, వైద్య సిబ్బంది ధనుంజయ, శివానంద, లీలావతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో రికార్డు అసిస్టెంట్ మృతి



అక్కమ్మ (ఫైల్)

గార్లదిన్నె: మండల పరిధిలోని మర్తాడు జిల్లా పరిషత్ పాఠశాలలో రికార్డు అసిస్టెంట్ అక్కమ్మ అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందినట్లు ప్రధానోపాధ్యాయురాలు వాణిదేవి తెలిపారు. ఆమె మూడు సంవత్సరాలుగా ఇక్కడ పనిచేస్తోందన్నారు. కొంత కాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతుండేదన్నారు. ఆదివారం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందిందన్నారు. విషయం తెలుసుకున్న పాఠశాల సిబ్బంది ఆమె మృతదేహన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

నేడు ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ

గార్లదిన్నె: రైతులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ప్రత్యామ్నాయ విత్తనాలు సోమవారం నుంచి పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. సర్వర్ సమస్య ఉండడంతో గ్రామాలవారిగా అందజేస్తున్నామన్నారు.

ద్విచక్ర వాహనాల సీజ్

పుట్లూరు : మండలంలోని కడవకల్లు గ్రామంలో ఆదివారం వాహనాలు తనిఖీ చేసినట్లు ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు. 7 వాహనాలకు లైసెన్సులు, ఆర్సీలు లేకపోవడంతో వాటిని సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించామన్నారు. సీజ్‌చేసిన వాహనాలను మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు బదిలీ చేస్తున్నట్లు తెలిపారు.

యూనిఫామ్ తయారీ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం ప్రెస్‌క్లబ్: సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూనిఫామ్ తయారీలో జరుగుతున్న అక్రమాలపై ప్రభుత్వం వెంటనే విచారణ చేసి అక్రమార్కులపై తగు చర్యలు తీసుకోవాలని మాదిగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పసులూరి ఓబులేసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... దుస్తుల తయారీలో ప్రభుత్వ కొలతలు కాకుండా తక్కువ కొలతలతో తయారు చేయడంతో విద్యార్థులకు అవి సరిపోవడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గంగాధర్, కుళ్లాయప్ప, మనోహర్, లక్ష్మణ్, మధు, దావిద్ పాల్గొన్నారు.







గార్లదిన్నెలో పూజలు చేస్తున్న భక్తులు, బుక్కరాయసముద్రంలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు, అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

వైభవంగా వినాయకుడి నిమజ్జనం

గార్లదిన్నె: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వినాయకుడి నిమజ్జనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని గార్లదిన్నె, కల్లూరు, మర్తాడు, కోటంక, యర్రగుంట్ల, సంజీవపురం తదితర గ్రామాల్లో వివిధ ఆకృతులతో ఉన్న వినాయక విగ్రహాలను పురవీధుల్లో ఊరేగిస్తూ డప్పు వాయిద్యాలు, యువకుల కేరింతల నడుమ సమీప చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. జడ్పీటీసీ సభ్యురాలు నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. సర్పంచు గట్టు ఉషారాణి, గేటు క్రిష్ణారెడ్డి వినాయకుల విగ్రహాలకు పూజలుచేసి, నిమజ్జనానికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ బందోబస్తు పర్యవేక్షించారు.

బుక్కరాయసముద్రంలో : మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి పలు వాహనాల్లో వినాయక విగ్రహాలను ఉంచి యువకులు నృత్యాలు చేస్తూ నిమజ్జనానికి తరలించారు. శింగనమల చెరువులో నిమజ్జనం చేశారు. ఎస్‌ఐ సుధాకర్ యాదవ్ అధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

నార్పలలో : మండలంలోని నార్పల, బండ్లపల్లి, దిగుమర్రి, తుంపెర, పప్పూరు తదితర గ్రామాల్లో ఆదివారం వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పురవీధులగుండా విగ్రహాల ముందు యువకులు, పెద్దలు డప్పు వాయిద్యాల నడుమ రంగులు చల్లుతూ నిమజ్జనం చేశారు. ఎస్‌ఐ రాంప్రసాద్ బందోబస్తు నిర్వహించారు.

పుట్లూరులో : మండలంలో వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. వినాయకుడికి ప్రత్యేకపూజలు చేశారు. ఆయా గ్రామాల్లో డప్పువాయిద్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామశివార్లలోని కుంటలు, చెక్ డ్యాంల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

యల్లనూరులో : మండలంలో ఆదివారం వినాయకుడి నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందచేశారు. కొన్నిగ్రామాల్లో వినాయకుడి మంటపాల వద్ద అన్నదానం చేశారు. మధ్యాహ్నం నుంచి వినాయకుడి విగ్రహాలను డప్పువాయిద్యాలతో ఊరేగింపును ప్రారంభించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ శ్రీనివాసులు కానిస్టేబుళ్లను అప్రమత్తం చేశారు.

శింగనమలలో : మండలంలోని గ్రామాల్లో మూడో రోజు వినాయక నిమజ్జనాన్ని ఆదివారం నిర్వహించారు. శింగనమల, తరిమెల, సలకంచెరువు, సీ బండమీదపల్లి, పెరవలి, నిదనవాడ, చిన్నజలాలపురం, వెస్ట్ నరసాపురం, నాగులగుడ్డం, ఆకులేడు గ్రామాల్లో విగ్రహాలను మధ్యాహ్నం నుంచి నిమజ్జనానికి తరలించారు. విగ్రహాల ముందు పెద్దఎత్తున రంగులు చల్లుకుంటూ, బాణసంచా పేలుస్తూ యువతీ, యువకులు కేరింతలు కొడుతూ శింగనమల చెరువు, చెక్ డ్యాంలు, కుంటల్లో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ బందోభస్తు పర్యవేక్షించారు.

పలు గ్రామాల్లో అన్నదానం : వినాయక చవితి సందర్భంగా పలుగ్రామాల్లో మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు. శింగనమల, సీ బండమీదపల్లి, సలకంచెరువు, పెరవళి గ్రామాల్లో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు ఆద్వర్యంలో అన్నదానం నిర్వహించారు.





యల్లనూరు, శింగనమలలో నిమజ్జనానికి తరలస్తున్న గణనాథులు

అనాథ బాలలకు కళలపై ఉచిత శిక్షణ

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని రోటరీపురం గ్రామంలో జీవని స్వచ్ఛంద సంస్థ పాఠశాలలో ఉన్న అనాథ బాలలకు డ్యాన్స్, డ్రాయింగ్, పెయింటింగ్, తదితర వాటిలో డ్యాన్స్ మాస్టర్ కత్తి విజయ్‌కుమార్ అధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. మాస్టర్ మాట్లాడుతూ అనాథ పిల్లలకు చదువుతో పాటు కళల్లో నైపుణ్యం పెంపొందించేందుకు ప్రతి ఆదివారం శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ ప్రసాద్ పాల్గొన్నారు.



అనాథ బాలలకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ కత్తి విజయకుమార్

గ్రామాల్లో సీఐ పర్యటన

యల్లనూరు : మండలంలో తాడిపత్రి రూరల్ సీఐ సురేంద్రనాథ్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. రెండురోజులక్రితం జరిగిన రామేశ్వరరెడ్డి హత్య నేపథ్యంలో వాస్తవ పరిస్థితులపై యల్లనూరు ఎస్‌ఐ శ్రీనివాసులుతో చర్చించారు. అనంతరం దుగ్గపల్లి, కల్లూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. వినాయకుడి నిమజ్జనం సందర్భంగా ఆయా గ్రామాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గాలికుంటు వ్యాధికి టీకాలు

యల్లనూరు : మండలంలో ఆదివారం గాలికుంటు వ్యాధి నివారణకు వ్యాక్సిన్లను జంగంపల్లిలో పశువులకు వేసినట్లు పశువైద్యాధికారి శివసాగర్‌రెడ్డి తెలిపారు. ఇంటింటికి వెళ్లి పశువులకు వ్యాక్సిన్లు అందించారు. సుమారు 200కు పైగా పశువులకు గాలికుంటు టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బందితో పాటు గోపాలమిత్రలు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట నిరసన

అనంతపురం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిని పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 29న కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గోవిందు, రామన్న తెలిపారు. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయులకు భద్రత లేకుండాపోయిందన్నారు. ఇందులో భాగంగానే మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్నామన్నారు.

ఘనంగా గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

యాడికి : మండలంలోని తిప్పారెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం నూతనంగా నిర్మించిన ఆలయంలో గంగమ్మతల్లి విగ్రహప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారిని ప్రతిష్ఠించారు. అనంతరం కుంకుమార్చన, సహస్రనామార్చన తదితర ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఇదే గ్రామానికి చెందిన సౌదీఅరేబియాలో స్థిరపడ్డ నాగశేఖర్ ఆలయాన్ని నిర్మించినట్లు గ్రామస్థులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



జేసీఎన్ఆర్ఎం కాంప్లెక్స్‌లో, కమ్మవీదిలో, రాముడి అవతారంలో, ద్వారకా కాంప్లెక్స్ వద్ద, అమ్మవారి శాలలో, చౌడమ్మ వీధిలో, చిన్నబజారు కొలువుదీరిన వినాయకులు

ఆకట్టుకుంటున్న బొజ్జగణపయ్యలు

తాడిపత్రిటౌన్ : వినాయకచవితి సందర్భంగా పట్టణంలో ఏర్పాటుచేసిన వినాయకుడి ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి. వివిధ భంగిమలలో విగ్రహాలను ఏర్పాటుచేశారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. విగ్రహాలను చూసేందుకు పెద్దఎత్తున తరలివచ్చారు. జేసీఎన్ఆర్ఎం షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన వినాయకుడి వద్ద హోమం నిర్వహించారు. ద్వారక కాంప్లెక్స్ సమీపంలో కుర్‌కురే ప్యాకెట్లతో వినాయకున్ని ఏర్పాటు చేశారు. జేసీఎన్ఆర్ఎం కాంప్లెక్స్‌లో రాముని అవతారంలో ఉన్న వినాయకున్ని ప్రతిష్ఠించారు. అమ్మవారిశాల వీధిలో త్రిముఖ వినాయకున్ని నెలకొల్పారు. కమ్మవీధిలో గజవాహనంపై ఆసీనులైన వినాయకున్ని ఏర్పాటుచేశారు. చౌడమ్మగుడి వీధిలో హనుమంతుడి భుజాలపై ఉన్న వినాయకుడిని నెలకొల్పారు. చిన్నబజారులో త్రిముఖ వినాయకున్ని నెలకొల్పారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పలుచోట్ల నిమజ్జనం : పట్టణంలో పలుచోట్ల నెలకొల్పిన విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. నందలపాడు, బుగ్గయ్య కాంపౌండు, కటికవీధి తదితరచోట్ల విగ్రహాలను డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఊరేగింపు సందర్భంగా యువకులు, పిల్లలు ఆనందోత్సాహాలతో రంగులు చల్లుకున్నారు.



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు, నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు, పలు ప్రాంతాల్లో కొలువుదీరిన గణనాథులు

నేడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

పెద్దవడుగూరు : రైతులు సాగుచేసిన పంటలకు వాతావరణ బీమాను తక్కువగా ప్రకటించడంతో సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టినట్లు ఆ సంఘం నాయకుడు దస్తగిరి ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే బీమా తక్కువ వచ్చిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం అధికారులు స్పందించి బీమా పూర్తిగా వర్తింప చేయాలన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిపత్రిటౌన్ : పట్టణంలోని చేనేతకాలనీలో ఆదివారం పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టుచేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. వారినుంచి రూ.3,600 స్వాధీనం చేసుకున్నామన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నికలు

తాడిపత్రిరూరల్ : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలు ఆ సంఘం జిల్లాధ్యక్షుడు తిప్పేస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా పుట్లూరు ఎంపీడీఓ ఆఫీసులో అటెండర్‌గా పనిచేస్తున్న మారుతిప్రసాద్‌ను ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్.హాజీవలి, ఉపాధ్యక్షుడిగా రాంగోపాల్‌రెడ్డి, కార్యదిర్శగా సాంబశివుడు, సంయుక్త కార్యదర్శిగా అపర్ణ, కోశాధికారిగా కుళ్లాయమ్మ, కోఆప్షన్ సభ్యుడిగా అబ్దుల్ రహిమాన్ ఎన్నికయ్యారు. వీరి పదవీకాలం 2020వరకు ఉంటుందన్నారు.



ఎన్నికైన కమిటీ సభ్యులు

ఆనందోత్సాహాల నడుమ వినాయక నిమజ్జనం

పెద్దవడుగూరు : మండలకేంద్రంలోని బీసీ కాలనీ, జడ్పీ స్కూల్, పలు గ్రామాల్లో వినాయకచవితి పండుగ సందర్భంగా ఏర్పాటుచేసిన విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. యువకులు ఆనందోత్సాహాల మధ్య రంగులు చల్లుకుంటూ ఊరేగింపులో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ రమణారెడ్డి పర్యవేక్షించారు.

తాడిపత్రిరూరల్‌లో : మండలంలోని సజ్జలదిన్నె, ఆలూరు, వెలమకూరు, పెద్దపొలమడ తదితర గ్రామాల్లో ఆదివారం వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు సంబరాలతో రంగులు చల్లుకున్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వినాయకుల విగ్రహాలను దగ్గరున్న నీటికుంటల్లో నిమజ్జనం చేశారు.

పెద్దపప్పూరులో : మండలవ్యాప్తంగా ఆదివారం వినాయక నిమజ్జనం చేశారు. యువకులు, పిల్లలు రంగులు చల్లుకుంటూ ఆనందాల్లో మునిగితేలారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా ఎస్ఐ శ్రీహర్ష బందోబస్తు పర్యవేక్షించారు.

యాడికిలో : మండలంలోని వేములపాడు, నిట్టూరు, వెంగన్నపల్లి, పుప్పాల, పుప్పాలతండా తదితర గ్రామాల్లో ఆదివారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



పెద్దవడుగూరు, యాడికిలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు, తాడిపత్రిలో రంగులు చల్లుకుంటున్న యువకులు

లోకల్ గైడ్

localguide

తాడిపత్రి మార్కెట్‌లో కూరగాయల ధరలు

పచ్చి మిరపకాయలు-రూ.30, టమోట-30, ఉల్లిగడ్డలు-40, ఉర్లగడ్డలు-15, అంకుర వంకాయలు- 30, ముల్లంకాయలు: 40, చిక్కుడుకాయలు-30, మొటిక్కాయలు- 24, బెండకాయలు-24, బీరకాయలు-20, కాకరకాయలు-24, క్యారెట్-40, క్యాబేజీ-20, క్యాలీఫ్లవర్-35, బీట్ రూట్- 25, దోసకాయలు:20, ముల్లంగి : 20, బీన్సు - రూ.50.

తాడిపత్రి సినిమాలు

బీహెచ్ మహల్ : బాహుబలి-2 (సెల్ ఫోన్ :08558222772), లక్ష్మీనారాయణ : జయ జానకీ నాయక (సెల్‌ఫోన్: 9848957005), విజయలక్ష్మి: వివిపి2 (సెల్‌ఫోన్: 08558-223078), వరలక్ష్మి: నేనే రాజు నేనే మంత్రి (సెల్‌ఫోన్:08558-223078), జయలక్ష్మి: ఫిదా (సెల్‌ఫోన్: 08558- 223078), సాయితేజ: గౌతమ్ నందా (సెల్‌ఫోన్: 08558 -221100), దాదా: ఆనందో బ్రహ్మ

యాడికి: లక్ష్మీప్రియ: నక్షత్రం (సెల్‌ఫోన్: 90592 90284)

మాంసం ధరలు

చికెన్ (కేజీ) : రూ.140, స్కిన్‌లెస్ చికెన్ : 160, మటన్ : 440, చేప: 120, గుడ్లు (100) : రూ.410

గ్యాస్ సమాచారం

అందుబాటులో ఉన్న సిలిండర్లు
ఇండియన్ : 340 హెచ్‌పీ గ్యాస్ : 330

ఎమ్మెల్యే డైరీ

తాడిపత్రి : ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి సోమవారం ప్రజలకు అందుబాటులో ఉంటారు.

ఓబులేసుకోనలో స్వాతినక్షత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

తాడిపత్రిరూరల్ : మండలంలోని ఆవులతిప్పాయపల్లి వద్దనున్న కొండపై వెలసిన ఓబులేసుకోన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాతసేవతో పూజాకార్యక్రమాలు మొదలయ్యాయి. ఉదయం విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, నవకలశస్నపనం, 15 లీటర్లతో పంచామృతాభిషేకం, తోమాల, తులసీమాల సేవలు, అష్టోత్తర శతనామావళి, మహామంగళహారతి ఇచ్చారు. అనంతరం బ్రాహ్మణ ఆశీర్వచనం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు అర్చకుడు నందశర్మ తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులకు బంగారు, వెండి పతకాలు



పతకాలు పొందిన విద్యార్థులు

తాడిపత్రిటౌన్ : స్కూల్ ఆఫ్ ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ ఆర్టీసీ బ్రాంచ్ 19వ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు గ్రేడింగ్ టెస్టులు నిర్వహించారు. ఇందులో బళ్లారి, రాయదుర్గం, బుగ్గ, యాడికి, యర్రగుంటపల్లి, తాడిపత్రి బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కట్టా, స్పారింగ్ కాంపిటీషన్‌లో వీరు బంగారు, వెండి పతకాలను గెలుచుకున్నారు. పతకాలను గ్రాండ్‌మాస్టర్ అరుణ్‌కుమార్, గన్నెవారిపల్లికాలనీకి చెందిన చింబిలిప్రసాద్ చేతులమీదుగా అందించారు.

సినిమా గ్రేడ్

ఉరవకొండ

మల్లేశ్వరి	:	జయ జానకి నాయక
వెంకటేశ్వర	:	నేనే రాజు నేనే మంత్రి
బాలాజీ	:	వివేకం

నేడు రుణ మేళా

ఉరవకొండ: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సోమవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, వడ్డెర, నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్లలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివకుమార్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు ఆధార్ రేషన్‌కార్డు, సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు.


ఉరవకొండలో నిమజ్జనానికి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం


నిమజ్జన కార్యక్రమానికి తరలుతున్న మహిళలు, చిన్నారులు


వజ్రకరూరులో ...


విడపనకల్లులో...

ఘనంగా గణేష్ నిమజ్జనం

ఉరవకొండ:మండల కేంద్రంలో ఆదివారం గణేష్ నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. మండపాల్లో కొలువుదీర్చిన గణనాథులకు పూజలు చేసి నిమజ్జనం కోసం తరలించారు. యువకులు కేరింతలు కొడుతూ నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. ఎస్ఐ నాగేశ్‌బాబు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును నిర్వహించారు. మండలంలోని పెన్నానది, పీఏబీఆర్ డ్యాంలో వినాయకుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. అదే విధంగా మండలంలోని పలు గ్రామాల్లో నిమజ్జనాన్ని నిర్వహించారు.

వినాయకుడి కల్యాణోత్సవం : స్థానిక పదవ వార్డులో కాణిపాక వరసిద్ధి వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద వినాయకుని కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సిద్ధి, బుద్ధి అమ్మవార్లను, స్వామివారిని అందంగా అలంకరించి కల్యాణం నిర్వహించారు. సోమవారం లడ్డూ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వజ్రకరూరు: మండలంలోని గ్రామాల్లో కొలువుదీర్చిన వినాయక విగ్రహాలను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. మూడు రోజుల నుంచి వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వినాయక విగ్రహాలను వివిధ వాహనాలపై కొలువుదీర్చి మేళతాళాలతో మధ్య నిమజ్జనానికి తరలించారు. ఎస్ఐ జనార్దననాయుడు గట్టిబందో బస్తు ఏర్పాటు చేశారు.

మహిళలకు ముగ్గుల పోటీలు: మండల కేంద్రంలోని రెండవ వార్డులో క్రేజీ బాయ్స్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా మహిళలకు ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలో విజేతలుగా నిలిచిన మహిళలకు ఎస్ఐ జనార్దననాయుడు బహుమతులను అందజేశారు. అనంతరం గణష్ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై కొలువుదీర్చి మేళాతాళా మధ్య నిమజ్జనానికి తరలించారు.

విడపనకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు మండపాల్లో కొలువుదీర్చిన వారు ఆదివారం సాయంత్రం వివిధ వాహనాల్లో వినాయక విగ్రహాలను కొలువుదీర్చి మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి కొట్టాలపల్లి వద్ద బావిలో నిమజ్జనం చేశారు. ఏఎస్ఐలు మహ్మద్‌రఫీ, ఎర్రిస్వామి ఆధ్వర్యంలో గట్టిబందో బస్తు నిర్వహించారు.

కూడేరు:మండలంలో వినాయక విగ్రహాల నిమజ్జనం అంగరంగ వైభవంగా జరిగింది. మండలంలోని కూడేరు, అంతరగంగ, నాగిరెడ్డిపల్లి, కడదరకుంట, చోళసముద్రం, కొర్రకోడు, గొట్టుకూరు, కమ్మూరు, అరవకూరు తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక వి గ్రహాలను ఆదివారం భారీ ఊరేగింపులతో యువకుల కోలాహలం నడుమ నిమజ్జనం చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

బెళుగుప్ప: మండలంలో గణపతి నిమజ్జనం ఘనంగా జరిగింది. మూడు రోజుల పాటు జరిగిన వినాయక ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లలో వినాయక విగ్రహాలను ఊరేగించి సమీపంలోని నాగులచెరువు గ్రామ సమీపంలోని నీటి కుంటల్లో నిమజ్జనం చేశారు. బెళుగుప్ప, ఎర్రగుడి, దుద్దేకుంట, గంగవరం, అంకంపల్లి, గుండ్లపల్లి, నక్కలపల్లి, వెంకటాద్రిపల్లి గ్రామాల్లో వినాయక విగ్రహాలను ట్రాక్టర్లు, ఎడ్లబండ్లలో ఉంచి వీధుల్లో ఊరేగించారు. బెళుగుప్పలో నాయీ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపు, వాల్మీకి యూత్, ఫ్రెండ్స్ వినాయక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి.

ఎలాంటి అవాంఛనీయ సంఘనలు జరగకుండా ఎస్ఐ నాగస్వామి, ఏఎస్ఐ విజయనాయక్ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేశారు. ముందుజాగ్రత్తగా జీడిపల్లి రిజర్వాయర్‌లో నిమజ్జనాన్ని నిషేధించారు.


కూడేరులో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు


బెళుగుప్పలో వినాయక విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

సీపీఎం ఆధ్వర్యంలో జీపుజాతా

ఉరవకొండ:జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఉరవకొండలో ఆదివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో జీపుజాతా నిర్వహించారు. ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచేందుకు కరువు సమస్య లపై ఈ నెల 31వ తేదీన తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంటల బీమా పథకాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. హంద్రీనీవా రెండవ దశకు అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రైతు రుణాలను మాఫీ చేయాలన్నారు. సీపీఎం నాయకులు రంగారెడ్డి, మధుసూదన్ నాయుడు, సిద్దప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండలంలోని ధర్మపురి, చాబాల, పొట్టిపాడు, వజ్రకరూరు గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం జీపుజాతాను నిర్వహించారు. మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద సీపీఎం మండల కన్వీనర్ వీరుపాక్షి మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సమస్యపై దృష్టి సారించాలన్నారు. సీపీఎం నాయకులు రంగారెడ్డి, కోనేటి రాముడు, నెట్టెప్ప, రామాంజినేయులు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

విడపనకల్లు: రైతు సమస్యలను పరిష్కరించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం జీపుజాతా నిర్వహించారు. రైతు సంఘం నియోజకవర్గం నాయకులు హనుమంతరెడ్డి మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30వ తేదీన తహసీల్దారు కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు తిమ్మయ్య, షేక్షావలి, తిమ్మప్ప, మధు పాల్గొన్నారు.

కారు బోల్తా : ఇద్దరికి గాయాలు

కూడేరు: మండలంలోని ముద్దలాపురం గ్రామ సమీపంలో వేగంగా వస్తున్న కారు టైరు పంక్చరై బోల్తాపడటంతో అందులో ప్రయాణిస్తున్న వారిలో ఇద్దరు గాయపడ్డారు. బళ్లారి నుండి మదనపల్లికి వెళ్తున్న కారు ముద్దలాపురం దాటిన కొద్దిదూరంలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మహాలక్ష్మి, మధుసుధన్‌రావు గాయపడ్డారు. వీరిని వెంటనే 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

70 మంది యువకుల రక్తదానం

కూడేరు: వినాయకచవితి సందర్భంగా రవికృప ఆధ్వర్యంలో ఏవన్ ఫ్రెండ్స్ సంగమేశ్వర స్కూల్ వారు సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్యస్పందన లభించింది. ఆదివారం కూడేరులో ఏర్పాటు చేసిన శిబిరాన్ని రవికృప డైరెక్టర్ రామానాయడు ప్రారంభించారు. ఈ సందర్భంగా దాదాపు 70 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ... రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా రక్తదానం చేయాలని ఆయన కోరారు.


రక్తదానం చేస్తున్న దృశ్యం

బాధ్యతలు స్వీకరించిన సీఐ

ఉరవకొండ: ఉరవకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా చిన్నగౌస్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న సీఐ సూర్యనారాయణను వీఆర్‌కు పంపగా ఆయన స్థానంలో గుంతకల్లు రూరల్ సీఐ గురునాథ్‌బాబు ఇన్‌చార్జ్ సీఐగా ఉన్నారు. కర్నూలు సీఐడీ నుంచి చిన్నగౌస్ బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. సర్కిల్‌లోని ఎస్ఐలు నాగేశ్‌బాబు, జనార్దననాయుడు, ఖాన్ సీఐను మర్యాద పూర్వకంగా కలిశారు. సీఐ విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.


చిన్నగౌస్

పోటాపోటీగా లడ్డూ వేలం పాట

బెళుగుప్ప: మండలంలోని ఎర్రగుడిలో వినాయక ఉత్సవాల్లో భాగంగా వినాయకుడికి మూడు రోజులపాటు నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పూజా సామగ్రిని, లడ్డూను పోటాపోటీగా వేలం పాడారు. ఈ వేలంలో మహిళలు సైతం పాల్గొన్నారు. ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వినాయకుడికి ప్రసాదంగా ఉంచిన లడ్డూను హనుమప్ప అనే భక్తుడు రూ. 8,100కు, విభూదిని చిన్నఓబుళమ్మ రూ.1250లకు, చెరుకుగడలు, పండ్లను ఎర్రిస్వామి రూ. 650లకు, బీసీ కాలనీలోని వినాయకుని వద్ద ఉంచిన లడూడను అదే కాలనీకి చెందిన ధనుంజయ రూ. 3,500లకు వేలం పాడి దక్కించుకున్నారు. గణపతి బప్పా మోరియా అంటూ గ్రామంలో విగ్రహాలను ఊరేగించి నిమజ్జనానికి తరలించారు.

పంచాయతీ సమావేశాన్ని బహిష్కరిస్తాం : వార్డు సభ్యులు

ఉరవకొండ: మేజర్ పంచాయతీ కార్యాలయం లో ఈ నెల 31వ తేదీ జరిగే సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు వార్డు సభ్యులు పేర్కొన్నారు. స్థా నిక రోడ్లు భవనాల వసతి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వార్డు సభ్యులు మాట్లాడు తూ అజెండాలోని అంశాలను వార్డు సభ్యులకు తెల పకుండా ఏక పక్షంగా చేశారన్నారు. సర్పంచు స్వలా భం కోసమే సమావేశం జరుపుతున్నారని ఆరోపించారు. సమావేశంలో వార్డు సభ్యులు సోమశేఖర్, భీమేశ్, పెద్దన్న, వెంకటేశులు, ప్రసాద్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వార్డు సభ్యులు